# ప్రేమ ఆధిపత్యంలో. . .

## (వింధియా కథలు)

## మూలం: తమిళం



## అనువాదం: ఏండి సుందరేశన్

**PREMA AADHIPATYAMLO (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya's Tamil Short Stories)
తెలుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 8

**First Edition, 2021**
© KNS Family/Surviving Members

***Cover Design:***
Amir Butt

The front cover illustration is from Kalaimagal issue of December, 1950. Used with permission.

The translator acknowledges with thanks the permission to use the illustrations from the various magazines that originally published these short stories.

***Photo Credits:***

***Back Cover:***
Dassen Studio, Coimbatore, India

**Printed at:**

Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone: 1-800-690-2679 (Toll Free)

# ప్రేమ ఆధిపత్యంలో

## (వింధియా కధలు)

మూలం: తమిళం

అనువాదం:

ఏండి సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**El Cerrito, CA 94530, USA**
**10944 San Pablo Avenue # 610**
**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో

ముందు మాట

1. ప్రేమ ఆధిపత్యంలో
2. ఇద్దరి తప్పు
3. మాతృవంశం
4. స్వల్ప భేదం
5. చెరకు రసం
6. ఒక అమాయక అమ్మాయి
7. ఏ నాటి నోము ఫలమో!
8. మరపురాని బాధ
9. వ్యాపారి భార్య
10. కాలక్షేపం

# ముందు మాట

ఈ సంపుటంతో వింధియా కథలన్నీ ఎనిమిది E Books గా ప్రచురణ కావడం పూర్తి అయింది. వింధియా రాసిన వ్యాసాలు, నాటకం, ఇంకొక సంపుటంలో వెలుబడుతాయి. ఆ తరువాత ఆమె రచనలన్నీ ***వింధియా - సాహిత్య సంగ్రహం*** - అనే గ్రంధంగా - రెండు భాగాలుగా - ప్రచురమవుతాయి.

ఇక ఈ సంపుటంలోని కథలని చూద్దాం:

ఎప్పటిలాగే కథల్లోని ఇతివృత్తాలన్నీ సాధారణ దైనిక వ్యవహారాలగురించే. సామాన్య జీవితంలో ఏం జరుగుతోందో అదే మనకి రచయిత్రి చెప్తున్నారు.

ఈ సంపుటంలో అధికపక్షంగా కనిపించే పాత్ర ఇల్లాలు. 'ఇల్లాలు గొప్ప సేవ, యజమాని ఇల్లు బ్రోవ' అనే వచనం గుర్తుకి వస్తుంది.

ఇల్లాలికి ఎన్ని ప్రశ్నలు, సమస్యలు!

***స్వల్ప భేదం***

కొత్తగా కాపురం ఆరంభించిన మీనా వీధిలో బేరం చేసినప్పుడు కొన్ని బోధనలు నేర్చుకుంటోంది.

***ఏ నాటి నోము ఫలమో!***

కథ ఆరంభంలో 'నోము నొచుకోడంలో విశేషం ఏముంది?' అనే ఆలోచనతో జనకం అయిష్టంగా కనిపించినా, ఆ తరువాత ఆమెలో కనిపించే సంతోషం, ఆత్మ తృప్తి మనం గ్రహించాలి. 'సంప్రదాయం పాటించడంలో ఒక నమ్మిక, హామీ సహజం' అని చెప్పే కథ.

***ఇద్దరి తప్పు, మాతృ వంశం, మరపురాని బాధ***

మొదటి కథలో పిల్లవాడు గోపీ గురించి రెండు భిన్నమైను ఉద్దేశాలు. తక్కిన రెండులోనూ సంతతిలేని ఇల్లాలు దృక్పధం చూస్తున్నాం.

అమ్మలు ఒక విచిత్రమైన పాత్ర. దట్టమైన నల్లజడతో మనకి మొట్టమొదట పరిచయమయే బాలిక. ఆమె జుత్తు బాల్యంలోనే తెల్లబారిపోవడం ఒక వక్రోక్తి (irony) గా రచయత సూచన. కాని కధకుడు (గిరిజ తండ్రి) ఊహాలోకంలో ఆమె 'అవ్వై'గా కనిపిస్తోంది.

'అవ్వై' తమిళులకి బాగా పరిచయమైన పాత్ర. ప్రాథమిక పాఠశాలల్లోనే పిల్లలు ఆవిడ రాసిన నీతి వాక్యాలు చదువుతారు. 'అ', 'ఆ' . . . అనే అక్షరాలతో ఆరంభించి ఆవిడ పలికిన నీతిబోధనలు - 'ఆత్తి చూడి' - అనే పేరుతో సులభంగా అందరికీ అర్ధమౌతాయి. 'ఎప్పుడూ మంచిదే చెయ్', 'కోపం తగ్గించుకోవాలి/ అణచుకోవాలి' - ఇటువంటి ఉపదేశాలు ఆవిడ ప్రచారం చేస్తూనే సంచారం చేసారు.

అమ్మలు తనకి పెళ్ళి వద్దంటోంది. కాని కధకుడి కల్పనలో ఆమె జ్ఞానపద అవ్వైగా కనిపిస్తోంది. విచిత్రమేమిటంటే బాలిక గిరిజ తండ్రి ఆమెని అదే దృక్పధంలో చూసి ఆనందిస్తున్నారు! బాలికగానే ఆమె రూపం తండ్రి మనసులో స్థిరపడిపోయింది!

ఇక, ఈ ఆఖరి సంపుటంలో సమగ్రంగా వింధియా కధలగురించి కొన్ని మాటలు:

మొదటి, ఆఖరి సంపుటాల్లోను ప్రముఖ కధ 'ప్రేమ' గురించి అనే విషయం గమనార్హం. సాహిత్యంలో - ప్రపంచ వాఙ్మయంలో - ప్రేమకే ఎక్కువ వాటా అని అంటారు. 'ప్రేమ' అంటే ఎన్ని లక్షణాలు! - మోహం, వలపు, ఆశ, ఇఛ్ఛ, భక్తి, దయ - ఇంకా ఎన్నో! ఇవన్నీ వింధియా కధల్లో కనిపిస్తాయి. ఆ ప్రభావం - అద్భుతం - రచయత విరసం లేకుండా పాఠకులకు ఆవిడ తెలియజేసారు.

'చూడగలికితే ప్రతీ జీవితం అద్భుతం, చదవగలిగితే ప్రతీ జీవితం చరిత్రే!' అనే లోకోక్తి ఉంది. 'కద అంటే జీవితంలో ఒక అంశం' (A Short Story is a slice of life) అని కూడా అంటారు. ఆ అంశం చిన్నదైనా, పెద్దదైనా దాన్ని ఆరసించి, తన కల్పనతో, సృజనాత్మక ధోరణిలో వింధియా రాసిన కధలు ఇవి. వీటి మూలంగా నీతికీ, శీలానికి విలువలిచ్చే సామాన్య జనుల అనుభవాలు ఆవిడ పాఠకులతో పంచుకున్నారు.

ఈ కథలని తెలుగులో అనువదించి పాఠకులకి అందించిన కృషిలో మాకు మళ్ళీ అక్కయ్యతో పరిచయం, సహానుభూతి కలిగింది. ఇన్ని సంవత్సరాల తరువాత ఈ కథలు మళ్ళీ చదవడం ఒక మంచి అనుభవంగా చోటుచేసుకుంది. వింధియా బహుమానంగా మాకు దయచేసిన కథలు మేం మీకు తెలుగులో అందజేస్తున్నాం.

ఏండీ సుందరేశన్
సెల్వీ విశ్వనాధన్
శ్రీను శ్రీనివాసన్



# ప్రేమ ఆధిపత్యంలో

ప్రేమ ఆధిపత్యంలో విరక్తికి, మొండితనంకి చోటు లేదుగా? ప్రేమ కలాపంలో లొంగిపోవడమంటే ఒక విధమైన ఆనందం; దానితోబాటు ఒక సరసమైన హోదా కూడా చోటుచేసుకుంటుంది.

సీతాకోకచిలక లాగ హాలులోకి వచ్చి వత్సలా కుర్చీలో కూర్చుంది. చెయి ఒక పుస్తకం అందుకుంది. కాని ఈ మధ్యాహ్న వేళలో చదవడానికి ఆమెకి ఇష్టం లేదు కాబోలు! పుస్తకాన్ని అలాగే దూరంలో ఉంచేసి నడవలో కూర్చున్న తన వదిన దగ్గరకి వచ్చింది.

నడవలో ఒక చాటలో బియ్యం జల్లుతూ, బియ్యంనుంచి రాళ్ళూ వేరు చేస్తున్న రుక్మిణి తలయెత్తి వత్సలాని చూసింది. "నేనూ సాయం చెయ్యనా?" అని అడుగుతూ వత్సలా పక్కనే వచ్చి కూర్చుంది.

"ఎందుకు? వద్దు! కొత్తగా పత్రిక వచ్చిందే? . . . అందులోని సీరియల్ నవల చదవండి . . . నేను పని చేస్తూనే వింటాను . . ." అంది రుక్మిణి.

"వదినా, ఈ వారం నవల చాలా బాగా ఉంది!" అని అంటూ వత్సలా పత్రికని తీసుకొనివచ్చి చదవడం ఆరంభించింది.

కథలో పడుచు దంపతులు ఉత్తరాలు పరివర్తన చేసుకొనే ఒక ఘట్టం వచ్చింది; అందులో ఏదో ఒక విషయం గుర్తు చేసుకొని రుక్మిణి నోరు విప్పి బాగా నవ్వేసింది.

ఆ కథని ముందే చదివినందువలన కాబోలు లేక కన్యగా తనింకా ప్రేమానుఅనుభవం రుచి చూడలేదనే కారణం వలన వత్సలాకి నవ్వు రాలేదు; ఆ ఘట్టం వినోదంగా కనిపించినా అందులో ప్రత్యేకంగా ఆమెకి ఏమీ తోచలేదు. "వదినా, మీరెందుకు నవ్వుతున్నారు?" అని వత్సలా అడిగేసింది. రుక్మిణి తప్పించుకోడానికి ప్రయత్నించింది. కాని వత్సలా ఊరుకుంటుందా? "ఎందుకో నవ్వాను?" అని అనడానికి కొత్తగా వచ్చిన కోడలుకి ధైర్యం ఎలాగ వస్తుంది?

లేతగా నవ్వుతూ రుక్మిణి "మరేం లేదు. మీ అన్నయ్య నాకు మొట్టమొదట రాసిన ఉత్తరం ఇంచుమించు ఇలాగే ఉంది" అని అంది.

"ఒహో, అలాగా?" అని వత్సలా కొంటెగా నవ్వింది. "వదినా, అన్నయ్యే ముందు నీకు రాసాడా? లేకపోతే నువ్వే వాడికి రాసావా?"

ఇంతకుముందే దానిగురించి తను మాటాడినది గుర్తుచేసుకొని తన భర్తమీద తనకున్న హక్కుతో రుక్మిణి ఆవేశంతో మాటాడింది: "అతనే రాసారు. నేనెలా రాస్తాను? అతనే రాయాలి; రాసారు."

ఎప్పుడూ నెమ్మదిగా మాటాడే వదిన ధోరణిలో ఇటువంటి మార్పు వత్సలా ఇంతకుముందు చూడనేలేదు.

"వాడే రాసాడా? అంటే పెళ్ళాంముందు ప్రాకులాడే భర్త అన్నమాట!" అని వత్సలా నవ్వింది.

ఆ మాటలు విని రుక్మిణి బాధపడింది. కొత్త కోడలుగా కాపురం ఆరంభించి కొత్త కొత్త అనుభవాలు ఎదురుచూసి అత్తవారింటికి వచ్చిన రుక్మిణి ఇక్కడికి వచ్చిన తరువాత చాలా కోరికలు మానుకుంది; చాలా అభిలాషలు అణచుకుంది. నిశ్చలమైన బుద్ధితో మెలగిన భర్త ఆమెపై ప్రేమానురాగాలు వర్షించడంలేదు; రుక్మిణి అతనికి అనుగుణంగా మెలగింది. అలాంటప్పుడు ఇప్పుడు ఆడపడుచు నాలికలోని కఠిన మాటలు విని, రుక్మిణి మరేం అనక ఊరుకుంది.

పిచ్చెక్కిన ధోరణిలో వత్సలా "అన్నయ్య ఇలా మారుతాడని నాకు తెలీదు . . . దేవుడా, పెళ్ళాంకి ఉత్తరం రాయాలని ఎంత తొందర!" అని నొచ్చుకుంది.

"మగవాళ్ళు రాయకపోతే స్త్రీలు ముందుగా రాస్తారా ఏమిటి? రాయడానికి ధైర్యమెలా వస్తుంది? అతను రాసిన తరువాత జవాబు రాయడానికే నాకు ఎంత భయం! అతను రాయలేదంటే నేనూ రాసివుండను!" అంది రుక్మిణి. తన మానసిక వ్యధ దాచుకొని తన నిజ అనుభవమేమిటో ఆమె తెలియజేసింది. అది వత్సలాకి మింగుడు కాలేదు.

"వదినా, అన్నయ్య రాయకపోతే నువ్వూ రాయకూడదని నీకూ మొండితనం, అవునా? అబ్బా, ఈ అన్నయ్యకి ఎంత తొందర! వాడికున్న బడాయి అంతా ఏమైందో?" అంటూ వత్సలా లేచింది.

రుక్మిణి శాంతంగా వీడ్కోలు చెప్పాలని "మీకు పెళ్ళైనప్పుడు మీకది బోధపడుతుంది" అని అంది.

వత్సలా సంకోచం లేకుండా "మగవాడు మగవాడుగా ఉండాలి! 'పురుష లక్షణం' అంటే అదే అర్థం! భార్యకి దాసుడుగా ఉంటే నాకు అసహ్యం!" అని అంటూ నిష్క్రమించింది.

ఆడపడుచు మాటల్లో ఉపేక్ష, వాదించే ధోరణి తనపై తిరగబడినా తను భయంతో, తనకెటువంటి హక్కూ లేనట్టు నిరాధారంగా నిల్చున్న అవస్థ గురించి రుక్మిణి గింజుకుంది. 'ఇవన్నీ లెక్కచెయ్యకూడదు!' అని ఓదార్చుకొని మరచిపోవాలనుకుంది. కాని అదెలా సాధ్యం?

'వత్సలా తన భర్తకి తనే ముందు ఉత్తరం రాయవచ్చు; ఆమెకి ఆ ధైర్యం ఉంది. అందుకే ఆమె అలా మాటాడుతోంది! అదేం పొరబాటా?" అనే ఆలోచనతో రుక్మిణి తన్ను సమర్థించుకుంది. 'వత్సలాకి పెళ్ళైన తరువాత ఆమె ఎలాగ ఉందో చూడాలి?' అని తనకి తానే చెప్పుకుంది.

** ** **

ఆ మరుసటి సంవత్సరం వత్సలాకి పెళ్ళైయింది. వత్సలా తన వదిన మామయ్య కోడుకునే పెళ్ళిచేసుకుంది. 'నా భర్త అందగాడు, పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు!' అని సంతోషించింది.

పెళ్ళైయిన మరుసటి వారమే దంపతుల ప్రయాణం అని పెద్దలు నిశ్చయం చేసారు. 'ఇక ఉత్తరాల పరివర్తన ఎలాగ?' అని రుక్మిణి ఆలోచించింది. ఆమె అనుకున్నట్టే వత్సలా ప్రయాణంలో ఒక మార్పు వచ్చింది. వత్సలాకి నిరాశ, రుక్మిణికి ఆశ్చర్యం.

వత్సలాకి Intermediate చదువు పూర్తి అవడానికి ఇంకా ఒక సంవత్సరం ఉంది; ఆమె భర్త రాజారామన్కి ఉద్యోగంలో కొన్ని పరీక్షలు, పరిపాలక బాధ్యతలు ఉండడం వలన పాతకాలపు నూతన దంపతులులాగ వాళ్ళుకూడా ఒక సంవత్సరం వేరువేరుగా గడపాలని పెద్దలు నిశ్చయించారు.

పెళ్ళైయిన రెండు మాసాలవరకూ వత్సలాకి భర్తతో ఉత్తరాల పరివర్తన లేదు. భాగీరది అమ్మాళ్ - రుక్మిణి అత్తగారు, వత్సలా తల్లి -దానిగురించి బాధపడ్డారు.

"ఏమే, అల్లుడిగారుకి ఒక ఉత్తరం రాయ్!" అని ఆవిడ పదే పదే కూతురుకి గుర్తు చేసారు. కాని వత్సలా తల్లిమాట వినలేదు.

"నేను రాసానంటే అతనూ రాస్తారు; తరువాత నేనూ రాయాలి. ఈ పని ఆరంభిస్తే, నా చదువు ఏంకాను?" అని మొదటిసారి వత్సలా నొచ్చుకుంది.

"తరువాత రాయడం నీ ఇష్టం! ఇప్పుడు అతనికి ఒక ఉత్తరం రాయ్!" అని అవిడ అన్నారు. ఆ తరువాత కూతురుకి అదే చెప్పారు. కాని వత్సలా మొండిగా "రాయను!" అని దృఢంగా చెప్పడం అలవాటు చేసుకుంది; కొన్నిసార్లు ఏమీ అనకుండా ఊరుకుంది.

ఆఖరికి ఇక తాళలేక భాగీరది అమ్మాళ్ ఒక రోజు కూతురుకి చెప్పారు. "ఏమే, నీకెన్నిసార్లు చెప్పాలి? నీ మనసుకి తెలియవద్దూ? అల్లుడుగారు మగవారు. నువ్వేకదా ముందు రాయాలి? నువ్వు రాయడంలేదని అతను నాన్నగారి ఉత్తరాలకి కూడా సరిగ్గా జవాబు రాయడం లేదు!" అని ఫిర్యాదు చేస్తూ కూతురుని తప్పుపట్టారు.

పులిలాగ వత్సలా పైనబడింది. "అవును. వదిన అన్నయ్యకి ముందు రాసిందా? అన్నయ్యేకదా దానికి ముందు రాసాడు? అది నీకు తెలుసా?" అని ఎదురు ప్రశ్న వేసింది.

ఇది విని భాగీరది అమ్మాళ్ ఉలికిపడింది. కూతురుని సముదాయించాలని నిశ్చయించింది.

"పోనీలే, దానికేం? మనుషుల్లో అనేక రకాలు. అప్పుడు అన్నయ్యకి ఉద్యోగం లేదు. మీ ఆయన ఇప్పుడు పనిలో ఉన్నారు. రాయడానికి అతనికి టైము లేదేమో? నువ్వు రాయకూడదా?" అని భవ్యంగా ఆవిడ కూతురుకి బుద్ధి చెప్పారు.

ఈ సంభాషణ విన్న రుక్మిణికి తనూ పరుగెత్తుకొనివచ్చి నాలుగు మాటలు చెప్పాలనే ఆతురత కలిగింది. కాని నోరు మూసుకొని వత్సలా ఏం జవాబు చెప్తుందో విందామని ఊరుకుంది.

"మనింటి మగవాళ్ళు పిరికిపందలు, సులభంగా లొంగిపోతారు! ముందు అతను రాయనీ, ఆ తరువాత నేను రాస్తాను! నేను ముందుగా రాయను!" అని వత్సలా మళ్ళీ నొక్కిచెప్పింది.

అప్పుడే రుక్మిణి చిరునవ్వుతో ఆడపడుచుతో మాటాడింది. అత్తగారింటికి వచ్చి ఒక సంవత్సరం అయిపోయింది; ఇప్పుడు ఆమెకి సంకోచం లేదు.

"వత్సలా, ఇంతకుముందు మీరు ఏంచెప్పారు? 'పెళ్ళామే ముందు ఉత్తరం రాయాలి, భర్త ప్రాకులాడుతూ ముందు రాయకూడదు!' అని మీరు అనలేదూ? మరిప్పుడేమో 'మనింటిలో' అని అమ్మకి చెప్తున్నారే?" అని అడిగింది.

"అవునమ్మా, నిజం!" అని భాగీరది అమ్మాళ్ రుక్మిణిని ఆమోదించింది. "నువ్వూ దానికి చెప్పు," అని కూతురుని చూసింది. వత్సలా కోపంతో "అవునులే, అందరికీ బుద్ధి చెప్పడమంటే వదినకి చాలా ఇష్టం!" అని చిరచిరలాడుతూ అక్కడనుంచి నిష్క్రమించింది.

వత్సలా నిందారోపణ విని రుక్మిణి అదిరిపడింది; కాని నోరు పెగల్లేదు.

కొంచెం సేపు తరువాత భాగీరది అమ్మాళ్ కూతురుకి మళ్ళీ చెప్పారు:

“వత్సలా, కోపం లేకుండా నా మాట విను. అల్లుడిగారిని దీపావళికి రమ్మని నాన్నగారు రాసారు. అతను ‘చూద్దాం!’ అని రాసారట. నువ్వూ ‘రండి!’ అని అతనికి రాస్తే అతనికి రావాలనిపించుతుంది. అందుకే అతను నాన్నగారికి సరిగ్గా రాయలేదు. నువ్వు రాస్తే సంతోషిస్తారు. ఏమంటావ్?”

“సరేలే, నేనూ రాస్తాను,” అని వత్సలా అనగానే తల్లి మనసు కుదుటబడింది.

ఆ రోజు నాన్నగారికి తన భర్త రాసిన ఉత్తరం చూసి వత్సలాకీ నిరాశే కలిగింది. తల్లి కోపంతో మాట్లాడాలని వచ్చినప్పుడు ఆ నిరాశ కోపంగా లేచింది. ఆ తరువాత నెమ్మదిగా తల్లి చెప్పిన సందేశం విని ఆవిడకి తన మాట ఇచ్చింది. వత్సలా చదువుకున్న అమ్మాయికదా? తన ఆత్మగౌరవంకి భంగం రాకుండా, తన పక్షం ఓడిపోయిందనే జాడ కనిపించకుండా, దీపావళి పండుగ ముచ్చటలు అనుభవించాలనే ఆకాంక్షతో ఇక తను ఏంచెయ్యాలని తీవ్రంగా ఆలోచించింది. ఒక కార్డు తీసుకొని దానిపైన రంగుల తూలికలతో దేశీయ పతాకం పటం గీసింది. దాని కింద ‘భర్తకి నా ఆహ్వానం!’ అని అతనికి ఉత్తరం రాసి, సంతకం పెట్టింది. వదినకీ, తల్లికీ దాన్ని బడాయిగా చూపించిన తరువాత టపాలో పంపించింది.

ఆమె ఎదురుచూసినట్టే భర్త తను వచ్చిచేరే రోజుగురించి టెలిగ్రాం పంపాడు. అది పండుగకి రెండు రోజులు ముందే రావడంవలన వత్సలా అన్నివిధాల కల్పనలో మునిగి తేలింది. నిలుటద్దం ముందు నిలబడింది; చెయిలో ఒక చిన్న అద్దం పట్టుకొని, నిలబడి, నిలబడి తన మొహాన్ని అన్ని కోణాల్లో చూసుకొని తృప్తి పడింది. చీరకట్టులో పమిట చెంగుని భుజంలో వేరే వేరే వైఖరిలో వేసుకొని పరీక్ష చేసింది. చెవులకి రకరకాల ఆభరణాలు తొడుక్కొని నిలువుటద్దంలో చూసుకుంది.

కాని దీపావళికి ముందురోజు తెల్లవారి జామున ఆమె భర్త వచ్చినప్పుడు వత్సలా బురదలో చిక్కుకున్న అందాల రథంలాగ కనిపించింది.

ఆమె భర్త తన భార్యని, అత్తమామలని చూడాలని, వాళ్ళతో మాటాడాలని రాలేదు. తన అత్తకూతురు రుక్మిణితోనే అతను ఎక్కువగా మాట్లాడాడు. పుట్టినిల్లు బంధువు వచ్చాడనే ఆనందంతో రుక్మిణి కూడా అతనితో ఉత్సాహంగా మాటాడింది. “‘అసలు, నువ్వు ఎవ్వరు - తెలివితక్కువ నా బావా లేక చురుకైన అల్లుడా?’ అని నాకు తెలియాలి!” అని అతన్ని ఎగతాళి చేసింది. కాని మితిమీరి రుక్మిణి ఏమీ చెయ్యలేదు. కాని వత్సలాకి ఒకటే ఆశ్చర్యం: ‘ నా భర్త నాకు దూరంగా ఉన్నాడు; కాని వదినతో సులభంగా, చనువుగా ఉన్నాడే?’ అని.

వత్సలాకి తను కల్పనచేసిన ఉత్సాహం ఇప్పుడు లేదు; మనసులో విసుగు పుట్టేసింది. రాజారామన్ భార్యని చూసాడు. అతని చూపులో దయ, దాక్షిణ్యం కలిసివుండడం వలన వత్సలాకి అతని కళ్ళలో ప్రేమ కనిపించలేదు.

ఆ మొదటి రోజంతా వత్సలా - పద్దెనిమిదేళ్ళ యువతి- లజ్జని లజ్జగా భావించక, చిరచిరలాడుతూ, వదిన, తల్లి చెప్పిన మాటలు వినలేదు. కాని దీపావళి రోజు భర్తని చూడడానికి వెళ్ళింది. “నాకు వత్సలా చదువుగురించి కొన్ని వివరాలు తెలియాలి, ఆమెను అడిగి తెలుసుకోవాలి” అని ముందురోజు రాజారామన్ తన మామగారితో చెప్పడం వత్సలా గమనించడమే అందుకు కారణం.

‘చదువుగురించి తెలియాలి అనే నెపంతో నాతో మాట్లాడాలని అతనికి ఉంది!’ అని ఆహ్లాదపడుతూ వత్సలా వెళ్ళింది.

దీపావళి పండుగకని తను కొనివచ్చిన చీర ధరించి తనముందు కనిపించిన వత్సలాని చూసి రాజారామన్ మురిసిపోయాడు. “రా, కూర్చో,” అని స్వాగతం చెప్పాడు.

“నీ చదువు ఎలాగుంది?” అనే మొదటి ప్రశ్నతో అతను సంభాషణ మొదలుబెట్టాడు. ఆమె వంట కూడా బాగా నేర్చుకోవాలని, ఉత్తికే వల్లించే చదువుని లోకజ్ఞానంతో, సార్థకంగా మార్చుకోవాలని, అతను ఇంకా ఏమేమో చెప్తూ పోతున్నాడు. వత్సలాకి తన భర్త బోధనలు తియ్యని ఆజ్ఞలుగా కనిపించలేదు. అతని చూపులో ప్రేమ జాడ లేదు; ప్రేమానురాగాలు మాటల్లోనే తేలుతున్నట్టు పైకివచ్చాయి.

‘మేమిద్దరం ఉత్తరాలు రాసుకోలేదే, మరెలా మా మధ్య అపేక్ష కలుగుతుంది?’ అని వత్సలాకి తోచిందేమో? ఆమె మనసులో భర్త ఒక దగ్గర బంధువు లాగ కనిపించినా అతనొక అన్యుడనే భ్రమ చోటుచేసుకుంది; ఏం చెయ్యాలో తెలియక బెంగ పట్టుకుంది.

రాజారామన్ దీపావళి గడచిన మూడవరోజు తన తిరిగు ప్రయాణం అని చెప్పడం వలన అతని ప్రయాణంకి ముందురాత్రి భాగీరది అమ్మాళ్ ఒక డబ్బాలో తినుబండారాలు నింపి వత్సలాకి అందించి అల్లుడికి ఇవ్వమన్నారు.

అలసిన మొహంతో వత్సలా దాన్ని తీసుకొని భర్త గదికి వెళ్ళింది. అప్పుడే రాజారామన్ మేజామీదున్న తన సూట్ కేసులో దుస్తులు సర్దుకుంటున్నాడు.

వత్సలా గదిలోకి ప్రవేశించినప్పుడు, రాజారామన్ ఒక నిజారుని మడతపెట్టుతున్నాడు.

వచ్చిన పనిని క్లుప్తంగా వత్సలా చెప్పగానే రాజారామన్ "నువ్వే దాన్ని నా సూట్ కేసులో పెట్టేయ్ . . . నువ్వు మంచి వేళలో వచ్చావ్!" అని తన చోటు కదలకుండా అన్నాడు.

'నా చెయినుంచి అతను సూటిగా తీసుకోరేం? దీపావళి పండుగ గురించి మనం చదివే అన్ని కథల్లోనూ అదేకదా జరుగుతోంది? ఇతనికి రవంతైనా సానుభూతి లేదే? ఊరుకి వెళ్తున్నప్పుడు కూడా ఇలాగేనా?' అని వత్సలా నొచ్చుకుంది.

మానసిక వ్యధతో ఒక సారి భర్తని చూసి సూట్ కేసు దగ్గరకి వచ్చి, వత్సలా అందులో డబ్బా పెట్టింది. సూట్ కేసు మూయడానికి సాధ్యం కాదని తెలిసే దాన్ని మూయాలని ప్రయత్నించింది; భర్త తన్ను చూస్తున్నాడా అని తిరిగి చూసింది. అతను ఆమెను చూస్తూనే ఉన్నాడు. లజ్జతో సూట్ కేసునుంచి కొన్ని దుస్తులు తీసేసి డబ్బాని మళ్ళీ అందులో పెట్టింది. 'తీసిన దుస్తులని మళ్ళీ మడతపెట్టాలా, వద్దా?' అని ఆలోచిస్తూ మళ్లీ భర్తని చూసింది. అతనేమో కొంటె నవ్వు నవ్వుతున్నాడు.

"కొన్ని బట్టలు తీసి డబ్బా పెట్టాలి," అంది వత్సలా.

"ఏది సాధ్యమో అది నువ్వే చెయ్!" అని అంటూ రాజారామన్ ఒక అంగవస్త్రం మడతపెట్టాడు.

సూట్ కేసు పక్కన నిలబడివున్న వత్సలా అడుగుల సద్దు విని తిరిగిచూసింది. గభీమని రాజారామన్ ఆమె కంఠాన్ని తన చేతులమధ్య ఆవరించుకున్నాడు.

ఒక క్షణం వత్సలా ఈ ప్రపంచం మరిచిపోయింది. మరుక్షణం భ్రమ, ఆశ్చర్యం ఆమెని కప్పేసాయి. 'ఆఖరికి ఇతను ఊరికి వెళ్ళే సమయంలో నాకీ భాగ్యమా?' అనే అలోచనతో తనే నవ్వుకుంది. ఆ మొదటి స్పర్శ తప్ప తనకి మరేం బహుమానం కావాలి?

"వత్సలా, నేను రేపు వెళ్ళను; ఎల్లుండి వెళ్తాను. నేను మూడురోజులు పాడు చేసేసాను. ఆ డబ్బా మీ అమ్మకి తిరిగి ఇచ్చేయ్!" అన్నాడు రాజారామన్.

మంత్రంకి వశమైనట్టు వత్సలా డబ్బాని చెయిలో తీసుకుంది.

"నువ్వు ఇప్పుడే వెళ్ళాలి అని నేను అనలేదే?" అని అంటూ రాజారామన్ ఆమె చెయిని పట్టుకున్నాడు.

"నేను వెళ్ళాలి, టైమయిందే?" అంది వత్సలా.

"అబ్బా, ఎంత తొందర నీకు, నువ్వు వచ్చి ఎనిమిది నిమిషాలే అయ్యాయి! సరే, ఇందులో ఏముందో చూద్దాం!" అని అంటు రాజారామన్ డబ్బాని తెరిచి, అందులోనుంచి రెండు మైసూర్ పాక్ బిళ్ళలు బయటకి తీసి, డబ్బాని మూసాడు. ఒక బిళ్ళ తన నోటిలో వేసుకున్నాడు.

వెంటనే మొహం చిట్లించుకొని "ఇదేం రుచి, నాకిది వద్దు!" అని చిరచిరలాడుతూ మైసూర్ పాక్ రుచికి బదులు తనకెది ఎక్కువగా ఇష్టమో వత్సలాకి బాహాటంగా తెలియజేసాడు.

"ఇంకా వత్సలా రాలేదా?" అని భాగీరది అమ్మాళ్ అడిగినప్పుడు "ఎందుకమ్మా మీరు దాన్ని తినుబండారాలతో పంపించారు? అది రేపు పొద్దున్నే వస్తుంది!" అని రుక్మిణి అంది.

"చాల్లే, అది కూడానా?" అని భాగీరది అమ్మాళ్ వెర్రిగా గొణుక్కున్నారు.

వత్సలా డబ్బాతో తిరిగి వచ్చింది. "అతను రేపు వెళ్ళడం లేదు. ఎల్లుండి వెళ్తున్నారు. మైసూర్ పాక్ కొంచెం రుచి చూసారు" అని తల్లికి చెప్పింది. అది విని రుక్మిణి తనలో నవ్వుకుంది.

ఆ మరుదినం రుక్మిణి రాజారామన్ని పెరడులో నుయ్యిదగ్గర కలుసుకున్నప్పుడు "సరేలే, నువ్వేమో తెలివితక్కువ బావ అని నాకు తెలిసిపోయిందిలే!" అని ఎగతాళి చేసి పరుగు తీసింది. "అవును, నిజం!" అని చిరునవ్వుతో రాజారామన్ మూల్గుతున్నట్టు కల్పన చేసుకుంది.

రాజారామన్ ఊరుకి వెళ్ళిన మరుదినం వత్సలా భర్తకి ఉత్తరం రాసింది. రాజారామన్ తన ఊరు చేరేముందు రైలు ప్రయాణంలో భార్యకి ఉత్తరం రాసాడు. క్రమేణ ఆ రెండు ఉత్తరాలు మధ్య కలుసుకొని, ముచ్చలాడిన తరువాత వారివారి గమ్యం చేరుకున్నాయి.

తనకి వచ్చిచేరిన మొదటి ఉత్తరం వత్సలా మళ్ళీ మళ్ళీ చదివింది; అందులో ఒక వాక్యం ఆమెకి బోధపడలేదు.

వదిన ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె దగ్గరకి వచ్చింది; ఏమేమో మాటాడింది.

"మీ ఆయన రాసిన ఉత్తరం గురించి ఏమీ చెప్పరన్నమాట!" అని రుక్మిణి రెచ్చగొట్టింది.

ఆమె ప్రశ్నని నెపంగా పెట్టుకొని వత్సలా “అసలు నాకు బోధపడితేనాకదా మీకు చెప్పగలను?” అని అంది.

“ఏమంటున్నారు?ఉత్తరంలో అన్నీ పిచ్చి మాటలా?” అని రుక్మిణి ఎదురు ప్రశ్న వేసింది.

“మీరతన్ని ఏదో అడిగారని, తను నిజంగానే తెలివితక్కువ బావగా ఐపోయినట్టు అతను రాసారు . . . నాకేం అర్థం కాలేదు . . . ”

“ఓ, బావ అలా రాసాడా? పాపం! . . . వత్సలా, వినండి మీరు నాదగ్గర బాగా చిక్కుకున్నారు! బావ ఇక్కడున్న మూడు రోజులూ మిమ్మల్ని మోసం చేసాడన్న మాట!” అని రుక్మిణి నవ్వింది.

వత్సలా నిర్ఘాంతపోయి అలాగే నిల్చుంది.

“కొంచెం ఆగండి!” అని అంటూ రుక్మిణి లేచి వెళ్ళింది. ఒక కాగితంలో ఏదో రాసుకొని తిరిగివచ్చింది.

“రాజా[1], నువ్వు నిజంగానే తెలివితక్కువ బావగా అయిపోతావేమో అనే భయంతో నేనిది రాస్తున్నాను. వత్సలా తన పెళ్ళికి ముందు నాకొక సవాలు వేసింది. భార్య ఉత్తరం రాసేముందు తనే ఉత్తరం రాసే భర్త ఆమెకి దాసుడని ఆమె ఉద్దేశం. ‘భార్యని మొట్టమొదట తాకే భర్త శృంగార పురుషుడు!’ అని వత్సలా ఏమేమో అంటోంది. ఆదే నీకు ముందు ఉత్తరం రాయనీ, అంత వరకూ నువ్వు రాయవద్దు. నువ్వుగాని తొందరగా ఏమైనా చేసావంటే అంతే, వత్సలా ఇక నిన్ను లెక్క చెయ్యదు! జాగ్రత్త!”

రుక్మిణి అలాగ రాసిన ఉత్తరం చూపించి “ఇంతకు ముందే నేను ఈ ఉత్తరం బావకి రాసాను!” అని చెప్పింది.

“ఇదేంటి, వదినా, ఎందుకీ అబద్ధాలు?” అని వత్సలా అడిగింది.

“నిజంతో కొంచెం అబద్ధం కలుసుకుంటేనే తమాషాగా ఉంటుంది . . . ఇంతకీ వాడు రాయకపోతే మీకూ రాయడానికి ధైర్యం లేదు, అవునా, నిజం చెప్పండి!” అని రుక్మిణి నవ్వుతూ అడిగింది.

‘అవును!’ అనే ధోరణిలో వత్సలా తలూపింది.

[1] రుక్మిణి రాజారామన్ని చనువుగా పిలిచే పేరు

“మీ ఆయన రాగానే మీరు మారిపోయారు. నేనూ పుట్టిల్లులో మీలాగే ఉండేదాన్ని. మీ అన్నయ్య నన్ను మార్చేసారు!” అని నవ్వు ఆపకుండానే రుక్మిణి అంది.

“మారడం ఎక్కడ? నీ పుట్టిల్లు బంధువుని చూడగానే నువ్వు సాహసంతో గారడీ చేసావ్! మా ఆయన దృష్టిలో నేను చిన్నబోయాను!” అని వత్సలా నొచ్చుకుంది.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, డిసంబరు 1, 1950)**



# ఇద్దరి తప్పు

నాకు ఉద్యోగంలో వేరే ఊరులో ఐదారు నెలలు బస చెయ్యవలసిన అగత్యం వచ్చింది. నా భార్యకూడా నాతో రావాలా అని నేను ఆలోచించాను, కాని ఆఖరికి అదే నిశ్చయం చేసేసింది. "నేనెందుకండీ? మీరే హాయిగా నా బాధ లేకుండా ఉండవచ్చుగా?" అని అంది; ఆమె ఆవశ్యకత నాకు తెలియాలని దాని పథకం.

నాకు అద్దెకి ఒక గది దొరికింది. నేను వెళ్ళిన మొదటిరోజు ఒక పిల్లవాడు వచ్చి నన్ను తొంగిచూసి పరుగెత్తాడు. వాడి మూలంగా నేను ఇంటి యజమానుడిని కలుసుకున్నాను.

"చాలా చురుకైన పిల్లవాడు సార్! ఎలా పరుగులు తీస్తున్నాడు!" అన్నాను.

స్వామినాథన్ నవ్వకుండానే "అవును, వీడొక రకం!" అన్నారు.

రకం? అంటే? అతనేమంటున్నారు? పిల్లవాడు చలాకీయా? లేక మొద్దబ్బాయా? పోకిరియా?

అబ్బాయి చలాకీయే అని త్వరలో తెలుసుకున్నాను. మళ్ళీ వచ్చాడు. అలలులాంటి కళ్ళు, లాఘవంతో నన్ను సూటిగా చూస్తూ "అంకుల్, మీకు స్నానంకి తొందర లేదుకదా? అమ్మ నన్ను తైలం స్నానం చేసుకోమంటుంది. నేను వెళ్ళనా?" అని అడిగాడు. స్పష్టంగా పలికిన మాటలవి; కంచు మోగినట్టు కంఠధ్వని. తైలస్నానం అనగానే తిరుగుపడే చాలా పిల్లల్ని నేను చూసివున్నాను; నేనూ బాల్యంలో అలాంటివాడినే.

స్నానం గది అందరూ వాడాలి. అందుకే నా వసతిని తెలుసుకోవాలని వాడి తల్లి నన్ను అడగమంది.

"నువ్వు ముందు తైలస్నానం చెయ్. నేను రైల్లో వచ్చానుగా, నా మూటాముల్లె నేనింకా సర్దుకోవాలి" అన్నాను.

పిల్లవాడు వెళ్ళిపోయాడు; మళ్ళీ తిరిగివచ్చాడు. "అమ్మకి ఇంకా కొంచెం పని ఉందట. కావాలంటే మీరు స్నాం చెయ్యవచ్చు అని చెప్పమంది."

"సరే, రైలు ప్రయాణం అలసట పోవాలంటే స్నానం చెయ్యాలి," అని బయలుదేరాను. పిల్లవాడు నవ్వాడు. అతని నాన్నగారు గమనించారు. తల్లి చెవులకి వినబడిందా అని తెలియక నేను సహజభావంతో మాట్లాడాను; మరేం చెయ్యగలను?

వేడినీళ్ళలో స్నానం చేసిన తరువాత నేను స్వామినాథన్కి చెప్పాను: “ఇవాళ రైలు ప్రయాణం మురికి పోవాలని నేను వేడినీళ్ళలో స్నానం చేసాను. ఇక చల్లనీళ్ళు నేనే తోడుకొని స్నానం చేస్తాను.” నేను కొంచెం బిగ్గరగానే మాట్లాడాను. అప్పుడొక అమ్మాయి మొహం నన్ను తొంగి చూసి మాయమైంది. ఆ మరుక్షణమే ఆ మొహంకి చెందిన స్త్రీ నా ఎదుట వచ్చి నిలబడింది.

భర్తని చూస్తూనే “ఇతను వేరే ఊరునుంచి వచ్చారు . . . ఒక బాల్టి వేడినీళ్ళకి మనకేం పెద్ద కష్టం? చల్లనీళ్ళు వొద్దు!” అంది.

“సరే, చాలా thanks; రోజు పొద్దున్న ఎనిమిది, ఎనిమదిన్నరకి నేను స్నానం చేసుకుంటాను.”

“దానికేం? అనుకున్న వేళ పనులు చేసుకుంటే అందరికీ మంచిదే! కాని కొంచెం ఇలా అలా ఆలస్యం అవుతే అదేం పెద్ద ప్రశ్న కాదు!” అని ఆవిడ భవ్యంగా, నవ్వకుండా, నన్ను సముదాయించారు; పిల్లవాడులాగ తల్లికి కూడా కంచు కంఠధ్వని.

“ఒరే గోపీ, రా, వర్జ్యం[1] ముందే నువ్వు తైల స్నానం చెయ్!” అని ఆవిడ మాటలు విని నేను నాలో నవ్వుకున్నాను. మాతృభావం రాగానే స్త్రీల మనసు ఎలా పక్వమౌతుందో చూసారా? చూడడానికి ఆవిడ పడుచుగానే కనిపిస్తోంది - ఎత్తు ఐదడుగులు ఉంటుందేమో? - కాని నానమ్మలాగ ఆవిడ వర్జ్యం గురించి మాటాడడం నాకు గమ్మత్తుగా ఉంది!

“బుధవారం, శనివారం వస్తే పిల్లవాడికి తైల స్నానం తప్పదు!” అని స్వామినాథన్ నాకు చెప్పారు. అతని మాటలు ఏదో నిందారోపణలాగ నాకనిపించింది.

“ఏం, అది మంచిదేకదా?” అని నేను అడిగాను.

“కాదని ఎవరన్నారు? కాని ఈ గొడవ మా ఇంటిలోనే ఎప్పుడూ జరుగుతోంది!” అని అతను మళ్ళీ అన్నారు.

‘ఇతనేం మనిషి!’ అని నాకు అతనిగురించి అనుమానం కలిగింది. ‘తలంట స్నానం ఉత్తమం’ అని మన పెద్దలు చెప్పడం మనకి తెలుసుగా? ‘ఇతనితో మెలగడం కష్టమేమో?’ అనిపించింది. కాని స్వామినాథన్ నాతో ఎప్పుడూ సరళంగానే మాటాడడారు; నాగురించి అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

---

[1] దీనికి రాహుకాలం, దుర్ముహూర్తం అని కూడా అంటారు

విచిత్రమేమిటంటే క్రమేణ నాకు అతనిపట్ల జాలి, చికాకు, కోపం - అన్ని భావనలూ లేచాయి. పిల్లల పెంపకంలో భార్యాభర్తలకి జగడాలు రావడం సహజం; పేరు పెట్టడంలోనే ఇద్దరికీ భేదం రావోచ్చు; కాని ఇక్కడ నేను చూసినది కొత్త రకం అసమ్మతి.

పడుచు కమలంకి జ్యేష్ఠకొమారుడుమీద అభిమానం ఉంటుంది. విసుగ్గోకుండా రోజు రెండు మూడు సార్లు పిల్లవాడికి కొత్తబట్టలు తొడిగించి ముచ్చటలాడుతుంది. నా భార్య రాధై ఉందే - ఆడ పిల్లలకే శృంగారం చెయ్యడం సాధ్యం అనే భావనతో తనకి మొదటి పాప ఆడపిల్లగా పుట్టాలని నాకు చెప్పింది. ఇప్పుడు రెండవ పాప ఆడపిల్లగా పుట్టింది. మా ఇంటిలో కుట్టుపని, పూల అలంకరణ అన్నీ మామూలే! కమలం ఉద్దేశం రాధైలాగ కాదు. 'కొడుకంటే ఏం తక్కువ?' అనే భావనతో ఆవిడ మనఃపూర్తిగా గోపీకి రకరకాల దుస్తులు ధరించమని ప్రోత్సహించుతుంది. ఇదేమో ఆమె భర్తకి పెద్ద పొరబాటుగా కనిపిస్తుంది. "ఏ తల్లీ ఇంత గడబిడగా పిల్లవాడికి నాలుగు సార్లు దుస్తులు మార్చడం నేను చూడలేదు!" అని స్వామినాధన్ నాతో చిరచిరలాడారు.

అతనుగాని నిదానంగా భార్యతో దీనిగురించి మాటాడివుంటే? తొందర పడకుండా ఆమెని గర్వంగా మెచ్చుకొనివుంటే కమలం తడిసిన కళ్ళతో అతనికి చెప్పివుంటుంది: "నేనిలాగ చెయ్యకపోతే మీరేమంటారో నాకు తెలియదా? 'తల్లికి ఉన్న ముఖ్య బాధ్యత - పిల్లలు నిత్యమూ మంచి బట్టలతో కనిపించాలి!' అని అంటారు. పిల్లలు శుభ్రంగా, సొగసుగా కనిపించాలి. మురికి, చింపిన దుస్తులు నేను భరించలేను. కొందరు తల్లులు తమ పిల్లల్ని తల్లిలేని పిల్లలాగ వదిలేస్తారు. నేనలా ఉండలేను. తడీ, బురదా అంటేనే బట్టలు మార్చాలా ఏమిటి? కావాలంటే నాకు కావలసిన చీరలు నేను తగ్గించుకుంటాను."

కమలం నా భార్యని మించేసింది. ఇప్పుడేకదా - ఆడ పిల్ల పుట్టినతరువాత - రాధై అంటోంది, "ఇక నాకు మరేం వద్దు. ఈ అమ్మాయికి ఒక మంచి వరుడు వెతకాలి; మనం డబ్బు జాగ్తగా ఖర్చు పెట్టాలి" అని. ఇంతకు ముందు పుట్టిన కొడుకు కోసం తన వాంఛలు తగ్గించుకోవాలని రాధైకి అనిపించలేదే? ఇప్పుడుకూడా అది ఏ ఖర్చు తగ్గించింది? అన్నీ ఉత్తి మాటలే . . .

పదురుబోతులాగ ఈ దంపతులమధ్య జొరపడడానికి నాకు ఇష్టం లేదు. కాని సహవాసదోషం అని ఒకటి ఉందికదా? అది నన్ను - ఒక పరాయి వ్యక్తిని - ఈ కుటుంబంతో ముడివేసింది.

ఆ దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు గోపీ గురించే. కాని గోపీ చలాకీగా తల్లి మనసు కలవరపడకుండా మెలగడం వలన, స్వామినాథన్ భార్యని బెదిరించడం అలవాటు చేసుకున్నారు కాబోలు! గోపీకి ఎవరితో ఎక్కువ చనువు - తల్లితోనా లేక నాన్నతోనా? అని చెప్పడం కష్టం. వాడు మాట్లాడడం, నవ్వడం, ప్రశ్నలడగడం, గాయపడి ఏడవడం - ఇవన్నీ అందరు ఇళ్ళలోనూ జరిగేవే! తల్లి గోపీని ఎంత గారాబంగా పెంచినా కూడా ఆ వాత్సల్యం మితిమీరలేదు. కమలంకి ఒకే ఒక చూపులోనే గోపీని సరిదిద్దే సమర్థత ఉంది. అదే ఆమె భర్త కలతకి కారణమా? 'కొడుకు తరువాతే భర్త! అని కమలం ఉద్దేశం!' అని అతనికి బాధగా ఉందా? మనోరోగ వైద్యులు వీటిగురించి ఏమేమో రాసిపెట్టి ఉన్నారే?

ఒకే ఒక విషయంలో కమలం గోపీని తప్పుపట్టుతుంది, కోపించుకుంటుంది. ఎందుకంటే పుట్టుకతో వచ్చినట్టు ఒక అలవాటు గోపీని పట్టుకుంది. మృదంగం వాయించే ధోరణిలో వాడు తన చెయి ఏ వస్తువు మీద పడినా తాళం వేస్తాడు; తలుపు, మేజా, పుస్తకం, గిన్నె- ఇవన్నీ వాడి కల్పనలో మృదంగమైపోతాయి. వాడికి ప్రజ్ఞ లేకుండానే వేళ్ళు ముడుచుకుంటాయి, నాలిక మౌనంగా జతి వేస్తుంది. కళ్ళు దేన్నో చూస్తూవుంటాయి; మనసు కల్పనలో మునిగిపోతుంది; కొన్నిసార్లు ముఖభావం, వాడు తలూపడం చూస్తే అసలు ఒక విద్వాంసుడులాగ కనిపిస్తాడు.

"వొద్దురా అంటే వింటావా? ఇలాగ ఎప్పుడూ తాళం వేసావంటే రేపు బికారిగా తాళం వేస్తూ తిరగవలసిందే!భోజనంకి కూర్చొని పళ్ళెంకి తాళం వెయ్యడమా? ఎంత ఘోరం!" అని కమలం బొబ్బలు పెడుతుంది. గోపీ వింటేనా?

నేనూ చూస్తున్నానుగా? ఏ తల్లికైనా తన కొడుకు పెద్ద ఉద్యోగం చెయ్యాలనే ఆశ; కళాకారుడుగా, ఆటగాడుగా, నర్తకుడుగా రాణించాలనే అభిలాష లేదు. మరి కమలం మాత్రం వేరే ఎలాగ ఉంటుంది?

** ** **

ఒకరోజు సాయంకాలం నేను వాహ్యాళిలో పక్కనేవున్న తోటకి వెళ్దామని బయలుదేరాను. స్వామినాథన్ నా వెనుక వచ్చి నాతో కలుసుకున్నారు. అతని మొహం మాసిపోయింది. "మీరు చెప్పండి సార్, నాకు మా గోపీ గురించి బెంగగా ఉంది" అన్నారు. "మా ఆవిడ వాడిని స్కూల్లో చేర్చాలని అంటోంది. నేను 'ముందు వాడికి ఇంటిలోనే పాఠం నేర్పిస్తాను' అని అంటున్నాను" అని తన ఉద్దేశం తెలియజేసి, క్రమ క్రమంగా మాటాడుతూ "సార్, మీరే చెప్పండి. ఇతరులు

ఏమంటారో అని భయపడి మనం పిల్లల్ని పెంచుతే ఏమౌతుంది?" అని నన్ను అడిగారు.

అతను ఏమంటున్నారో నాకు పూర్తిగా బోధపడలేదు. నేను అడిగాను.

"సార్, ఆ తరువాత చదువుకి నేను పిల్లవాడిని వేరే ఊరుకి పంపాలనుకుంటున్నాను. కమలం ఇలాగే వాడిని పెంచుతే గోపీ మానసిక అభివృద్ధికి హాని రావచ్చు. మా ఇంటిలో జరుగుతున్నది ఎంత చోద్యంగా ఉందని చూడండి!" అని అతను అడగ్గానే నేనిక తాళలేక "సార్, వినండి. తల్లిదండ్రులకి దూరంగా పెరిగే పిల్లల మానసిక అభివృద్ధి ఏంకాను? ఆ రోజు నేను చూసాను - ఒక పిచిక గూడునుంచి నేల పడిపోయింది. దాన్ని ఒకరోజు పోషించడమే మాకు అసాధ్యమనిపించింది. గూడులో ఉంటే అదీ స్వయంగా పిచికలాగ ఎగిరివుంటుంది!" అని ఆవేశంతో అన్నాను. నాకు ఛాన్సు దొరికినప్పుడు అతన్ని సవరించవద్దూ?

నేను తహతహలాడడం చూసి అతనికి సరదాగా ఉంది. "అవును, నిజం!" అని అంటూ ఏదోలాగ నన్ను చూసారు.

నేను ఇంకా చెప్పాను. అతని మొహం చూసి నేను ఎందుకు జంకాలి?

"సార్, ఏ తల్లి మీ భార్యలాగ నిదానంగా, సముచితంగా, తిట్టకుండా, కొట్టకుండా, పిల్లవాడిని పెంచుతోంది? చూడడానికి మీ అబ్బాయి దివ్యంగా యువరాజులాగ ఉన్నాడు. మీ భార్య శిక్షణ అమోఘంగా ఉంది. ఉత్తికే ముచ్చలాడడం, తిట్టడం - ఇవన్నీ పొరబాటు, సార్! నా భార్య ఎలాగో తెలుసా? మా అబ్బాయి రాముని 'ఛండాలుడా?' అని తిడుతుంది, 'మోహనరామా?' అని ముద్దులాడుతుంది. ఎందుకీ తిట్లూ, ముద్దులాటలూ?" అని నేను నవ్వుతూనే అన్నాను.

స్వామినాథన్ కళ్ళు తడిసిపోయాయి. "మీకు తెలీదు సార్ . . . " అని గొణుక్కున్నారు. నా కలత చూసి వివరించారు.

"మా గోపీకూడా ఒకప్పుడు అలాంటి తిట్లు విన్నాడు . . . చాకలేట్లు అందుకున్నాడు సార్!"

అతను ఇంకా చెప్పారు.

"కమలం నాకు చెప్తూనే ఉండేది: 'నాకు బాగా తెలుసు. సవతి తల్లి అనేది చాలా చెడ్డ పేరు. నా శత్రువుకి కూడా అటువంటి గ్రహచారం రాకూడదు!' అని. నాకు దాని మనసు తెలీదా? నేను దాన్ని తప్పుపట్టడం ఎందుకు? ఊరులో నలుగురు ఏమంటారో అని మనమే ఏమేమో కల్పించుకొని, భయపడి, పిల్లవాడిని పెంచే

అలవాటు వద్దు అని నేను అంటున్నాను! అభిమానం ముఖ్యం. కన్నతల్లి పెంపకంకీ, దాని పెంపకంకీ ఎంత భేదం చూసారా?" అని అన్నారు.

నా కలవరం పోలేదు; చిందరవందరగా అలాగే నిల్చున్నాను.

"గోపీ తల్లి కన్నుమూసినప్పుడు వాడికి మూడేళ్ళు. అమ్మ అని ఒకావిడ ఉండేదని వాడి మనసుకి తెలుసు. పాపం! 'ఆమె కనిపించలేదే?' అని దిగిలుతో ఇల్లంతా తిరిగి తిరిగి వచ్చేవాడు. ఎలాగో వాడి అంతరాత్మకి అది తెలిసిపోయింది - 'ఇక అమ్మ రాదు!' అని.  ఆఖరికి ఎలాగో పసిహృదయం అద్భుతంగా సర్దుకుంది సార్!"

అతనలా చెప్తూపోతుంటే నేను నా మిత్రులు, గోపీ, కమలంని, నా మనసులో మూడు కోణాల్లో అంచనా వేస్తూనే ఉన్నాను.

తల్లి లేని పిల్లవాడికి తల్లిని మించిన ఒక పరిచారిక దొరికింది.

"అంటే గోపీకి కమలం పిన్ని అన్నమాట!" అని మాటవరుసకి అన్నాను.

అతని మొహంలో నవ్వు  లొట్టియలాగ ఊగింది. "అవును, ఒక అమ్మాయికి నేను స్వామిగా, ఇంకొక అమ్మాయికి నాధుడుగా ఉండేవాడిని" అన్నారు. తనకి రెండు భార్యలు అని అతను సూచించగానే అతని మొహంలో ఒక ఛాయ కనిపించింది, నడుం వొంగింది. ఆ సమయంలో నా భార్య రాధైగాని అతన్ని చూసివుంటే? ఈ మగ కులంని శపించడానికి దానికి మరేం వద్దు. "చూసారా, ఈ ఘోరం? అమ్మాయి జాతకంలో అంగారకుడు ఉంటే దోషం అని అంటున్నారు. కాని మగవాడికి అది కళత్ర యోగం! ఇదేం న్యాయం?" అని బొబ్బలు పెడుతుంది.

భార్య పోయి రెండవ పెళ్ళి చేసుకొనే అన్యాయం రాధై భరించలేదు.

ఇప్పుడే నేను కమలం లాంటి స్త్రీలగురించి ఆలోచించాను. రెండవభార్యగా. సవతి తల్లిగా, పాపం, ఆవిడకి ఎన్ని బాధలు! అది మంచు కొండల్లో ప్రయాణం చేసే మనుషుల అవస్త లాగ! అందుకు ఎన్ని ఉపాయాలు, ముందు జాగ్రత్త, హెచ్చరికాలు కావాలి! కమలం పరిస్థితి అలాగే కదా? 'తల్లిలాగ ప్రేమానురాగం చూపాలి, ఉత్తికే అధికారం చెలాయించి తిట్టకూడదు!' అని తెలుసుకొని మెళకువగా మెలగాలి. తన బాధ్యతగురించి తెలుసుకున్న తరువాత వేరే గతి లేదే? కమలం గోపీపై చూపే అభిమానం నకిలీ ముత్యంలాగ అని స్వామినాధన్ అనుమానిస్తే ఆవిడ చేసేదేముంది?

ఈ మనసుందే, అది చాలా విచిత్రమైనది. కమలం సవతి తల్లి అని తెలిసిన తరువాత ఒక రోజు నా మనసులోనూ ఆవిడపై ఉన్నత భావన తగ్గడానికి సూచనలు కనిపించాయి; మంచి వేళ, దేవుడు నన్ను కాపాడాడు.

ఇంకొక చిన్న సంగతి. వీధిలో వర్షం కురిసిన తరువాత ఎక్కడ చూసినా బురద. ఆ రోజు కమలం పిల్లవాడికి ఇస్త్రీ చేసిన బట్టలు తొడిగించింది. అది అశ్వమేధ యాగంలో గుఱ్ఱాన్ని అలంకరించి పోరాటంకి సిద్ధం చేసినట్టు నాకనిపించింది. గోపీ వీధిలోకి పరుగెత్తాడు. నేను వాడిని నా దగ్గరికి పిలిచి మా అబ్బాయికోసం కొన్న View Master లో వాడికి చిత్రాలు చూపించాను. ఆ రాత్రి స్వామినాధన్ మా ఇంటికి వచ్చారు. “సార్, చూసారా, మా ఆవిడ ఏం చేసిందో? పిల్లవాడు అడగ్గానే యువరాజు ఆజ్ఞ లాగ సరే అనేసింది! ఏం, మామూలు చొక్కాయి, నిజారు తొడిగించకూడదా?” అని అడిగారు. ఆ సమయం “అవును, ఆవిడ ప్రవర్తన కొంచెం క్రూరంగానే ఉంది. ఇతను చెప్తున్నది పొరబాటు కాదు!” అని నాకూ అనిపించింది; కాని మరుక్షణం తప్పించుకున్నాను.

“సార్, ‘ఒరేయ్, ఒక రోజు ఆగరా?’ అని మీరెందుకు వాడిని సముదాయించలేదు? అన్ని బాధ్యలూ మీ ఆవిడకే వదిలేయాయాలని మీరు అంటున్నారా?” అని నేను అడగ్గానే అతను నన్ను తేరిపార చూసారు; నోరు మూసుకున్నారు.

** ** **

నాకు నాలుగు రోజులు సెలవు దొరికింది. చాలా సంతోషంతో నేను నా ఇల్లు చేరుకున్నాను.

“అబ్బబ్బా, మీ అబ్బాయి ఎన్ని ప్రశ్నలు అడుగుతున్నాడు! ‘నాన్నగారు ఎప్పుడు తిరిగి వస్తారు, ఎక్కడికి వెళ్ళారు?’ అని మాటి మాటికీ అడిగి నా ప్రాణం తీసేసాడు! వాడికి ఏమైనా కొనితెచ్చారా? ఒరేయ్, రామూ, మాటాడవేం? నాన్నగారి దగ్గరకి వెళ్ళు! మీరే వాడిని రమ్మని పిలవండి!” అని రాధై నాకు స్వాగతం చెప్పింది.

నా ఉత్సాహంలో నేను రాధైని పురిగొల్పాలని కమలంగురించి మాటాడాను. దాధై సావధానంగా విన్న తరువాత అన్న నాలుగు మాటలూ విని సహించుకున్నాను. నా మనసులో కమలం గురించి గౌరవం పెరిగింది. ‘స్వామినాధన్ ఇంకొక భార్యతో జీవించారు!’ అనడానికి గోపీ ఒక నిదర్శనం.

మరెలాగ కమలం ఉండాలి? నేను కమలంని మెచ్చుకొని ఒక మాట చెప్తే చాలు, రాధైకి ఒకటే రోత!

కొంచెం విశ్రాంతి తీసుకున్న తరువాత నేను ఆపీసుకి వెళ్ళాను; దారంతా రాధై, పిల్లల గురించి ఇంపైన, సొగసైన ఆలోచనలలో మునిగి, తేలి, సంతోషించాను.

మళ్ళీ నా జాగా చేరుకున్నాను. వార్తా పత్రికలో చదివిన ఒక కబురు గురించి స్వామినాధన్ని కలుసుకోవాలనుకున్నాను; అతను కనిపించలేదు.

"అతను ఊరులో లేరు. ఇవాళ తిరిగి రావచ్చు. గ్రామంలో అతనికి కొంచెం భూస్థితి ఉంది. నాలుగు సంవత్సరాలుగా వెళ్ళలేదని ఇప్పుడే వెళ్ళారు. మూడు రోజులుగా మా గోపీ నన్ను అన్ని రకాల ప్రశ్నలు అడిగి చంపేస్తున్నాడు! వాడిని వదిలేసి అతను ఇంతవరకూ ఎక్కడకీ వెళ్ళలేదు!" అని కమలం నాకు చెప్పింది.

నేను నాలో నవ్వుకున్నాను. "నేను తిరిగివచ్చిన తరువాత అతను వెళ్ళివుంటే బాగున్ను . . . మీకూ ఇంటిలో అతని సాయం లేకుండా కష్టంగా . . . " అని నేను లాగాను.

"అతను వెళ్ళడానికి ఎటువంటి అగత్యమూ లేదు. పిల్లవాడిని వదిలి ఎలా ఉండడం అని అతనికి ఇదొక పరీక్ష కాబోలు! గోపీని చదువుకోసం ఎక్కడికో పంపించాలని అంటున్నారే? అక్కడే మంచి శిక్షణ దొరుకుతుందట! ఇక్కడ నేను భరించే బాధలు అతనికి తెలుసునా?తనకి ఎది ఇష్టమో అదే కావాలంటే సరపోతుందా?" అని నవ్వుతూ. విసుగ్గుంటూ ఆవిడ అన్నారు.

** ** **

నాన్నగారు వస్తున్నారని వీధి మలుపులో జాడలు కనిపించగానే గోపీ పరుగెత్తుకొని వచ్చాడు; నాకూ చెప్పాడు. నేనూ సిద్ధమైయ్యాను; ఆ దృశ్యం చూసి ఆనందించాలని నాకూ ఆతురతగా ఉంది.

గోపీ చెయి అందుకొని స్వామినాధన్ గుమ్మం దగ్గరకి వచ్చారు. కమలం తొంగి చూసి పక్కనే నిల్చుంది. వయసులో ఆవిడ నా భార్యకంటే చిన్నది కదా? వినయం, సిగ్గు కొంచెం ఎక్కువగానే ఆమెలో కనిపించాయి. రెండు రోజులు ఎడబాటు తరువాత కూడా భర్తకి ప్రేమానురాగాలు వెల్లడించాలంటే సంకోజం అడ్డుగా ఉంది.

ఐదారు నిమిషాలు మౌనంగానే గడిచాయి. గోపీ చూపిన ఆతురత, కమలం మనసులోని ఆందోళన, స్వామినాధన్ చూపిన ఉత్సాహం - ఇవేమీ నా అవగాహనలో కనిపించలేదు.

గభీమని కమలం ఆరంభించింది: "ఒరేయ్ గోపీ, నాన్నగారిని చూడు! రోజంతా నా ప్రాణం తీసావుగా? అబ్బబ్బా, 'మీరెందుకు వీడిని మీతో తీసుకు వెళ్ళలేదు?' అని నాకు పట్టరాని కోపం వచ్చింది! నిత్యమూ నాన్నగారి గురించే వాడి ప్రశ్నలన్నీ! మరి, ఇప్పుడేమో, చూడండి, ఏమీ తెలియనట్టు అలాగే నిల్చున్నాడు! ఆ చలాకీతనమంతా ఏమైందో?" అని మనసు విప్పి మాటాడింది.

కుంభవర్షంలో గోడని ఆనుకొని నిల్చున్న ఆవులాగ కనిపించిన గోపీని స్వామినాథన్ చూసారు. "బాబూ, ఇలా రా, నా దగ్గర వచ్చి కూర్చో . . . అమ్మని ఏమని అడిగావ్? నేను రానేరానని భయపడిపోయావా?" అని చెయిని చాటి వాడిని పిలిచారు.

సినిమాల్లో మామూలుగా కౌగిలించే దృశ్యాలు కత్తిరించడం మనకి తెలుసు. అటువంటి దృశ్యాలు అనుమతిస్తే కొందరు మూతి ముడుచుకుంటారు. కమలం ఇప్పుడు ఆ రెండు పనులూ ఒకేసారి చేసింది. కాని ఈ దృశ్యం - తల్లి ప్రేమని ప్రకటించే ఈ వేడుకని - ఎవరూ ఆక్షేపించరు.


"ముందు కాళ్ళూ, చేతులూ కడుక్కొని భోంచెయ్యండి. ఆ తరువాతే మీ ఆటలన్నీ! వీడి హింసలో చిక్కుకున్నానని నాకు ఒకటే దిగులు. మంచి వేళ, మీరు వచ్చారు! నాన్నగారికి తగిన అబ్బాయి! మీ ముచ్చటలన్నీ భోజనం తరువాత ఉంచుకోండి . . . " అని కమలం దృఢంగా పలికిన ఆజ్ఞ విని స్వామినాథన్ గోపీ భుజంని మెల్లగా తట్టి ఇంటిలోకి ప్రవేశించారు.

నేను ఉలికిపడ్డాను; ఆలోచనలో పడిపోయాను. మా మనసులోని పవిత్రత తగ్గకూడదని ప్రయత్నించాను. కాని ఏదో శోచనీయమైన దృశ్యం చూసినట్టు నా కళ్ళలో దూళి పడిపోయింది.

మనసు కరిగించే దృశ్యాలు బహూశా మనకి అన్నిచోట్లా కనిపిస్తాయి. మృదువైనన ఒక పసిపాప కన్ను మూయడం కంటే శోచనీయమైన ఘటన మరొకటి ఈ లోకంలో లేదని నేను అనుకునే వాడిని. కాని ఇవాళ అభిలాష, ఆశ, భ్రాంతి, ప్రేమ - అన్నీ ఒక్క చోట ఏకమై రూపమిచ్చినట్టు - అనుభూతి, ప్రేమతో పెంచిన ఒక పసిపాపని పోగొట్టుకున్న దురదృష్టంని మించి మరేం దుర్ఘటన ఉందా అని నా మనసు అల్లాడిపోయింది.

********

(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, మే 20, 1956)



# మాతృ వంశం

మానవ హృదయంలో కొన్ని కోరికలు సహజంగా లేవడం మనం చూస్తాం. అందుకు మనకి అర్హత ఉందా లేదా అని లోకజ్ఞానంకి మించిన ఆ అభిలాషలని మనం అణచుకోడానికి ఇతరులు సాయం చేస్తే దీనమైన మనసుకి నిమ్మళంగా ఉంటుంది. కాని అన్యులు ఆ కోరికలకి రూపమిచ్చి అవి సజీవంగా వర్ధిల్లడానికి దోహదం చేస్తూనేవుంటారు.

నాకు పిల్లలు లేరు. కాని నా భర్తకూ, నాకూ దానిగురించి మనసులో లోపం లేదు. నేను ఆడదానిగా పుట్టాను కాబట్టి పిల్లలంటే నాకు కొంచెం అభిమానం ఉంది. కాని సంతానం లేదని రవంతైనా విచారం లేదు. మాకు లేని ఆరాటం, వ్యాకులత మా బంధువులని పట్టుకుంది; స్వీకారం తీసుకోమని వాళ్ళు మమ్మల్ని నొక్కిచెప్పడం ఆరంభించారు.

ఇరుగుపొరుగులలో ఉన్న వారు, స్నేహితులు, బందవులు "త్వరలో మీకు సంతానం కలగాలి!" అని మమ్మల్ని దీవించారు. నేను నాలో నవ్వుకున్నాను. రాబోయే ఆ శిశువులని గుర్తు చేసుకొని అనుకున్నాను: 'మీకేం తొందర వద్దు! మెల్లగా పుట్టండి! మీకు స్వాగతం చెప్పడానికి మీ తల్లిదండ్రుల ఆర్థిక స్థితి ఇంకా బాగా పెరగాలి. మీ అదృష్టం బాగుంటే మీరూ భవిష్యత్తులో సిరిసంపదలతో వర్ధిల్లుతారు. ఇంకొక సంగతి. మీ అమ్మ కూడా ధృడగాత్రంగా ఉండాలి; అప్పుడే మీరూ హాయిగా ఉంటారు. నేనిప్పుడు సమర్థతతో ఇల్లాలుగా నా బాధ్యతలన్నీ చూసుకుంటున్నాను. ఇంటిలో తట్టుముట్లన్నీ నీటుగా, అమరికగా ఉన్నాయి. ఐనాకూడా నేను వేళకి మించకుండా రుచిరుచిగా మావారికి ఎది వడ్డించినా అతనెప్పుడూ నన్ను మెచ్చుకోడం లేదే? నాకెందుకీ అవమానం! 'దీనికి పిలల్లంటే అసహ్యం, మరి పిల్లలతో ఎందుకు ముద్దాడాలి?' అని నన్ను ఎవరూ ఇక వెక్కిరించరు కదా? అసలు నాకు పిల్లలంటే ద్వేషం లేదు. ఎప్పుడో ఒకప్పుడు నాకలా అనిపించెందేమో? . . .

అమ్మకూడా అన్యులతో కలుసుకుంది. నా వదిన తల్లి కాబోతుందట; నా గురించి తను పడుతున్న వేదన గురించి అమ్మ ఉత్తరంలో రాసింది.

నా అభివందనలు తెలియజేస్తూ వదినకి ఒక ఉత్తరం రాసాను. ఉమా ప్రత్యుత్తరం రాయలేదు. అన్నయ్యని అడిగి తెలుసుకుందామని రాసాను. వాడి జవాబు ఏమిటో తెలుసా?

అన్నయ్య అమ్మకి కూడా రాసివుండడు; తన ప్రియమైన చెల్లెలికే రాసాడనుకుంటాను.

"నీకుగాని పాప పుట్టితే నాకు ఎంత సంతోషమో తెలుసా? దేవుడికి వక్రబుద్ధి! మనుషులలోనూ ఈ వక్రబుద్ధి మనం చూస్తున్నాం. "ముందటి సంవత్సరం పెళ్ళి, ఈ సంవత్సరం పాప!" అని నీ వదిన యాతన. అది చూస్తే నాకు భవిష్యత్తు గురించి చాలా బెంగగా ఉంది. దానికి రాబోయే బాధ్యతని భరించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. కాని తల్లి సేవతో దాన్ని పోల్చగలమా! ప్రసవంకి ఇంకా నాలుగైదు మాసాలున్నాయి. అబ్బా, ఇంతలోనే నీ వదినకి ఎంత దిగిలు! ఆ బిడ్డ ఏం పాపం చేసిందో? అమ్మకి గాని ఇది తెలిసిందంటే ఎంత బాధ పడుతుందో?"

ఈ ఉత్తరం చదివిన తరువాత నాకు వదినపైనే కోపం వచ్చింది. అన్నయ్యని ఎలా ఓదార్చడం అని ఆలోచించాను.

త్వరలో కోపానికి బదులు సానుభూతి కలిగింది. ఎనిమిది మాసాలముందు అన్నయ్య - వదిన పెళ్ళి జరిగింది. ఉమా నాకంటే నాలుగేళ్ళ చిన్నది. ఇప్పుడు దానికి మాతృత్వం అంటే యాతన. అది సహజమేకదా? యాతన ఎక్కువైతే అది ద్వేషంలాగ కనిపిస్తుంది.

నాకే శిశువంటే జుగుప్సగా  ఉందే - ఉమాని నిందమోపడం ఎందుకు? ఆర్థిక అవస్థ, ఇంటిలోని వసతులు ఈ ఊరులోకంటే ఆ పట్టణపు వాసంలో తక్కువగానే ఉంటాయి. మేమున్నది ఇద్దరే; ఎక్కడకి వెళ్ళిరావాలన్నా మాకు ఆటంకం లేదు. అతిథులు ఎప్పుడు వచ్చినా సరే, మేం వాళ్ళకి స్వాగతం చెప్తాం.  మా ఇల్లు శుభ్రంగా, పొందికగా ఉండాలి, అదే నాకు కావాలి.  ఇంతకు మించి ఏ ఇల్లాలు కాపురం చేస్తుంది?

కాని మా ఆయనకి ఇల్లుకంటే బాహ్యప్రపంచంలోనే ఆసక్తి ఎక్కువ. "రా, మనం వెళ్దాం!" అని నాతో వెంటవెళ్ళే అలవాటు మాత్రం అతనికి ఏ మాత్రం లేనేలేదు. నేను హఠం చేసి మేం ఎప్పుడైనా వెళ్ళామంటే అప్పుడుకూడా అతనిలో నేను ఎదురుచూసిన  ఉత్సాహం కనిపించదు. నేను కోరే సామాన్య వస్తువులుకూడా అతనికి ఖరీదుగానే  కనిపిస్తాయి. అదే మా ఆర్థిక అవస్థ. నేను అతనితో వెళ్ళడమే ఒక భారం అని అతని మనసులో ఉందా? " . . . నా ప్రేమని వెల్లడించడం నాకు

చేతకాదు . . . దాంపత్యంకి నాకు అర్హత లేదేమో?" అని ఒకరోజు అతను విసుగ్గున్నారు. భర్తగా తనకి అర్హత లేదంటే, మరి తండ్రిగా . . . ?"

ఇదే నా గొడవ. ఇక ఉమా గురించి చెప్పాలంటే . . . భర్తతో కాపురం చేస్తూ అతని అభిలాషకి తగినట్టు తను వంట, సంసార బాధ్యతలు నిర్వహించడం అలవాటు చేసుకోవాలని ఆమెకి ఆశ . . . మరి ఇప్పుడు శిశువుతో పెనుగులాడడానికి ఆమె దిగులు పడితే అందులో ఆశ్చర్యమేముంది?

అన్నయ్య వదిన గురించి చీదర పడకూడదని, ఆడపడుచుగా నా హోదాకి ఏ హానీ రాకూడదని నేను అన్నయ్యకి జవాబు రాసాను; కొన్ని వివరాలు నొక్కిచెప్పాను:

'ఉమాలాగ మాతృత్వం రాకముందే నాకు ఆమె మనోభావం వచ్చేసింది. దేవుడి సృష్టిలో వక్రబుద్ధి అని అంటూ ఏమీ లేదు. వదినకిగాని శిశువుని పోషించే సమర్థతలో ఏమైనా లోపం ఉంటే దాన్ని మెప్పించడం అన్నయ్యకి తెలుసు. అందువలనే దేవుడు దయలో మీకు సంతానభాగ్యం అని సంతోషించండి!'

నాలో ఇంకొక ఆలోచన. మాకుగాని సంతానం కలిగితే నా లోటుని మా ఆయన పూర్తిచెయ్యగలరా?

చాలా రోజుల మౌనం తరువాత అన్నయ్య జవాబు వచ్చింది. "నీ వదిన మనసులో పూర్తిగా మార్పు వచ్చేసింది!" అనే సందేశం విని నాకు విభ్రాంతి కలిగింది. "ఇప్పుడు దేశంలో వనమహోత్సవం కొనియాడుతున్నారుకదా? నీ వదినకూడా రకరకాల మొక్కలు నాటడం అలవాటు చేసుకుంది. చాలా సంతోషంతో కనబడుతోంది" అని రాసాడు.

నా ఆశ్చర్యం వదిన సీమంతంకి వెళ్ళినప్పుడు అణగింది. అన్నయ్య ప్రేమ, అనురాగంతోబాటు 'నేనూ సిద్ధంగా ఉన్నాను!' అని వాడు అభయం ఇచ్చిన తరువాత వదినకి దిగిలెందుకు?

సరైన వేళలో వదినకి ఒక ఆడపిల్ల - మాకు మేనకోడలు - పుట్టింది. మేం సంతోషించాం. దీవెనలు పంపాం. మాకు అసూయ లేదు. అసలు సంతానం లేదనే కొఱత ఉంటేనేకదా అసూయ లేస్తుంది? మాకోసం కుమిలిపోయేవారు "వినండి! దేశంలో జనాభా తగ్గాలి! గుర్తు చేసుకోండి!" అని మేం హెచ్చరిక చేస్తున్నామని అనుకోవచ్చు. 'మీరెందుకు మా గురించి బాధపడుతున్నారు? ఈ సంసారమే

మాకు భారంగా ఉంది!' అని మేం అంటున్నామని, అది మా ఆత్మరక్షణ అని కొందరు నిందించవచ్చు. వాళ్ళ హేళనకి మూల కారణం వాళ్ళ అపజయం!

పెద్దలు దీవెనలు ధారపోసారు; నాకంటే వయసులో, అనుభవంలో చిన్నవారు నన్ను గెలిచిన గర్వంతో దీవెనలు పంపారు; అనుభవం లేని యువతీయువకులు తమ కోరికలని తెలియజేసారు; వాళ్ళందరూ తమ అవగాహనలో నన్ను నిలబెట్టి చూసారు. నేను వాళ్ళని తప్పుపట్టను. అరవైయేళ్ళ పెద్దలు చురుకుగా పనులు చేస్తూ నాకంటే తక్కువ ఆర్థిక స్థితిలో పిల్లలతో కాపురం చేసే గృహిణిలని చూస్తే నాకు వింతగా ఉంది! నిద్రపోవాలంటే నాకు ఎటువంటి ఆటంకం లేదు. నాకు కావలిసిన పాలు, పెరుగు ఉన్నా నా అలసట, విసుగు అలాగే ఉన్నాయి. ఇవన్నీ నేను ఎవరిదగ్గర ఎన్నిసార్లు చెప్పుగోగలను? నేను ఇతరుల ప్రతిభలు పొగడుతున్నాను, మరి నా ప్రజ్ఞలు ఎవరూ గుర్తించరే? అదొక్కటే నాకు బాధగా ఉంది.

మురికి పందికూడా పది పిల్లలు కంటుంది. లోకంలో పందికి ఏం గొప్ప ఉంది? గొడ్డుతనం అనే కారణం వలన పళ్ళులు ఇవ్వని వృక్షంనీ, పువ్వులు లేని చెట్టునీ ఎవరూ ఇష్టపడరు. కాని అవికూడా చిన్నారి ఉడతలాగ[1] వర్షం ఉత్పత్తికి దోహదం చేస్తాయి.

అదిగో, అక్కడున్న ఉసిరిచెట్టులో వేలాడుతున్న నాలుగు పళ్ళు చూస్తున్నాను. చెట్టుని ఆకులు దట్టంగా కప్పేసాయి. కాని మన కళ్ళని ముందు ఆకర్షించి, తేరిపార చూడడానికి పురిగొల్పేవి ఆ పళ్ళే! చెట్టుకి విలువ ఇచ్చేది ఫలం! స్త్రీకి విలువ ఇచ్చేది సంతానం!

వేరే ఊరుకు బదిలయి ప్రయాణం చేసే మార్గంలో మా ఆడపడుచు కుటుంబం ఒక వారం మా ఇంటిలో బస చేస్తారని కబురు రాగానే నేను నివ్వెరపోయాను. కొన్ని సంవత్సరాలముందు ఆడపడుచు నామీద చెలాయించిన దురహంకారం, ఆమె చీవాట్లు గుర్తుచేసుకున్న తరువాత నాకెలా ఉంటుంది? అలాగే భ్రమించిపోయాను.

కాని వాళ్ళు వచ్చిన తరువాత . . .

మా ఆడపడుచుకి ఇద్దరు పిల్లలు. ఇంకొక శిశువు కడుపులో ఉంది. ఇవన్నీ చూడగానే నా దిగ్భ్రమ జారుకుంది. నా విసుగు, అలసట మూటగట్టి, దాచేసి,

---

[1] రామాయణంలో శ్రీరాములవారి వారధి నిర్మాణంలో ఆ చిన్న జంతువు సాయం చేసిందని చెప్తారు.

అతిథి సత్కార్యం పూనుకున్నాను. Electric fan లాగ చురుకుగా పని చేసాను. మధ్యాహ్నం నిద్ర లేదు, పనులు బాగా పెరిగిపోయాయి, కాని విజయవంతంగా అన్నీ సాధించాను. ఊరుకి తిరిగివెళ్తున్నప్పుడు ఆడపడుచు నాతో "నీకూ త్వరలో పిల్లలు పుట్టాలలని నా ఆశ. ఈ సారి అమ్మకి బదులు నువ్వు వచ్చి నా ప్రసవంకి సాయం చేసావంటే నీకూ ఫలం కలుగుతుంది!" అని ఆశ చూపుతూ దీవించింది. నేను ఒక క్షణం ఉలికిపడి "అక్కయ్యా, అలాంటి ఫలం కలిగితే నాకు సాయం చెయ్యడానికి భయమేస్తుంది!" అని చెప్పేసాను.

ప్రసవంకి సమయంలో సాయం చెయ్యడం ఒక దివ్యమైన సేవ; నేను కాదనను. కాని నాకది సాధ్యమా? ఈ ఒక వారం నేను పడిన అవస్థ చాలు. ఈ వారం కృషికోసం నాకు బొంబాయికి వెళ్ళాలని ఉంది. అన్నయ్య ఇంటిలో వదిన ఆతిథ్యం అనుభవించాలి!

దీన్ని మా ఆయనతో తమాషాగా చెప్పాను. అందుకు అతను "నీకు తెలుసా, వదిన, అన్నయ్య తల్లిదండ్రులతో సమానం అని అంటారు. నీకు రెండు జాగాలున్నాయి; మీ పుట్టిల్లుకి వెళ్దామా?" అని అడిగారు. అతను కోపంతో అడుగుతున్నారేమో అని నాకు అనుమానం కలిగింది. "వెళ్ళిరావడానికి చాలా ఖర్చు అవుతుంది. ఇక్కడే ఒక వంటమనిషిని పెట్టుకొని నేను హాయిగా ఉంటాను!" అని అన్నాను. నేను సరదాగా అన్న మాటలవి. కాని అతనికలా అనిపించలేదు. "కారులో ప్రయాణం, ఊటీ[2]లో నివాసం - వీటికి నీకొక ఒక లక్షరాపాయలు లేకపోవడం నీ దురదృష్టం! ఎడ్ల బండిలో పొత్తులేని రెండు ఎద్దులు కట్టినట్టుంది మన కధ! సరేలే, మనం వెళ్ళితీరాలి!" అని అన్నారు. ఏం మాటలు! ఎద్దులు[3]! స్త్రీత్వంకి  విశేషం మాతృత్వం. ఆ ప్రభావంకి నాకు యోగ్యత లేదు; అది మా ఆయనే నాకు వక్కాణించి చెప్పాలా?

అదిగో, ఆ పూల తొట్టిలో నేను నాటిన రెండు తులసీ మొక్కలు. రెండూ బాగా పెరిగిపోయాయి. కాని ఎంత ఎత్తు పెరిగినా, శోభ లేదు, కొత్తగా ఏమీ కనిపించదు. నేను నాటిన మొక్కలు మాలాగే ఉన్నాయి కాబోలు!

తొట్టిమధ్య తొట్టిలోని మన్ను కళ్ళకి కనిపించినట్టు రెండు మొక్కలూ గాలిలో ఊగుతున్నాయి. అవి దట్టంగా పెరిగి తొట్టినంతా కప్పేయడం చూడాలని నా

---

[2] తమిళనాడులో పర్వతప్రాంత పట్ణం

[3] తమిళంలో ఎద్దుకి కాళై అని కూడా పిలుస్తారు. దానికి వీరుడు అనే అర్ధమూ ఉంది.

ఆకాంక్ష. కాని నేను నాటిన మొక్కలతో అలాగేమీ జరగలేదు. "అమ్మాయీ, రోజూ తులసీ చెట్టుకు ముగ్గులు వేసి, బొట్టు పెట్టుకొని, దీపం వెలిగించితే, నీకు మంచి భర్త దొరుకుతాడు!" అని ఒక అవ్వ నా పదిహేనో వయసులో నాకు చెప్పారు, ఇప్పుడు ఇంకొక ముత్తైదువ నాకు సంతాన భాగ్యం కలగాలని దీవిస్తున్నారు. మిరప పొడి వాసన మనకి బాధగా ఉటుంది. కాని అందులోనూ పురుగులు నెగ్గడం మనం చూస్తున్నాంకదా? నాకు అసాధ్యమనిపించినా ప్రయత్నించి చూడాలనుకున్నాను.

మా ఆయనలోగాని నా అన్నయ్యలాగ దాక్షిణ్యం ఉంటే, నాలో ఈ విభ్రాంతికి చోటు ఉంటుందా?

వదిన దండిగా స్వెటర్లు - రకరకాలుగా, పిల్లలకి నచ్చినట్టు - అల్లుతోందని అన్నయ్య రాసాడు. అంతేకాదు. "నా ఆడపడుచు మీకూ ఒక పాప పుట్టాలి, దానికి ఒక స్వెటర్ అల్లాలని నాకు ఆశ. ఇప్పుడు నా ఆడపడుచు ఆడపడుచుకి రెండు కంబళి చొక్కాయిలు పంపిస్తున్నాను!" అని వదిన రాసింది. తన భార్య ఔదార్యం చూసి అన్నయ్యకీ చాలా గర్వంగా ఉంది.

ఉమా కొత్త కొత్త పిండివంటలు చేసి నాకు పంపించింది. "ఎలా నేర్చుకున్నావ్?" అని అడిగాను. "ఎవరి ఇంటికి వెళ్ళినా అక్కడ ఒక కొత్త తినుబండారం కనిపిస్తే చాలు, అది మా ఇంట్లోనూ చెయ్యాలని నా పిల్లలు పట్టుబడతారు. అదే నాకూ బాగా అలవాటైపోయింది!" అని వదిన గర్వంతో రాసింది. ఇక నా గురించి ఏం చెప్పను? "'దీపావళికి మీ ఇంటిలో ఏమిటి విశేషం?' అని ఎవరైనా నన్ను అడిగితే నేను వెగటుగా మూతి ముడుచుకోడం గుర్తుచేసుకున్నాను. 'పండుగని ఏదో చేసి తీరాలి! అవునా?' అని నాలో నొచ్చుకున్నాను.

ఉమా పంపిన చొక్కాయిలు, కొన్ని పిండివంటలు నేరుగా వెళ్లి మా ఆడపడుచుకుకి ఇవ్వాలని నేను నిశ్చయించాను. "నాకు ఎక్కడైనా వెళ్ళాలని ఉంది!" అని నేను నొక్కిచెప్పిన తరువాత మేం బయలుదేరాం. వెళ్ళి చేరినవెంటనే నేను అలసటని లెక్కచెయ్యకుండా, అతిథి అనే హోదా పాటించకుండా ఆ ఇంటిలో సంచరించాను. ఆడపడుచు పిల్లవాడు నా దగ్గరకి రాకుండా మా ఆయన్ని చుట్టుముట్టుకున్నాడు. అప్పుడు అతను నన్ను చూసి నవ్వారు. కొన్నిసార్లు అతన్ని లెక్కచెయ్యక నా దగ్గరకి వచ్చి ముద్దులాడాడు. అప్పుడూ అతను నన్ను చూసి చిరునవ్వు నవ్వారు.

కొన్ని చాపలు కళ్ళతోనే పునరుత్పత్తి చేస్తాయట. దేవీ మీనాక్షి అనుగ్రహం భక్తులని ఉద్ధరించుతుంది. అది మా ఆయన్ని ఆవరించుకుందేమో?

"పిల్లవాడికి స్నానం చేయించిన తరువాత నాకు ఇచ్చేయ్, నేను వాడికి బట్టలు తొడిపిస్తాను," అని ఆతురతతో దుస్తులతో పది నిమిషాలు నిలబడే మా వారిని చూసి నాకు ఆశ్చర్యం ఇంకా ఎక్కువైంది. పప్పు నానబెట్టకుండా, రుబ్బకుండా నేను చేసిన పిండివంట రుచి చూసి అందరూ "భలే, బాగుంది!" అన్నారు. "అమ్మాయి నీ పక్కనే నిద్రపోతున్నప్పుడు నువ్వు ఇలా అలా తిరుగుకూ దాన్ని యెగరగొడతావేమో అని భయరడ్డాను. కాని అమ్మాయి కొంచెం కదిలితే చాలు నీకు మెలకువ వచ్చేసింది! నీకసలు గాఢనిద్ర అలవాటుకదా? మరిప్పుడు నీకు ఎలా మెలకువ వచ్చింది?" అని మా ఆయన ఆశ్చర్యంతో, ఆనందంతో అడిగినప్పుడు నాకు  ఇంతవరకూ తెలియని నిజం బోధపడింది: నా మంద బుద్ధి నిద్రలేచింది. విసుగు లేకుండా మెలకువ పూర్తిగా వచ్చేసింది. స్వార్థం అనే ముసుగు జారిపోయింది.

దివ్యమైన సేవ మా ఇంటిలో జరగాలని నేను మా ఆడపడుచుని, పిల్లలనీ మాతోబాటు రమ్మని పిలిచాను. తన తల్లికి మించిన ప్రేమతో ఆ రోజు మా ఆడపడచు తన కాన్పుకోసం నన్ను పిలిచారు. ఆవిడకి నేనంటే ఎంత గౌరవం! అదిప్పుడు నెరవేర్చడం నా హృదయపూర్వక ధర్మం.

పనికి వచ్చే ఆవులాగ కాకపోయినా, మా ఆయన అన్నట్టు ఎద్దుగా రాణించాలనే అభిలాష నాకు లేదు. మాతృవంశంకి సముచితమైన భావనలుంటే అదే చాలు అని నా ఆశ.

********

(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, మార్చ్ 25, 1952)



# స్వల్ప భేదం

దాంపత్యంలో ఇంపైన ఘట్టంని ఉమా ఆతురతతో చేరుకుంది; ఇటీవల భర్తతో కొత్తగా కాపురం ఆరంభమైంది. ఆమె ఇల్లు చిన్నదే కాని తనే ఇంటి యజమాని; ఆమె భర్త చంద్రు యజమానుడు. పెద్ద బంగళాలో అనుభవించని హక్కు, హోదా, ఆధిక్యం ఇప్పుడు తన అందుబాటులో ఉన్నాయని ఉమా సంతోషించింది. .

వీధిలో అమ్ముతున్న ఒక చిన్న వస్తువుని కొనడంలో కూడా ఉమాకి గర్వంగా ఉంది. ఒక డజను బొత్తాములు కూడా ఇష్టపూర్వకంగా కొనడానికి తనకు అధికారం లేదని వాపోయిన ఉమా ఇప్పుడు ఇల్లాలుగా తనకి ఎది ఇష్టమో దానికి మించి ఇంటికీ ఏం కావాలో అవన్నీ కొనడానికి ఏ ఆటంకం లేదని సంతోషపడుతోంది. వీధిలో కాయగూరలు కొన్నప్పుడు ఆమె మొహం ప్రకాశవంతంగా కనిపిస్తోంది.

"లేత బెండకాయ కావాలంటే కాండం ఇలాగ వొంగాలి!" అని భర్తతోగాని లేక "మామీ, నేను మా ఇంటికి అర శేరు సీమవంకాయలు కొన్నాను!" అని ఉమా మరెవరికైనా చెప్పినప్పుడు ఆమె కళ్ళలో గాంభీర్యం, ఆహ్లాదం చోటుచేసుకుంటాయి.

వీధిలో కూరగాయలు అమ్మేవారు ఉమా దగ్గరకి వచ్చి శ్రద్ధంగా "అమ్మా, మా దగ్గర కొనండి!" అని అడుగుతారు. ఎందుకంటే ఉమా వాళ్ళతో ఖచ్చితంగా బేరం చెయ్యదు; బేరంలో ఒక అర్ధణా, అణా భేదమని వస్తే ఉమాపే 'సరే!' అని ఒప్పుకుంటుంది.

ధర ఒక రూపాయి అని బేరంలో వస్తే ఉమా పది లేక పదకొండు అణాలతో బేరం ఆరంభించి రెండే గంతుల్లో పదిమూడు అణాలకి వచ్చేస్తుంది. పొరుగింటి కమలం సగం ధరలో బేరం ఆరంభించి, ఏడెనిమిది సార్లు అడిగిన ధరని ఎక్కువచేస్తూ, ఆఖరికి పన్నెండణాలకి అదే వస్తువు కొనడం ఉమాకి తెలుసు. కాని సహజంగా ఆమెకున్న ఉదారత్వం దోహదం చెయ్యడం వలన ఉమా మనసులో ఉత్సాహం, సంతోషం నిలకడగానే కనిపిస్తాయి.

కమలం తను కొన్న ధరని చెప్పినప్పుడుకూడా ఉమా "ఏదో నేను కొనేసాను!" అని మాత్రం అంటుంది. 'ఎందుకు బీదలని మనం పీడించాలి?' అని తన అభిప్రాయం చెప్పదు. బీదలకి లొంగడం గొప్ప అనే భావన ఆమెకి లేదు; జ్వాలలో ఉష్ణం ఉన్నట్టు ఆమెలో స్వభావంగా ఔదార్యం పరిణమించింది.

కాని కమలం ఈ విషయంలో ఉమాకి విరుద్ధం. తనంతట తానే వచ్చి తను చవుకగా కొన్న వస్తువులగురించి ఉమా దగ్గర కమలం పాట పాడుతుంది. "ఎనిమిదణాలకి తగ్గనన్నాడు. నేను బేరమాడి ఏడణాలు, ఒక కానీ[1]కి కొనేసాను!" అని ఆమె విఱ్ఱవీగినప్పుడు ఉమా 'ఇలాగ బేరం చెయ్యడం న్యాయమేనా?' అని మనసులో అనుకుంటుంది; కాని నోరు విప్పి ఏమీ అనదు.

ఏదైనా కొనాలంటే ఉమా తన సాయం కోరుతుంది, తప్పక కోరాలి అని కమలం మనసులో ఉందేమో? కాని ఉమాకి అటువంటి ఆలోచన లేనే లేదు. కొంచెం డబ్బు ఎక్కువగా ఖర్చు చేస్తే అందువలన తన పరువుకి, ఆర్థిక పరిస్థితికి ఏ హాని రాదని ఆమె నమ్మకం.

రెండు మూడు సార్లు ఉమా భర్తకి చెప్పింది: "అర్ధణా, అణాకి ఎందుకు బేరం చెయ్యాలని నాకు అనిపిస్తోంది" అని. చంద్రు కూడా ఆమె వైఖరితో ఏకీభవించాడు. "అవును, నిజం," అని అతనూ అన్నాడు. అందువలన ఉమా ఉదారతకి ఎటువంటి ఆటంకం రాలేదు. 'మనకి అర్ధణా, అణా లాభమంటే అమ్మేవాడికి అది పెద్ద నష్టం; మనకా లాభం వద్దు!" అనే సహజ మనోభావం, కనికరంతో ఉమా కాపురం సాగుతోంది.

ఇరుగుపొరుగులవారికంటే ఒకణా ఎక్కువ ఇచ్చి కూరగాయలు కొనడం ఉమాకి గొప్పగా అనిపించలేదు, అందులో తనకి అవమానమూ లేదు. పాత వార్తాపత్రికలు అమ్మినప్పుడు బేడా[2], పావలా[3] తక్కువగా పుచ్చుకున్నప్పుడు ఆమె మనసులో ఎటువంటి బాధా, గర్వం చోటుచేసుకోలేదు.

---

[1] **కానీ - ఒక అణాలో నాలుగవ వంతు**

[2] రెండు అణాల నాణయం

[3] నాలుగణాల నాణయం

కాని క్రమేణ  ఆమెకున్న బాధ్యతలవలన ఆమె అణచిపెట్టుకున్న ఈ వాలకం మారడానికి  సూచనలు కనిపించాయి; నివురు గప్పిన నిప్పుమీద నీటి బొట్లు రాలాయి.

ఒక నెల ప్రారంభంలో భీమా పాలసీకి రుసుము చెల్లించే అగత్యం వచ్చింది. దానితోబాటు మరికొన్ని చిల్లర ఖర్చులు కలిసివచ్చి దంపతులు ఇబ్బందిలో పడ్డారు. ఇంతకుముందెప్పుడూ  అప్పు చెయ్యని దంపతులు సంకోచంతోనే రెండు మూడు చోట్ల కొంచెం అప్పు చేసారు. కాని అప్పుడుకూడా ఆఖరికి మిలిగినది ఒక రూపాయి మాత్రమే! నెల ముగింపుకి ఇంకా పదిరోజులున్నాయి.

ఉమా రెండు మూడు కూరగాయలు కొంది; ఆ రూపాయీ ఖర్చైపోయింది.

ఆ మరుదినం వంట చేస్తున్నప్పుడు ఉమా భర్త దగ్గరకి వచ్చి “మీ దగ్గర ఒక అణా ఉందా?” అని అడిగింది.

చంద్రు పెదిమలు అదుముకున్నాడు. భర్తని చూస్తూ ఉమా “పచ్చ మిరపకాయలు వేస్తే మజ్జిగ పులుసు చాలా బాగుంటుంది. అది లేకుండా ఎలా వండడం?” అని అడిగింది. భర్తకి పులుసు రుచిగా చేసి వడ్డించాలని ఆమె ఆశ. “పచ్చ మిరపకాయలు లేకుండా వంట సాగదు!” అని ఒక ఇల్లాలు ఫిర్యాదు చెయ్యడం న్యాయమా?’ అని ఆమె భర్తకి అనిపించిందేమో? చంద్రు ఆదరాబాదరాగా  “అలాగైతే మజ్జిగ పులుసు వద్దు! పచ్చ మిరపకాయలు లేకుండా వంట చేసేయ్!” అన్నాడు.

ఉమాకి  రోషం వచ్చేసింది. “సరేలేండి, ఆ తరువాత పులుసు రుచిగా లేదంటే అది నా పొరబాటు కాదు! ఒక అణాకి మనకి పత్తా లేదు!” అని చిరచిరలాడింది.

ఆ దినం ఉమా వంట అతృప్తితోనే ముగించింది.

మధ్యాహ్నం కమలం ఉమాతో మాటడానికి వచ్చింది.

“నిన్న నేను మంచి చేమ దుంప, అరటి కాయలు కొన్నాను. నువ్వేం కొన్నావ్?” అని కమలం సంభాషణ ఆరంభించింది.

“నేనూ ఆ రెండే కొన్నాను. ఇక నాలలుగు రోజులుకి అది చాలు” అని అంది ఉమా.

వెంటనే ధరలగురించి కమలం అడిగింది. ఉమా కొన్న అదే మొత్తంకి ఆ రెండు కూరగాయలతోబాటు, ఒక అణాకి పచ్చ మిరపకాయలు, ఒక అణాకి అల్లం, ఒక రూపాయికి కమలం కొనింది అని వినగానే ఉమాకి విభ్రాంతి కలిగింది.

"ఇలాగ పొదుపుగా, చురుగుగా ఖర్చు చేస్తేనే కాపురంకి మంచిదేమో? కమలంలాగ నేనూ బేరం చేసివుంటే పులుసుకి పచ్చమరపకాయల వాసన కూడా ఉండివుంటుంది! అంతేకాదు, రేపూ ఆ పులుసు గొప్పగా ఉంటుంది! ఆ తరువాత, అల్లం కూడా . . . "

ఉమా మనసుని వ్యాకులత ఆవరించుకుంది: 'మితంగా, చురుగుగా కాపురం చెయ్యడం నాకు సాధ్యం కాదేమో?' అని చిరచిరలాడింది.

ఆ రాత్రి కమలం భర్త చంద్రుతో మాట్లాడాలని వచ్చాడు. "ఒక పది రూపాయలు ఉంటే ఇవ్వవయ్యా!" అని చంద్రు మిత్రుడ్ని అడిగాడు.

"దానికేం, ఇస్తానులే . . . కమలంని అడుగుతాను; దానిదగ్గర ఉంటుంది" అన్నాడు మిత్రుడు.

చంద్రు మరేం అనక ఊరుకున్నాడు.

"ఇతనెందుకు అతన్ని ఏమీ అడగరు?" అని ఉమాకి వెర్రిబాగులతనంగా అనిపించింది.

'మా ఆవిడకి మితంగా ఖర్చు చెయ్యడం తెలీదు!' అని చంద్రుగాని చెప్పివుంటే ఉమా మనసులో విచారంకి చోటు లేదేమో? భర్త మౌనం చూసి ఆమెకి ఎలాగో అనిపించింది.

ఉమా మనసుని శోకం ఆక్రమించేసింది. ఖచ్చితంగా, మితవ్యయంతో కాపురం చేసే ఇల్లాలుకేగదా ఖ్యాతీ, ప్రతిష్టలన్నీ? అందుకేకదా కమలం తను చవుకగా కొనడం గురించి గొప్పగా చెప్పుకుంటోంది? భర్త ఆదాయంకి తగినట్టుగా ఇల్లాలు ఖర్చు చేస్తే అది అతనికి చేసే ఉపకారం మాత్రం కాదు, తనకీ గౌరవం, అవునా? అవును, కమలం డబ్బు కూడబెట్టివుంటుందని ఆమె భర్తకి ఎంత నమ్మకం! అప్పిచ్చే పరిస్థితిలో అతను ఉన్నారంటే అందుకు మూలకారణం కమలం.

తన భర్త అప్పుచెయ్యడానికి కారణం ఎవరు? తనే కదా?

'ఛీ, ఛీ, అలాగేం కాదు! . . . ఇల్లాలు మితంగా ఖర్చు చేస్తే ఆ కుటుంబంలో అంత గొప్పగా భేదం కనిపించడం సాధ్యమా? అవును, సాధ్యం! ఆ రోజు నేను వీధిలో ఒక చీర కొన్నాను. కమలం అదే చీర ఒక రూపాయి తక్కువ ధరలో కొనడం నాకు గుర్తుంది. ఒకణాలో కనిపించే ఉదాసీనత అన్నిటిలోనూ తప్పకుండా వస్తుంది. బొట్టు బొట్టుగా నీరు కారుతే వరదకి ఎంత కాలం పట్టుతుంది?'

ఏమేమో ఆలోచనలలో పడి ఆఖరితి తప్పు తనదే అని ఉమా నిశ్చయించింది.

ఆ మరుదినం టపాలో ఒక ఉత్తరం వచ్చింది. అది చదివి చంద్రు "ఛీ, ఇదేం గొడవ!" అని విసుగ్గున్నాడు.

"ఏంటి, ఏమైంది?" అని ఉమా బెంగతో అడిగింది.

"మనం భీమా పాలసీకి కట్టిన ఫీజులో ఒక అణా తేడా వచ్చేసిందట! ఇప్పుడు ఒక అణా stampతో ఒక బేడకి కవరు కొనాలి! నేను Post Office వెళ్ళాలి!" అని అంటూ చంద్రు చొక్కాయి వేసుకొని సిద్ధమయ్యాడు.

"నా దగ్గర కవరు ఉంది, ఇస్తాను" అంది ఉమా.

"నీ దగ్గర ఉందా? మంచిది . . . " అని భర్త మొహంలో కనిపించిన ఊరట చూసి ఉమాకి సంతోషం కలిగింది; అతనికి కవరు అందించింది.

చంద్రు కవరుని టపాలో చేర్చడానికి సిద్ధమవుతున్నప్పుడు ఉమా అతన్ని ఒక ప్రశ్న అడిగింది:

"ఇదేంటో నాకు వింతగా ఉంది! ఒక అణాకి ఈ భీమా కంపెనీకి ఇంత గడబిడ ఎందుకండీ?"

"ఇలాగ ఎన్ని అణాల నష్టం కంపెనీ భరించాలో ఎవరికి తెలుసు? అందుకే వాళ్ళు ఇవన్నీ చాలా శ్రద్ధతో చూసుకుంటారు!" అని మాటవాసికి చంద్రు బదులు చెప్పాడు.

"ఇప్పుడు మనకి నోటీసు పంపించడానికి కంపెనీ మూడు కానీలు ఖర్చుచేసారు! మీరూ ఒక అణా stamp తో ఒక బేడ కవరు పంపుతున్నారు! పిచ్చితనం అంటే ఇదే కాబోలు!"



"విను, ఇక మనమూ జాగ్రత్తగా ఉందాం! ఒక అణా అయినా, మూడు కానీలైనా మనకి తెలియజేయడం కంపెనీ బాధ్యత!" అని అంటూ చంద్రు చెప్పులు తొడుక్కున్నాడు.

'డబ్బు మితంగా ఖర్చు చెయ్యాలి; ఒక అణా అయినా సరే, భర్త ఆదాయంని గుర్తు చేసుకొని శ్రద్ధగా కాపురం చెయ్యడం భార్య ధర్మం!' అని ఎవరో తనకి బుద్ధి చెప్తున్నట్టు ఉమాకి అనిపించింది.

ఆ రోజు వంటలో ఒక అణా మిరపకాయలు లేకపోవడం ఆమెకి బాధగా అనిపించింది. మజ్జిగ పులుసు చెయ్యకపోయినా, భర్తకి భోజనం వడ్డించినప్పుడు దానిగురించి మరిచిపోవడం ఎలాగ?

'అర్ధణా ఐనా, ఒక అణా ఐనా, రోజు కూడబెట్టడం అత్యవసర వస్తువులు కొనడానికి మంచి ఉపాయం!' అని ఉమా నిశ్చయించింది.

ఆ రోజునుంచి ఉమా నిష్కపటంగా కానీలు గుర్తుచేసుకుంటూ బేరం చెయ్యడం అలవాటు చేసుకుంది. ఆమె కంఠధ్వనిలో ముందున్న సౌమ్యం మాయమైంది. 'ఇష్టం ఉంటే ఇయ్, లేరపోతే పో!' అని రూఢీగా బేరం చేసింది.

ఐనా కూడా తన ధోరణిలో కనిపించే మార్పుగురించి ఉమా బాహటంగా ఎవరికీ తెలియజేయలేదు. క్రమేణ ఇల్లాలుగా కాపురం నిర్వహించడంలో తనకీ సమర్ధత ఉందనే తృప్తితో సంతోషింతింది. అది నిజమేకదా? సంసారంలో ఇబ్బంది రావడంవలనేకదా తనూ బేరం చెయ్యాలని నిశ్చయించింది? కాని ఇప్పుడుకూడా కొన్ని సమయాల్లో ఖచ్చితంగా బేరం చెయ్యడం ఆమెకి సంకోచంగానే ఉంది.

ఒక రోజు మాత్రం ఉమా కమలంకి చెప్పింది: "ఆఖరికి ఆ ముసలాడు నేనడిగిన ధరకి ఒప్పుకున్నాడు. బుట్టని ఎత్తుకొని వాడు నడిచి వెళ్ళడం చూసి నాకు 'పాపం!' అని జాలి వేసింది!" అని మనసు విప్పి అంది. ఇంతకు ముందు తన ఉదారత్వం గరించి మాటాడని ఉమా ఇప్పుడు తన క్షోభని కమలంకి తెలియజేసింది.

కాని కమలం మనసులో ఏ బాధా కనిపించలేదు. "అవునులే, వాడు లాభం లేకుండా మనకి అమ్ముతాడనుకున్నావా?" అని బొత్తిగా ఉమా మాటలు తోసిపారేసింది.

ఆ జవాబు విని ఉమాకి కొంచెం ఓదార్పు కలిగింది. 'కమలం ఎంత చక్కగా నాకన్నీ చెప్తోంది! ఆమెలాగ నేనూ కాపురం చెయ్యాలి! అవును, లాభం లేకుండా ఎవరూ అమ్మరు!" అని అనుకుంది.

ఇంకొక రోజు ఆ ముసలాడుతో ఉమా బేరం చేసింది. మూడు అణాలు, మూడు కానీలకి కాయలు కొని, ఒక పావలా ఇచ్చి "ఒక కానీ ఇయ్!" అని అడిగింది.

వాడిదగ్గర ఒక కానీ లేదు. "రేపు ఇస్తానమ్మా! అని అంటూ వాడు లేచాడు.

"సరే" అని అంటూ ఉమా తన పావలా నాణయం తనదగ్గరే ఉంచుకుంది. 'ఈ పావలా తీసుకో!' అని చెప్పాలనే ఆమె నోటివరకూ మాటలు వచ్చేసాయి. కాని ఆమె మనసులో సహజంగా కనికరం తోచడం వలన ఆ మాటలు అన్న తరువాత కూరగాయలని బుట్టలో పడేసింది.

"సరేలేండి, ఇదిగో ఒక అల్లం ముక్క!" అని ముసలాడు ఒక తునక ఆమెకి అందించాడు.

'వీడికి వ్యాపారంలో ఏదో లాభం ఉంది, అందువలనే వీడిలో ఈ ఆత్మగౌరవం కనిపిస్తోంది!' అని ఊమాకి ముందు అనిపించింది. కాని వాడి వాలకం చూసి ముసలాడుమీద మెచ్చుకోలు కలిగింది.

మరుదినం అదే ముసలాడు వ్యాపారంకి వచ్చినప్పుడు మళ్ళీ బేరం జరిగింది. కాని ఆ రోజు ముసలాడు తన పిరికితనం మూటకట్టేసి దృఢంగా ఆమెతో మాట్లాడాడు.

"అమ్మా, నిన్న ఆలస్యం ఐపోయిందని నేను కూరగాయలు నష్టంకే అమ్మేసాను . . . ఈ రోజు ఆ నష్టం సరిచెయ్యకపోయినా మళ్ళీ నాకివాళ నష్టం రాకూడదు! నేనిక ధర తగ్గించలేను!" అని సూటిగా ముసలాడు చెప్పాడు.

పాలులో రవంత విషం పడినా లెక్కచెయ్యకుండా దాన్ని తను మింగినట్టు ఉమా గర్వపడేది. కాని ఇప్పుడు బేరంలో ఒక చిన్నభేదం చూసిన తరువాత ఆమెకి మందు త్రాగినట్టనిపించింది.

ఉమా తన హఠం వదులుకొని ముసలాడు అడిగిన ధరకే కూరగాయలు కొంది. వాడికి డబ్బు అందించినప్పుడు "నిన్న నీకెందుకు సష్టంతో అమ్మాలనిపించింది?

నేను ఆ కానీ వద్దని అన్నానుగా? నువ్వేగా ఒక అల్లం ముక్క ఇచ్చావ్? నష్టమంటే ఇస్తావా?" అని అడిగింది.

"అవును మరి . . . నాకెందుకమ్మా ఆ ముష్టి కానీ? బేరం చేసిన తరువాత లెక్క సరిగ్గా ఉంటాలి, అవునా?" అని అంటూ ముసలాడు బుట్టని తలమీద పెట్టుకొని బయలుదేరాడు.

ఉమా భ్రమతో అలాగే నిలబడిపోయింది. అవును, బేరం ముందు ఆ కానీ ఎక్కువగా వస్తే అది లాభం; బేరం చేసిన తరువాత అర్ధణా వచ్చినా అది ముష్టే కదా? ఆత్మగౌరవం ఉన్న ముసలాడి మనసులో అటునంటి భావన లేవడం సహజం . . .

ఉమా మనసులో ఒక కొత్త అవగాహన లేచింది; బూడిద కప్పేసిన అగ్నిలాగ అది గభీమని ప్రకాశించింది.

ఈ చిన్న ఘటనలోతన అనుభవం, తను నేర్చుకున్న పాఠం గురించి ఉమా భర్తకి వివరంగా చెప్పింది. ఆఖరికి "ఒక నెల నేను ఖచ్చితంగా బేరం చేసి మనం ఒక సిమాకి వెళ్ళడానికి డబ్బు కూడబెట్టాను. కాని నా మనసు మాత్రం రాయిలాగ ఉంది!" అని అంది.

చంద్రు అదిరిపడ్డాడు. "నిన్నెవరు బీదలదగ్గర ఇంత ఖరారుగా బేరం చెయ్యాలని అన్నారు? కానీలు కూడబెట్టి మనం భవనాలు కట్టగలమా? బీదలకి ఒక కానీ, అర్ధణా దొరుకుతే ఉప్పు, చింతపండు కొనడానికి వాళ్ళకి వీలవుతుంది" అని అన్నాడు.

ఇంతకు ముందే చంద్రు భార్య ధోరణి ఆమోదించాడు. పైసాల బేరంతో అతనికి ఆసక్తి లేదని ఉమాకి తెలుసు. ఇవాళ అతని మాటలు అతనికి బేరమంటేనే అసహ్యం అని రూఢీ చేసాయి.! ఈ రెండు దృక్పథాల్లో ఒక చిన్న భేదం! ఆఖరికి అదే ఉమాకి తోడునీడగా పని చేసింది!

********

(మూలం ప్రచురణ: కలైమగళ్, మార్చ్, 1951)

# చెరకు రసం

ఏడు సంవత్సరాలుగా కాపురం చేస్తున్న శివరామన్కి భార్యలో కనిపించే చిరాకుకీ, కోపంకీ, భేదం తెలియకుండా ఉంటుందా?

ఆఫీసునుంచి ఇంటికి తిరిగివచ్చినప్పుడు గౌరి అతనికి స్వాగతం చెప్పిన వైఖరిలో ఎంత మార్పు! “మీరు రెండు గంటలు ముందు వచ్చివుంటే ఎంత బాగున్ను!” అని అన్నప్పుడు ఆమె కంఠధ్వని విరుద్ధంగా కనిపించింది.

శివరామన్ ఆతురతతో మేజాని చూసాడు; ఒక కొత్త మనియార్డరు మాత్రం కనిపించింది, మరేం ఉత్తరాలు లేవు.

“ఏమిటి సంగతి?” అని అడిగాడు.

“మనియార్డరు పంపించే వేళ దాటిపోయిందే? పాపం, రేపైనా అగత్యంగా ఒక మనియార్డరు మీ చెల్లెలికి పంపించేయండి!” అని తడబడుతూ చెప్పి గౌరి అక్కడనుంచి నిష్క్రమించింది.

మేజాని చేరుకొని చురుగ్గా చూసిన తరువాతే తన తల్లి దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందని శివరామన్ గ్రహించాడు, కబురేమిటో తెలుసుకున్నాడు. ఉత్తరం అతనికేం గొప్పగా ఖర్చు చెయ్యమని ప్రేరేపణ చెయ్యలేదు. శివరామన్ చెల్లెలు శాంతాకి మూడవ ప్రసవం తరువాత నాలుగు మాసాలైపోయాయి; ఆ శిశువుకి ఏదైనా బహుమానం పంపించమని తల్లి అతనికి చెప్తూనే ఉంది.

ఇందుకేనా గౌరికి కోపం?

ఈ బహుమానం కూడా ఏం కొత్త కబురు కాదే? కొన్నిరోజులముందు శాంతా తనే దానిగురించి రాసిందని శివరామన్ గుర్తుచేసుకున్నాడు. అప్పుడు గౌరికి కోపం రాలేదే? అంతేకాదు, ఆ రోజు గౌరి సంతోషంతో నవ్వింది కూడా!

ఇప్పుడు ‘అత్తగారి సిఫారసు ఎందుకు?’ అని దానికి కోపమా? అందుకే గౌరి చిరచిరలాడుతోందా?

గౌరి నిర్మల హృదయం గురించి శివరామన్కి తెలుసు. ‘శాంతా మనకి రాసిందికదా, అది చాలదా? మనం తప్పకుండా బహుమానం పంపుతాం; అమ్మకూడా మనకి చెప్పాలా? వీళ్ళెందుకు మళ్ళీ మళ్ళీ మనకి గుర్తు చెయ్యాలి? కానుకలు పంపించడానికి మేం ఎప్పుడైనా విసుగ్గున్నామా, లేదే? ఇప్పుడు మాకు దొరికినది మొదటి అవకాశం. ఇంతకు ముందు శాంతా పిల్లలకి అమ్మే

అన్ని కానుకలు పంపించారు. ఇప్పుడూ మేం - అత్త మేనమామలు - దీవెనలు పంపుతాం, నేను వద్దు అని అనలేదే?'

అందువలనే గౌరికి మనసులో కోపం కాబోలు!

శివరామన్ తనలో తనే నవ్వుకున్నాడు; కాని గౌరి సలహాతో అతను ఏకీభవించాడు.

"మీరూ మనియార్డరు పంపించండి. నేనూ శాంతాకి ఒక ఉత్తరం రాస్తాను. దాన్ని టపాలో చేర్చండి" అని గౌరి అంది. ఆ దంపతుల ఐక్యంకి నిదర్శనం ఉత్తరాలు. ఇంటికి వచ్చినవీ, పోయేవీ అన్నీ ఇద్దరికీ సొంతం. అందువలన భార్య రాసిన ఉత్తరం శివరామన్ చదివాడు. చదువుతూంటేనే అతని మొహంలో మడతలు వాలాయి: 'గౌరి మనసు ఇలాగ కుంగిపోయిందే? ఎందుకు దానికి ఇంత నిర్దయ?'

"ఇప్పుడు పుట్టిన మేనల్లుడికి  మేం తప్పకుండా బహుమతి పంపించాలా? ఇంతకుముందు పుట్టిన రెండు మేనకోడళ్ళకి మేం ఏం ఇచ్చాం? 'మేనమామ బహుమతి ప్రధానం కాదు!'  అనే విధంగా ఆ పిల్లల జాతకంలో సముచితంగా రాసి ఉంది కాబోలు! పాపం, ఇప్పుడు ఈ శిశువుకి అలా రాసిపెట్టలేదు! చాలీచాలని మేనమామ ఇద్దరు సిఫారసు చేసిన తరువాతే బహుమానం పంపించే అగత్యం వచ్చేసింది! 'ఇది అల్ప వ్యవహారం!' అని మనం తోసిపారేయవచ్చు, కాని 'భవిష్యత్తుకి ఇది సూచన!' అంటే అది ఎంత శోచనీయం! ఐనా కూడా లోకానుభవంలో ఇది సహజం అని గుర్తుచేసుకుంటే మనకి ఏ బాధా ఉండదు! అక్కా, చెల్లెళ్ళతో పుట్టిన మగపిల్లలగురించి మనకి తెలుసుకదా? ఆడపిల్లలకి ఇచ్చిన తరువాత మిగిలేదే మగపిల్లలకి! ఇది అందరికీ తెలుసు, అవునా?"

గౌరీ ఈ రీతిలో ఉత్తరం రాసింది.

"గౌరి!" అని శివరామన్ బిగ్గరగా అరిచాడు. "అత్తగారికి ఇంత ధైర్యంగా రాయడానికి నీకెలా సాహసం వచ్చిందే?" అని గదమాయించాడు.

"అది మీ అత్తగారికి నేను రాసిన ఉత్తరం. అది రాయడానికి కూడా సంకోచించే ఆడ జన్మ నేను అనుభవించాలా ఏమిటి?"

శివరామన్ వాడిగా చూసాడు; "ప్రియమైన అమ్మకి . . . " అని అందులో రాసి ఉంది, "అత్తయ్యగారికి . . . " అని లేదు.

అవును. గౌరి తన తల్లికి రాసిన ఉత్తరం అది.

కాని తన తల్లికి ఎందుకు గౌరి తన 'చాలీచాలని' భర్త గురించి రాయాలి? ఈ పొగరుబోతుతనం ఎందుకు?

"దాన్ని చింపేయ్!" అని శివరామన్ అరిచాడు; గౌరి వెనకాడలేదు.

"చింపేయాలనే ఉద్దేశంతోనే దాన్ని రాసాను. కార్డు రాయలేదే? నా మనసులోని భారం తగ్గాలని రాసిపెట్టాను. ఇక దాన్ని చింపేయవచ్చు, ఏ ప్రశ్నా లేదు! ఒక దమ్మిడీ కూడా ఖర్చు లేదు. నేనూ పొదుపుగా, ఇల్లాలుగా కాపురం చేస్తున్నాను!" అని గౌరి తన ఇక్కట్టు ఒలకబోసేసింది.

శివరామన్ నుదుట తడుముకున్నాడు: గౌరికి ఏమైంది? చెరకులాంటి దాని మనసు వెదురులాగ మారిపోయిందే?

** ** **

శివరామన్ పనిమీద తరచుగా వేరే ఊర్లకి ప్రయాణం చేస్తాడు. అతను ఇంటిలో ఉండే రోజులు తక్కువే. అదే అతని భార్యకి కొఱతగా ఉండేది. అందువలనే ఆమె భర్త ప్రేమానురాగాలు ఆశించింది. కాని ఆమె అన్వేషణలో శ్రేష్ఠత కనిపించలేదు.

దాంపత్యంలోని ఘర్షణలు చెరకులోని కణువులు లాగ అని శివరామన్కి తెలుసు. కాని ఇప్పుడున్న పరిస్థితి చూస్తే అది పళ్ళని ఊడగొట్టే కణువులాగ ఉందనే భ్రమ అతనికి కలిగింది. శాంతా శిశువుకి బహుమానం పంపించడానికి గౌరి ప్రోత్సాహించలేదు. అంతేకాదు . . .

'నా బహుమానం అందుకోని మేనకోడళ్ళ జాతకాలు భలేగా ఉన్నాయని గౌరి అంటూందే?' అని శివరామన్ నొచ్చుకున్నాడు. తనిప్పుడు బహుమానం పంపించాలా వద్దా? ఎలాంటి బహుమానం పంపించాలి?

'పిల్లవాడికి పనికివచ్చినట్టు ఏదైనా కొనమని డబ్బు పంపించాలి!' అని నిశ్చయించి శివరామన్ ఇరవై రూపాయలు పంపించి తల్లి కోరికని నెరవేర్చాడు. కాని గౌరి దానిగురించి జోక్యం చేసుకోలేదు. అసలు భర్త బహుమానం పంపించడం తనకు తెలుసునా లేదా అని కూడా ఆమె గుర్తు చెయ్యలేదు. భర్తతో జగడమాడలేదు, మౌనమూ సాధించలేదు. కాని అప్పడప్పుడు జాడగా, వంకరగా మాటలు విసిరింది. ఆమె ధోరణిలో మార్పు కనిపించింది.

ఇంటిలో దొంగతనం జరిగిందనడానికి నిదర్శనం కావాలంటే - వంకరైన ఇనుము తీగలు ఒక కిటికీలో కనిపిస్తే చాలు. అలాగే గౌరి తన మనసులో ఉన్నత భావనలు పోగొట్టుకున్నందుకు చిహ్నంగా ఒక ఆనవాలు నిలడగా కనిపించింది.

ఎప్పటిలాగే గౌరి అందరితోనూ సంతోషంతో, పెద్ద మనసుతో మెలగింది. కాని శాంతా పిల్లవాడికి పంపించిన డబ్బుగురించి ఆమె భర్తని ఏమీ అడగలేదు. అసలు ఉత్తరాలు రాయడమంటే గౌరి వెనకాడదు. కాని "మీ అబ్బాయికి బహుమతిగా ఏమిటి కొన్నారు?" అని శాంతాన్ని అడిగి తెలుసుకోవాలని గౌరి ప్రయత్నించలేదు. ఇతర పసిపిల్లలని చూసి ముద్దాడింది కాని శాంతా కొడుకు గురించి తనకేం గుర్తు లేనట్టు కనిపించింది. ఇరుగుపొరుగుల పిల్ల ఫోటోలు కూడబెట్టి, ముచ్చటలాడడం మానుకోలేదు. మరి శాంతా బిడ్డ ఫోటో వచ్చినప్పుడు తన భావనలు ఆమె ఎందుకు అణచుకుంది?

నొగసు, సువాసన ఉన్న పసుపు కొమ్ము గభీమని వట్టిగా, ప్రభావశూన్యంగా మారిపోతే ఎలాగుంటుంది? కాని అందువలన శివరామన్ బాధపడలేదు. అసలు పరిస్థితి ఏమిటని తెలుసుకోవాలని సానుభూతితో భరించాడు. అతనికి ఒపిక ఉంది. గౌరికి అసూయ ఉంది. ఇలాగే కొన్నిరోజులు గడిచాయి. ఇది గౌరికి నచ్చలేదేమో? ఏ కారణం లేకుండా పుట్టినిల్లుకి వెళ్ళింది. వెళ్ళేముందు ఉత్తరాల విషయంలో ఆమె ధోరణి విరుద్ధంగా కనిపించింది. పచ్చిన ఉత్తరం గురించి భర్తకి చెప్పింది, కాని అతని చెయికి దాన్ని అందించలేదు. తను రాసిన ప్రత్యుత్తరం పొరుగింటి అబ్బాయికి ఇచ్చి టపాలో చేర్చమని చెప్పింది, భర్తకి చూపించలేదు. గభీమని ఒక రోజు "నేను వెళ్తున్నాను" అని చెప్పి బయలుదేరింది. శాంతా వదినకి తన ప్రేమానురాగాలు ఒక ఉత్తరంలో తెలియజేసింది. ఆ ఉత్తరం శివరామన్కే వచ్చింది, అతనే అది చదివాడు. శాంతా కృతజ్ఞత తెలిపితే దాన్ని స్వీకరించడానికి గౌరికి ఏం అర్హత ఉందని! బహుమానం పంపడానికి వెనకాడిన యువతికి ఈ కృతజ్ఞత ఏం గొప్పగా ఉంటుందా ఏమిటి?

పుట్టినిల్లునుంచి తిరిగివచ్చిన గౌరి ఉత్సాహంతో కనిపించింది. ఆమె మాటల్లో, నవ్వులో సంతోషం చూసి కొన్ని రోజుల ఎడబాటులో ఈ మార్పు వచ్చిందని శివరామన్కి ఆశ్చర్యం కలిగింది. కాని అందులోనూ ఒక అంశం వెగటుగా అనిపించింది. గౌరి మాటల్లో ఒకటి మాత్రం మారనేలేదు. "అబ్బబ్బా, ఈ తల్లిదండ్రులకి కూతురుకని డబ్బు ఖర్చు చెయ్యడమంటే ఎంత ఆనందం, ఎంత సంతోషం!" అని మాటిమాటికి ఆమె అనడం శివరామన్ విన్నాడు. తనేదో కొత్తగా కనిబెట్టినట్టు ఉత్సాహంతో ఆ మాటలు వల్లించింది.

దానికి కారణమేమిటో తెలియక శివరామన్ కలవరపడ్డాడు. ఇంతకీ గౌరి పుట్టినిల్లునుంచి గొప్పగా ఏదీ తీసుకురాలేదని గ్రహించాడు; అన్నీ మామూలు చిల్లర వస్తువులే!

ఇక తాళలేక శివరామన్ "గౌరీ, నువ్వు పదే పదే ఈ మాటలే అంటున్నావ్! నీ పగ అంతా శాంతా గురించే కదూ? అది నిన్ను గౌరవించి మర్యాదతో నీకు కృతజ్ఞత తెలియజేసింది. అది స్వీకరించడానికి నీకు అర్హత ఉందా?" అని ఎత్తిపొడిచి చెల్లెలు రాసిన ఉత్తరం భార్యకి అందించాడు.

గౌరి దాన్ని చదివింది. "ఎంత చోద్యం! నేను ఉత్తరం రాయకుండానే శాంతా నాకు రాసిందన్నమాట! సరేలేండి, మంచిది!" అని నవ్వింది. ఆ తరువాత శాంతాకి ఒక ఉత్తరం రాసి భర్తకి అందించింది.

అందులో తన దీవెనలు, ఆశీస్సులు పెద్దమనిషితరంగా తన ఆడపడుచుకి తెలియజేసింది.

'కృత్రిమ బుద్ధి అంటే ఇదే, మాటల్లో తేనె, మనసులో తేలు!' అని శివరామన్ చిరచిరలాడాడు.

'బహుమానాలు అంగీకరించే వారందరూ అధికోన్నత అంతస్తులో ఉంటారు. ఒక వ్యక్తి వహించే అంతస్తుకి ఆధారంగా అతనికి బహుమతులు వచ్చిచేరుతాయి. మన కిట్టు[1] భవిష్యత్తులో తన చెల్లెళ్ళకంటే గొప్పగా, కీర్తితో వర్ధిల్లుతాడు! వాడికి మా బహుమానాలు ఎడతెగకుండా దొరకాలని మా ఆకాంక్ష!' అని గౌరి రాసినది చూసి శివరామన్ మండిపడ్డాడు.

గౌరి నవ్వుతోంది. అదే ఆమె చేసిన పెద్ద పొరబాటు! "ఎందుకీ నవ్వు?" అని రోషంతో శివరామన్ ఉత్తరంని చింపేసాడు.

గౌరి కళ్ళు తడిసిపోయాయి. "సరే, నిజమేమిటో రాసేస్తాను!" అని ఆవేశంతో ఉక్కిరిబిక్కిరి అయి, అక్కడనుంచి నిష్క్రమించింది. కొంచెం సేపైన తరువాత తిరిగివచ్చి భర్త చెయికి ఒక ఉత్తరం అందించింది.

అది అతనికి రాసిన ఉత్తరం.

"నేను శాంతాకి రాసిన ఉత్తరం మనఃపూర్వకముగా రాసిన ఉత్తరం. నాకు ఎవరిమీదా కోపం లేదు. శాంతాకి పుట్టిన మొదటి మగపిల్లవాడనే ఆశతో,

[1] ఇక్కడ గౌరి శాంతా కొడుకుని గుర్తించి మాటాడుతోంది

మేనమామ బహుమతి పంపించాలని అమ్మ[2] మనసులో ఉందని నాకు బోధపడింది. మీ అమ్మగారి మనసులో ఉన్న ఈ కోరిక నా పుట్టినిల్లులో నేను గ్రహించాను. మనిద్దరి జాతకాలు చూసి జ్యోస్యుడు మనకి ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు పుడతారని అన్నారట. జ్యోస్యుడుకి రుసుము పదిహేను రూపాయలు. అతని జోస్యం ఫలమవాలని నన్ను ఆసుపత్రిలో చేర్చారు, నాకు ఆపరేషన్ చేసారు. అందుకు చాలా ఖర్చులయ్యాయి. మన కోరిక సఫలమైతే ఇంకా ఎన్ని ఖర్చులో? కాని నా తల్లిదండ్రులు దానిగురించి లెక్కజెయ్యలేదు. అవ్వగా, తాతగా, పాపలని ముద్దాడాలని వాళ్ళకి ఎంత ఆతురం! ఇవన్నీ చూసిన తరువాత మీ అమ్మగారి ఉత్తరం చూసి నేను అపార్థం చేసుకున్నాను అని తెలుసుకున్నాను.

పుట్టిన వెంటనే మేనమామ బహుమతులు అందుకున్న మేనల్లుడు తన జీవితమంతా మేనమామ బహుమతులు అందుకోనీ!' అని నేను రాయడం ఎందుకు? మేనమామ హోదాలో కానుకలిచ్చేవారు మామగారుగా కానుకలివ్వాలని నేను అంటున్నాను. 'అవ్వ, తాత ఇచ్చే లాంఛనాలు చాలవా, అత్తయ్య, మేనమామ కూడా ఇచ్చితీరాలా?' అని నేనుకూడా ఒకప్పుడు ఆలోచించాను. కాని దానికి కారణం ఉంది. అది నా పొరబాటు కాదు, అది నా స్త్రీత్వంలోని పొరబాటు!

"'వదినా, మేనల్లుడికి మీ బహుమానం ఏమిటి?' అని శాంతా నన్ను ఇంతకుముందు ఒక సారి అడిగింది. అది నేను వేరే విధంగా బోధపరచుకున్నాను. మన మేనల్లుడికి ఆమె తన మేనకోడలు బహుమతిగా అడుగుతోందని తమాషాగా అనుకున్నాను. మీ అమ్మగారి ఉత్తరం చదివిన తరువాత నా 'తెలివితక్కువతనం' తెలుసుకున్నాను. ఆ తరువాత నా తల్లిదండ్రుల మనసు తెలుసుకొని మీ బహుమానంకి మీ మేనల్లుడికి అర్హత ఉందని నేను గ్రహించాను."

తను పోగొట్టుకున్నదేదో అకస్మాత్తుగా తిరిగి వచ్చినట్టు శివరామన్ మనసులో ఆహ్లాదం కలిగింది. శాంతా ఆశించిన బహుమానం గౌరికి చెరకు రసంలాగ అనిపించింది. తన తల్లి కోరికని పెదురులాగ భావించడంలో గౌరి పొరబాటు చెయ్యలేదు. శ్రేష్ఠత ఎదురు చూసిన చోట నిరాశ కలిగితే మనసు ఎలా బాధ పడుతుందని అతనికీ తెలుసుగా? ప్రియురాలు భార్యమీద తనకి ఎంత కోపం వచ్చింది! అలాగే గౌరికి అత్తగారిమీద, ఆడపడుచుమీద కోపం వచ్చింది! చెరకు

---

[2] ఇక్కడ గౌరి తన అత్తగారు గరించి మాటాడుతోంది

చెరకుగానే ఉందన్న మాట! అందులో ఉండేది చెరుకు రసమే! ఏడేళ్ళ కాపురంలోని దాంపత్యాని అది ఇప్పుడు పూర్తిగా ఆవరించుకుంది!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, అక్టోబర్ 11, 1953)**



# ఒక అమాయక అమ్మాయి

పిల్లందరికీ ముచ్చటగా వడగళ్ళ వర్షం హోరున కురుస్తోంది. కాని వీధిలో ఊరక తిరుగుతున్న ఆవులకి అది దుర్భరంగా ఉంది. వడగళ్ళకోసం ఎదిరింటి పిల్లలు గబగబమని వసారాకీ వెనకతట్టుకీ పరుగెడుతున్నారు. వాళ్ళ ఇంటిముందు గోడని ఆనుకొని ఒక ఆవు నిలబడి ఉంది; తలెత్తలేక అది బాధపడుతోంది. ఇంకొక ఆవు - చూడడానికి ఒక ఎముకలగూడుగా కనిపిస్తోంది - నిలకడ లేకుండా ఇటూ అటూ తిరుగుతోంది. చూలుగా కనిపించే ఇంకొక ఆవు మా ఇంటి గోడని రుద్దుకుంటూ నిల్చొనివుంది. నేను నా కంఠధ్వని పైకెత్తి "రా, రా" అని దాన్ని పిలిచాను, కాని అది వినిపించుకోలేదు. 'ఇల్లు తెరిచివుంది, లోపలికి వెళ్ళవచ్చుగా?' అనే ఆలోచన ఈ ఆవులకి లేనే లేదు. వడగళ్ళు నా కాలిమీద రాలిబాదుతున్నాయి, నేనూ ఇంటిలోకి వెనకాడాను.

"పాపం, నాన్నగారూ", అంది గిరిజ.

"అవును, ఆవులకి బాధగా ఉంది" అన్నాను.

"మనం హాయిగా ఇంట్లో ఉన్నాం, పాపం, ఆవులకి ఎంత కష్టం!"

నేను నా భార్యని చూసాను. "జానూ, చూసావా? మనం ఆవులకి ఆశ్రయం ఇవ్వకుండా ఇంట్లో ఉన్నాం! 'మనకి పుణ్యం లేదు, పాపం!' అంటోంది గిరి!" అని అన్నాను.

"అవును మరి, అది మీ నానమ్మ అవతారం కదా? అందుకే పాపం, పుణ్యం అని మాట్లాడుతోంది!" అని జాను, గర్వంతో, నవ్వుతూ అంది.

నేను నా నానమ్మని గుర్తుచేసుకున్నాను. అది కన్నుమూసిన పదిరోజుల తరువాత నా అమ్మాయి పుట్టింది. నానమ్మ ఆత్మ నా అమ్మాయిని ఆవరించుకుందని నా నమ్మకం. గిరిజ పుట్టిన ఆ రోజే నాకది అనిపించింది; ఇప్పుడుకూడా ఆ భావన వచ్చినప్పుడల్లా నేను నెమ్మదిగా కళ్ళు మూసుకొని ఊహాలోకంలో మునిగి తేలుతాను.

** ** ** **

నడుమున ఒక పరికెణి, దాని మీద ఒక రవిక, దట్టమైన నల్లరంగు జడలో ఒక పువ్వుతో ఒక బాలిక కనిపించింది. "అమ్మా, నేను ఆటాడానికి వెళ్తున్నాను!" అని అంటూ వీధిలోకి పరుగెత్తుతోంది.

"ఏం ఆట! ఏడుస్తూ ఇంటికి వస్తావ్! పిల్లలతో దెబ్బలాడకుండా రాగలవా?" అని అడుగుతూ ఒక స్త్రీ ఆమె వెనుక వీధికి వచ్చింది.

"అంటే, నేను ఆటాడానికి వెళ్ళకూడదా, అమ్మా?"

"సరే, వెళ్ళు, బాగా ఆటలాడు. కాని ఇంటికి రాగానే 'అది వెక్కిరించింది!', 'ఇది ఎగతాళి చేసింది!' అని ఏడవకూడదు! తెలిసిందా? లేకపోతే అదే పెద్దలమధ్య పెద్ద గొడవగా ఐపోతుంది."

బాలిక గెంతుకుంటూ పరుగెత్తింది.

నాలుగైదు ఇళ్ళు దాటింది. అక్కడ ఒక విశాలమైన వసారాలో వీధిలోని పిల్లలందరూ గుమిగూడివున్నారు. జడగంటలు, కాలులో గజ్జెలు, మెడల్లో గొలుసులతో పిల్లల కళ్ళు మెరుస్తున్నాయి. గోరింటతో పిల్లల చిట్టి చేతులూ, చిట్టి పాదాలు ఎఱ్ఱగా కదలుతున్నాయి. పిచ్చి మాటలు, సణుగులు, బిగ్గరగా నవ్వుతూ పలికే మాటలు, ముత్తైదవల్లాగ నొక్కిమాటాడే పిల్లలు - అక్కడ ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. ఆ చక్కని గుంపుకి వచ్చిచేరిన బాలిక జంకుతూ నిలబడింది.

"కోదై, నేనూ వస్తానా?"

ఆట సందడిలో ఎవరికీ ఆమె సన్నని కంఠం వినిపించలేదు.

"కోదై, నాకూ ఆటాడాలని ఉంది . . . "

ఇప్పుడు కోదై తిరిగిచూసింది; కొందరు పిల్లలు కూడా తిరిగిచూసారు.

"అమ్మలు వచ్చిందే . . . మన ఆటలో కలుసుకోవాలంటోంది . . . "

"దానికేం ఆట తెలుసు? హరికథ చెప్తానంటోంది."

"అవును. అది మనలాగ వంట చెయ్యదు, అప్పడాలు పెట్టదు . . . "

"అవ్వలాగ ఏదో మాటాడూనే ఉంటుంది . . . మనకేం బోధపడదు . . . "

"నాకు బోధపడుతుందిలే . . . 'ఎప్పుడూ తిండి, ఆటలేనా?' అని అడుగుతుంది . . . "

"మరి, మనం ఆడవాళ్ళం కదా? వంట చెయ్యడం, వడ్డించడం - అదేకదా మన పని? ఏమే, అమ్మలు, నువ్వు మాకు అవ్వగా ఉంటావా? నువ్వొక మూల కూర్చొని పారాయణం చెయ్, ఇంటిపనులు మేం చూసుకుంటాం, సరేనా?"

అమ్మలు ఎంగిలి మింగింది. "నేనూ మీ లాగే ఆటలాడుతాను, వండుతాను. కాని ఆఖరికి ఏం చెయ్యాలో తెలుసా? నేను దేవుడికి పూజ చేస్తాను, ఆ తరువాతే మనం భోంచెయ్యాలి!"

పిల్లలు ఒప్పుకున్నారు. “నేను పువ్వులు తీసుకొని వస్తాను” అని అమ్మలు ఇంటికి పరుగెత్తింది; తక్కిన పిల్లలు తమతమ పనులు ఆరంభించారు.

వీళ్ళ పనులన్నీ నటనలే!

పసుపు కొమ్ముని నూరే ధోరణిలో, ఒక అమ్మాయి నేలమీద ఒక రాయిని రుద్ది ఆ పూత(!) తన ముఖంలో రాసుకుంది; గుమ్మంకి పక్కనే ఒక నది ప్రవహించినట్టు కల్పించుకొని, ఒక చిన్న గిన్నెలో నీళ్ళు పోగుచేస్తూ, ఒక అమ్మాయి ‘స్నానం చేసింది’; ఇంకొక అమ్మాయి ఆ నీళ్ళతో ఒక బిందెని ‘శుభ్రం చేసుకుంది.’; ఇంకొక అమ్మాయి తను ధరించిన దుస్తులతోనే కొత్తగా ‘మడిబట్టలు కట్టుకుంది. ఇంకొక అమ్మాయి పూజకని చిన్న పాత్రలలో ‘నీళ్ళు నింపింది’. ఇవన్నీ సాంప్రదాయక పూజకి ముందు చెరువుగట్టులో స్త్రీలు చేసే కార్యక్రమాలు!

“ఏమిటే, స్నానం చెయ్యడానికి ఎంత సేపు కావాలి? నేనింకా అప్పడాలు చెయ్యాలి! పొయ్యి ముట్టించేసాను, ఇక ఆలస్యం వద్దు, వంట ఆరంభించాలి!” అని కొందరు విసుగ్గున్నారు. ఆ తరువాత తక్కిన పనులు - కూరగాయలని తునకలు చెయ్యడం, కొబ్బరి తురుము తయారు చెయ్యడం, ఉడుకుతున్న బియ్యంని ఒక గరెటలో తీసుకొని పదం పరీక్ష చెయ్యడం - ఇవన్నీ క్రమంగా సాగాయి. “నువ్వు నాన్న, జపం చేసి ముందు భోజనంకి రా . . . నువ్వు తాతయ్య. ‘నేను పొద్దున్నే జపం చేసేసాను!’ అని చెప్పి భోజనకి రా!” అని ఒక అమ్మాయి ఆజ్ఞాపించింది. “నేను తాతగా ఉండను!” అని కోదై ఆక్షేపించింది. “సరేలే, నేనే తాతయ్యగా ఉంటాను ఆ ఆమ్మాయి ఒప్పుకుంది. వంట పూర్తి అవగానే ‘అమ్మ’ గా అప్పడాలు వత్తడానికి కొందరు బాలికలు సిద్ధమైయ్యారు.

“ఏమే, వంట అయిన తరువాతకదా అప్పడాలు ఒత్తాలి, మనం మరిచిపోయామే?”

“అవునే, పొరబాటు చేసేసాం! సరేలే, ఇక భోంచేద్దాం, అందరూ రండి!”

“పొరబాటేం చెయ్యలేదు . . . పూజకి పువ్వులు రావాలిగా? పూజ తరువాతే భోజనం!”

“అవును, రాజీ సరిగ్గా చెప్తోంది . . . ”

“మనందరం ఇంట్లో భోంచేసేసాం, మనకేం ఆకలి లేదే! ఇప్పుడు మనం అప్పడాలు ఒత్తుదాం . . . అమ్మలు పూజ తరువాతకూడా భోంచెయ్యదు!” అంది రాజి.

“భోజనం చెయ్యకపోతే ఎలాగ? మనం వండినదంతా పాడు చెయ్యాలా?”



"అమ్మలు ఇంకా రాలేదు . . . పూజకి పువ్వులు కావాలి . . . "

"అవును . . . పువ్వులు లేకుండా పూజ చేస్తే పుణ్యం లేదు!"

"నువ్వా ముసలమ్మలాగ మాటాడుతున్నావ్ . . . 'స్వాహా' 'స్వాహా' అని వల్లించుతే చాలదా?"

ఇంతలో మడతలు పడిన పరికిణిని ఎత్తి పట్టుకొని అమ్మలు పరుగెత్తుకొని వచ్చింది.

"అబ్బా, ముసలమ్మ వచ్చేసింది!"

అమ్మలు పరికిణిని దులపగానే పువ్వులు నేల వాలాయి.

పసుపు రాసిన ఒక రాయిని పిల్లలు దేవుడి విగ్రహంగా ఎంచుకున్నారు.

"అందరూ వచ్చి కూర్చోండి . . . నేను పాడతాను" అంది అమ్మలు.

"ఏం పాట? . . . అసలు ఇదేం దేవుడు?"

"వినాయకుడు" అంది అమ్మలు.

"వద్దు . . . సుబ్రమణ్యస్వామి అని అనుకుందాం . . . ఒక పుల్ల దేవుడిదగ్గర ఉంటే చాలు, అదే అతని ఆయుధం, శూలం!" అంది ఒక అమ్మాయి.

అమ్మలు "సరే!" అని ఒప్పుకుంది.

"వినాయకుడుకీ, సుబ్రమణ్యస్వామికీ, నాన్న శివుడు కదూ? అతను చాలా పెద్ద దేవుడు! ఈ రాయి శివలింగం అన్నమాట!" అని అంది ఇంకొక బాలిక.

"అంటే నేను ఇందులో కలుసుకోకూడదు!" అని అంది కోదై. అలా అన్న ఆ వైష్ణవ బాలిక కంఠధ్వనిలో కోపం లేదు, నిరాశే చోటుచేసుకుంది.

అది తెలియని ఒక శైవ బాలిక "అలాగైతే నువ్వు లేచిపో!" అని అరిచింది.

అమ్మలు కోదైని వెనకేసుకొని మాటాడింది: "వినండి. అందరు దేవుళ్ళూ ఒకటే! 'దేవుడా, నన్ను కాపాడు! నాకు మంచి బుద్ధి ఇవ్వు! నేను బాగా చదవాలి!' అని మనం దేవుడ్ని వేడుకుంటే చాలు!"

ఒక ఏడేళ్ళ బాలిక సహజంగా, సిగ్గులేకుండా "మనం మగాళ్ళు కాదే, దేవుడు మనకందరకీ మంచి మొగుడ్లు ఇవ్వాలి!" అని అనగానే అందరూ నవ్వారు. అదేం ఎగతాళి నవ్వు కాదు; 'మొగుడు' అనే మాటలో ఆ పిల్లలకున్న మోజువలన అలా నవ్వారు. అమ్మలు కొంచెం సర్దుకొని, మూతి ముడుచుకొని, కటువుతో అంది: "అందరికీ మంచి బుద్ధి, చదువు, తెలివితేటలు కావాలి. లేకపోతే ఏ మొగుడుకీ నచ్చదు!" అంది.

చదువులో ఎక్కువగా ఇష్టంలేని ఒక అమ్మాయి అమ్మలుని ఎత్తిపొడిచింది. "నువ్వు వండితే నీ మొగుడుకి నచ్చుతుందా? అతను చీదరించుకుంటే ఏం చేస్తావో?"

"చీదరించుకోనీ . . . నాకేం పోయింది? నేనసలు పెళ్ళే చేసుకోను! . . . ఏమంటావ్?"

"అయ్యయ్యో, అలాగా?" అని ఒక అమ్మాయి చెయెత్తి అరిచింది.

"నిన్నెవరూ పెళ్లి చేసుకోపోతే ఏం చేస్తావ్?" అని ఇంకొక అమ్మాయి బొప్పలుపెట్టింది.

"అవునే!" అని అందరూ బాలికలూ కలిసి నవ్వారు. 'పెళ్ళి చేసుకొని కాలం గడపడం ఒక లక్ష్యం, అదే జీవితం' అనే నమ్మకం చాలా లోతుగా ఆ బాలికల మనసుని ఆవరించుకొని ఉంది.

అమ్మలుకి రోషం వచ్చింది; దానితోబాటు ఏడవాలనిపించింది. ఏమీ అనలేక అలాగే నిల్చుంది.

"అమ్మలంటే మరెవరూ కాదు - మూల కూర్చునే ముసలమ్మ!" అని ఇంకొక అమ్మాయి అన్న తరువాత, అదే భంగిమలో నడిచి చూపించింది; అందరు పిల్లలు ఆమోదించి చప్పట్లు కొట్టారు.

ఇక భరించలేక అమ్మలు తడిసిన కళ్ళతో వీధిలోకి దిగి ఇంటికి పరుగెత్తింది.

ఇల్లు చేరుకున్నవంటనే తల్లి చేతుల్లోకి దూకింది.

"ఏమే, ఎవరు కొట్టారు నిన్ను?" అని తల్లి అడిగింది.

"ఎవరూ కొట్టలేదు . . . నన్ను ఎగతాళి చేస్తున్నారు! . . . 'అవ్వ', 'అవ్వ' అని అందరూ పిలుస్తున్నారమ్మా . . . "

"పిలవనీ! . . . 'అవ్వ' అంటే ఏమిటో తెలుసా? 'నువ్వు జ్ఞానవంతురాలు' అని వాళ్లు అంటున్నారు.[1] వాళ్ళలాగ నువ్వు ఆడకపోతేనేం? చక్కగా, దేవుడిమీద పాటలు పాడు! అదే నీకు మంచి ఆట!" అని తల్లి ఓదార్చింది.

కాని ఆ పసిహృదయంలో - అపూర్వంగా, మెలకువతో చింతించే ఈ బాలిక మనసులో - శాంతి చోటుచేసుకోలేదు.

ఈ పెనగులాటతోనే అమ్మలు రోజులు గడిపింది: తక్కిన పిల్లల్లతో ఆటలాడడానికి వెళ్తుంది, అలుకతో తిరిగివస్తుంది. కొన్నిసార్లు 'నాకీ ఆటలు వద్దు!'

---

[1] తమిళంలో 'అవ్వై' అనే పదంకి ఆ అర్థముంది. తమిళ సాహిత్యంలో గొప్ప వివేకానికీ, సూక్ష్మదృష్టికీ పేరు పొందిన కవయిత్రికి 'అవ్వయ్యార్' అని పేరు.

అని వెళ్ళకుండా ఊరుకుంటుంది, కాని పిల్లలు “అవ్వ ఆటకి వస్తుందా?” అని ఎగతాళి చేస్తారని, ‘నేను పడుచు పిల్లే!’ అని నిరూపించడానికి వెళ్తుంది. కాని ‘అవ్వ’ అని పిల్లలు ఎగతాళి చెయ్యగానే మళ్ళీ ఆదే ఆవస్థ.

పిల్లలు మాత్రం కాదు, తరచుగా పెద్దలుకూడా అమ్మలుని తప్పుపట్టారు.

“మన అమ్మలు జుత్తు ఎందుకిలా తెల్లబడిపోయింది?” అని ఒక ముత్తైదువ అడిగిన తరువాత ఆ ప్రశ్న అమ్మలు హృదయంలో ఒక అగాధ గాయపు మచ్చగా చోటుచేసుకుంది. ‘పెద్దలు ఉత్తికే చెప్తారా?” అన్నదిగులు ఆమెని ఆవరించుకుంది.

అమ్మలు స్నేహితురాలు - ఒక అమ్మాయికి - పెళ్ళైంది. అప్పుడు ఆ అమ్మాయి అమ్మలుతో “మా ఆయనికి బర్ఫీ అంటే చాలా ఇష్టం అని విన్నాను. అదెలా చెయ్యడమో నేను నేర్చుకోవాలి! మా ఆయనికి చదువంటే అసహ్యం!” అని చెప్పింది. ఎనిమిదేళ్ళ పిల్లని పెళ్ళాడిన పదకొండేళ్ళ పిల్లవాడికి చదువులో ఎటువంటి అపేక్ష ఉంటుంది? ఇది అమ్మలు గ్రహించలేదు. కాని భయం మాత్రం ఆమెను బాగా పట్టుకుంది.

‘నాకు పెళ్ళైతే, నాకు నాలాంటి మొగుడే రావాలి!’ అని ఇటీవల అమ్మలు వేడుకుంది. కాని త్వరలో ఆ వాంఛ పోయింది. ‘యౌవనం, అందం - ఈ రెండే భర్త కళ్ళని ఆకర్షిస్తాయి!’ అని ఆమె మనసుకి తెలిసినా ‘నేను ముసలమ్మలాగ కనిపిస్తున్నాను; నా మాటలు విని, నా ధోరణి చూసి అతను నన్ను చూసి అసహ్యయించుకుంటారు” ఆనే దృఢ నమ్మకం అమ్మలుకి వచ్చేసింది. ‘సృష్టిలో ఏదైనా సరే, దేవుడి ఉద్దేశం ప్రకారమే జరుగుతుంది’ అని పెద్దలు చెప్పడం అమ్మలుకు తెలుసు. కాని ఆ బోధనని ఆమె వేరే విధంగా అర్థం చేసుకుంది.

అమ్మలుకి పెళ్ళి వయసు వచ్చేసిందని అందరూ చెప్పుకున్నారు. కాని అమ్మలుకి ఆ ఆలోచన రాలేదు. సరైన భోజన పదార్థాలు లేకపోవడంవలనో లేక మనోవ్యధ వలనో ఆమె నల్ల జుత్తులో అక్కడక్కడ తెల్లని జాడలు కనిపించాయి.

“అయ్యో, ఆ అమ్మాయికి అవ్వలాగ జుత్తు నెరసిపోయిందే?” అని ఎవరో మొట్టమొదట అన్నారు. “అదేదో విటమిన్ల కొరత - దానికి మందులున్నాయి,” అని తల్లి కొట్టిపారేసింది.

“వచ్చే చైత్ర మాసంలో అమ్మలుకి పెళ్ళి” అని ఇంటిలో చెప్పుకున్నారు.

“అమ్మా, నాకా పెళ్ళి?” అని అమ్మలు తల్లిని అడిగింది.

“అదేంటే, అలా అడుగుతున్నావ్? నీకేం తక్కువ?” అని నాన్నగారు ఆశ్చర్యంతో అడిగారు.

అమ్మలు ఒక క్షణం తన గతకాల భావనలు, తనకిక రాబోయే వృద్ధాప్యం గుర్తు చేసుకుంది. ఆవేశపడకుండా, నిబ్బరంగా "నాన్నగారూ, నాకున్న లోపం ఒకటే - యౌవనం" అని అంది.

"ఎవరలా అన్నారు?" అతనికి పట్టరాని కోపం వచ్చింది.

"ఎవరూ నాకు చెప్పనక్కరలేదు. నా మనసులోనూ యౌవనం లేదు. నాకు పెళ్ళికి అర్హత లేదు. నాకు పెళ్ళైయితే నేను నా బాధ్యతలు నిరవేర్చలేని భార్యగానే ఉంటాను. అది మీకు ఇష్టమా?" అని అమ్మలు ఎదురు ప్రశ్న అడిగేసింది.

ఇప్పుడు తల్లికూడా జోక్యం చేసుకుంది. "నేనూ చెప్పాను, అది వింటేనా? రోజూ పూజలో దేవుడికి దీపం వెలిగించినప్పుడు ఆ నెయ్యి వేళ్ళని జుత్తులో రుద్దుకుంటే జుత్తు మరి తెల్లబడకుండా ఉంటుందా? ఇలాగెవరైనా చేస్తారా? మనం ఎవరికైనా చెప్తే 'మీ అమ్మాయికి మతి పోయిందా?' అని అడుగుతారు!" అని నొచ్చుకుంది.

"ఏమంటున్నావ్?" అని తండ్రి ఉలికిపడ్డారు.

"నాన్నగారూ, జుత్తు తెల్లబడిపోయిందనే ఆరాటం నాకు లేదు. అది నాకు దేవుడు చూపించిన ఒక జాడ. కొంచెం జుత్తు నెరసింది, దాన్ని నేను పెంచుకున్నాను. 'నన్నెవరూ పెళ్లిచేసుకోడానికి ఇష్టపడకూడదు!' అనే భావనతో మారిపోవాలనే ఒక పట్టుదల నాకు వచ్చేసింది!" అని అమ్మలు నవ్వుతూ అంది.

అమ్మాయి మొండితనంకి కి భయపడి తల్లిదండ్రులు ఆమె వరుడుకోసం అన్ని ప్రయత్నాలూ చేసారు. కాని లాభం లేదు. "ఆ అమ్మాయా? దాని జుత్తు తెల్లబడిపోయింది, నోరూ పెద్దగా ఐపోయింది. దానితో ఎవరు కాపురం చేస్తారు?" అని అమ్మలుని వదిలేసారు. అంతకుముందే అమ్మలు వాళ్ళని నిర్లక్ష్యం చేసిన విచిత్రం ఎవరూ గుర్తించలేదు.

ఆ తరువాత? . . . అమ్మలు కీర్తి దేశమంతా వ్యాపించింది. తన్ను ఎగతాళి చేసిన పేరుని అమ్మలు తన చనువుపేరుగా చేసుకుంది. మెల్ల మెల్లగా 'అవ్వై' అనే అదే పేరు 'జ్ఞానపద అవ్వై' గా పరిణమించింది. 'అవ్వై' గానే అందరితోనూ అమ్మలు మెలిగింది. ఆమె హృదయంలో యౌవనం బయటికి ప్రజ్ఞగా ప్రకాశించింది. యువతిగా ఆమె తన తెలివితేటలు చూపించినప్పుడు నవ్విన వాళ్ళందరూ ఇప్పుడు ఆమె 'అవ్వై' స్వరూపంలో సరస్వతీ కటాక్షం గ్రహించారు.

తక్కిన యువతులు ఏవగించిన 'అవ్వై' అనే పేరుతోనే, అమ్మలు గర్వంగా తన్ను ప్రకటించుకుంది. దృఢమైన మనసుతో శరళమైన, రమణీయ కవితలు రాసి తమిళదేశంలో అవ్వై కీర్తి అందుకుంది. తమిళులు ఆమె ప్రావీణ్యంకి, పవిత్రతకీ,

అంజలి చేసారు - ఇంకా చేస్తూనేవున్నారు; ఆమె పుట్టినరోజే ఆ పేరు పెట్టారని కళ్ళుమూసుకుంటూ నమ్ముతున్నారు!

** ** ** **

మందమారుతంలో సుఖంగా కళ్ళు మూసుకొని ఒక పక్క దొర్లాను. “అమ్మా, అమ్మా, నాన్నగారు లేవనంటున్నారు! “నాన్నగారూ! నాన్నగారూ! లేవండి!” అని గిరిజ కీచు కూత వినిపించింది. ‘హూం’ అని గొణుక్కున్నాను; కొంచెం సేపు తరువాత మంచంనుంచి లేచాను.

ఫలహారం తింటూనే నేను “గిరిజ ఎక్కడ?” అని అడిగాను.

“పొరుగింటికి వెళ్ళింటుంది. పిల్లలకి జగడం అంటే ఎంత సేపు? ‘వడగళ్ళ వర్షం ఎందుకు కురుస్తుంది?’ అని ఇంతసేపూ ఎవేవో ప్రశ్నలు అడుగుతూ నా ప్రాణం తీసింది. నేనేదో చెప్పాను. అదే పొరుగింటికి చెప్పాలని వెళ్ళిందేమో?” అని జానూ నవ్వింది.

“జానూ, నీకు గుర్తుందా? గిరికి పేరు పెట్టినప్పుడు మనం ఎన్నిపేర్లు ఆలోచించి, ఆలోచించి, ఆఖరికి నానమ్మ పర్వతవర్ధిని పేరుని క్లుప్తంగా ‘గిరిజ’ అని ఎంచుకున్నాం?” అని నేను అడిగాను.

“అదెందుకు గభీమని మీకిప్పుడు గుర్తుకి వచ్చింది?”

“మనం ఆ రోజు అవ్వయ్యార్ నాటకం చూసాం, అందులో పాపకి నామకరణం చేసే ఘటన జ్ఞాపకం వచ్చింది. పాప వినాయకకుడు విగ్రహం గట్టిగా పట్టుకుంది. వెంటనే ఒకావిడ పరుగెత్తుకొని వచ్చి “అమ్మయ్యో, దీనికి ‘అవ్వై’ అనే పేరు పెట్టాలి!’ అని అనగానే తల్లితోబాటు అందరూ ఏకీభవించారు. ఏ తల్లైనా అలాగ సరే అంటుందా?”

“అవును మరి, అదేకదా మన ఆచారం?”

“అలాగే ఉండాలా, ఎందుకు?నేనుగాని ఆ నాటకంకి కధ రాసానంటే, కొంచెం నాజూకుగా రాసివుంటాను. ఇంకా రెండు మూడు దృశ్యాలు చేర్చివుంటాను.”

“నాటకం చూసినతరువాత మీకీ ఆలోచనలన్నమాట!” అని జానూ నవ్వింది. కొంచెం ఆగి, “ఆ నాటకంలో నాకూ ఒక ఆక్షేపణ ఉంది!” అంది.

“ఓహో, అలాగా? అదేం ఆక్షేపణ?”

“అవ్వై గభీమని ‘నాకా పెళ్ళి?’ అని అడుగుతోందే, అదే! నాకు పెళ్ళి వద్దు!’ అని ఈ రోజుల్లో అందరూ చెప్తున్న జాడలో చెప్పాలి; లేకపోతే తనకి పెళ్ళిలో నమ్మకం, ఉద్దేశం లేదనే ధోరణిలో అవ్వై ప్రశ్నకి ఒక ఆధారం చూపాలి.”

అంటే, జానూ నా వలలో పడిందన్నమాట! నా కల్పనలో లేచిన దృశ్యాలుగాని అవ్వే జీవితంలో చోటుచేసుకుంటే నా కొరత తీరుతుంది, జానుకున్న అనుమానమూ పోతుంది.

నేనింకా ఆలోచిస్తూనే ఉన్నాను. ఇంతలో జాను "లోకంలో అసంభవిత ఘటనలగురించి మనం వింటూనే ఉన్నాం. 'మూడేళ్ళ పాప భగవద్గీత వల్లించుతోంది!, 'ఏడేళ్ళ అబ్బాయికి గణిత శాస్త్రంలో ఎంత నైపుణ్యం!' అని ఈ రోజుల్లోనూ అడుగుతున్నారే?" అని అంది.

నేను మరేం అనలేదు. మళ్ళీ నా ఊహాలోకంలో పడిపోయి ఆ పాత దృశ్యాలు గుర్తుచేసుకున్నాను. చురుకైన మా గిరిజని పాతకాలపు అవ్వైతో, అమ్మలుతో, సరిపోల్చుకొని ఆనందించాను. తేజోమయంగా, ఆ అమాయక బాలిక నాకు కనిపించింది; నేనలా చూస్తూనే ఉండిపోయాను.

********

(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, జూలై 27, 1955)



# ఏనాటి నోము ఫలమో!

దీపం వత్తినుంచి మినుకుమినుకుమని కాంతి మెరుస్తోంది. అగరుబత్తి వాసన గదిని పూర్తిగా ఆవరించుకొనివుంది. ముగ్గులు వేసిన చలువరాయి చదరంలో, ఒక పళ్ళెంలో, తమలపాకులు, పోకచెక్కలున్నాయి. ఆ మంగళ దృశ్యం చూసి, ఆనందిస్తూ, జనకం మడిసారు[1] చీర కట్టుకొని చెయిలో నైవేద్యంతో దైవపీఠం చేరుకుంది. నియమంగా కారామణి[2] చేసిన ప్రసాదం ఒక అరటాకులో దేవుడికి సమర్పించింది. 'నా భర్త ఆయురారోగ్యాలతో జీవించాలి, పూర్ణాయుష్కుడు కావాలి, జన్మజన్మలా అతనే నా భర్త కావాలి!' అని తనలో తనే వల్లించుకుంటూ దీపం ముందు నమస్కరించింది.

మణికట్టులో సరణి[3] కట్టుకున్న తరువాత నమస్కరించాలని జనకం భర్తని వెతుక్కుంటూ వెళ్ళింది. అప్పుడు కృష్ణన్ ఎక్కడున్నాడు? హాయిగా నిద్రపోతున్నాడు.

నిద్రపోతున్న భర్తని తేరిచూస్తూ జనకం కొంతసేపు అలాగే నిల్చుంది. అతని దేహంలో, మొహంలో చలనం కనిపించలేదు, అంత గాఢ నిద్రలో ఉన్నాడు; లేపడానికి మనసు రాలేదు. జనకం ఏదో గుర్తుచేసుకొని నవ్వింది. 'తప్పకుండా లేపాలి!' అని నిశ్చయించి అతన్ని లేతగా తాకింది.

కృష్ణన్ మేలుకున్నాడు. రెప్ప వాల్చకుండా చూసాడు. చూపులో సహనం కనిపించలేదు.

"నమస్కారం చేస్తాను" అంది జనకం; అతను లేచి మంచంమీద కూర్చున్నాడు.

"లేవమంటావా?" అని అడిగాడు.

"కూర్చుంటే చాలు" అని చెప్పి జనకం భర్తకి నమస్కరించింది.

తరువాత "ఇక పొద్దున్నే మీరు నైవేద్యం తీసుకోవచ్చు. ఇప్పుడు నిద్రపోండి!" అని చెప్పి నిష్క్రమించింది.

---

[1] తమిళుల చీరకట్టు. తొమ్మిది గజాల చీరని రెండు కాళ్ళమధ్యనుంచి తిప్పుతూ కట్టుకుంటారు

[2] ఒక విధమైన కాయధాన్యాలు

[3] నోము తరువాత సుమంగళి కట్టుకునే పసుపు దారం

కృష్ణన్ మళ్లీ మంచంమీద వాలాడు. గదిలోని గడియారం చూసి సమయం రెండుగంటలు, ముప్పై నిమిషాలు అని తెలుసుకున్నాడు. ఈ అర్ధరాత్రిలో లేచి నోము చేసే భార్య శ్రద్ధని తలపోస్తూ మెలకువతో కొంచెం సేపు అలాగే కూర్చున్నాడు.

జనకం లోపలికి వెళ్ళి వంటగది, పూజగది  శుభ్రంచేసి, వెలిగించిన ఒక అగరుబత్తితో తిరిగివచ్చింది. కృష్ణన్ ముంజెయిని కళ్ళమీద ఒత్తుకొని పడుకొనివున్నాడు; అతను నిద్రపోతున్నాడో లేదో తెలియలేదు. అగరుబత్తిని దాని స్థానంలో చేర్చి జనకం తన మంచంలో వాలింది. ఆమె మనసులో నిండుగా తృప్తి చోటుచేసుకుంది. ఉదయం ఒక గంటకి లేవాలనే నిశ్చయంతో పడుక్కొని,  అలాగే లేచి, వేడినీళ్ళు సిద్ధం చేసి, స్నానం తరువాత, నోము చేసి, భర్తకి నమస్కారం చెయ్యడమైంది. మరెందుకు ఆమెకి పూర్ణ తృప్తి ఉండదు? కిందటి సంవత్సరమూ ఇవన్నీ చేసింది. కాని ఆరోజు  భర్త ఊరులో లేడు; అతనికి నమస్కారం చెయ్యలేదని జనకం నొచ్చుకుంది.

'ఈ సారి నేను వెన్న కూడా తీసేసాను!" అని గర్వపడగానే స్వతస్సిద్ధంగా ఆమె రెండు చేతులూ  భక్తితో కలుసుకున్నాయి.

** ** **

మూడు సంవత్సాలముందు జనకం సావిత్రి నోముకి స్వాగతం చెప్పిన తీరులో ఎంత భేదం!

పర్వతం అవ్వ వచ్చారు. "రేపు సావిత్రి నోము, తెలుసా?" అనే ప్రశ్నతో  వసారాలో వచ్చి కూర్చున్నారు.

జనకం వింది కాని ఏమీ అనలేదు. ఆమెకి ఆ నోములో శ్రద్ధ లేదు.

"పొద్దున్నే ఏడుగంటలముందు సరణి కట్టుకోవాలి!" అని ఆవిడ ఆరంభించారు.


జనకం నోరెత్తలేదు.

"మీ ఆయన ఎన్ని గంటలకి ఆఫీసుకి వెళ్ళాలి? లేకపోతే అతనికి మధ్యాహ్నం డ్యూటీయా?" అని ఆవిడ అడగ్గానే జవాబు చెప్పడానికి అగత్యం వచ్చేసింది.

"పొద్దున్నే . . .  అతను ఏడు గంటలకి వెళ్ళాలి."

"అలాగైతే ఆరుగంటలకి నోము పూర్తి చేసుకొని సరణి కట్టుకో! విను, మాఘం మాసంలోనే అలా చేస్తే విశేషం. మాఘం, ఫాల్గుణం ఎప్పుడు కలుసుకుంటాయని మనకి తెలియనప్పుడు ముందే కట్టుకుంటే మంచిది. నా తమ్ముడు పంచాంగం చూసి 'ఏడుగంటలు పదిహేను నిమిషాలు మంచి ముహూర్తం' అని రాసాడు. మా పొరుగింటి





మీనా మామగారు 'సరిగ్గా ఏడు గంటలు!' అని అంటున్నారట. నీ పుట్టినిల్లునుంచి నీకెవరైనా సరణి పంపించి "ఇన్ని గంటలకి కట్టుకో!' అని రాసారా?" అని అవ్వ మళ్ళీ అడిగారు.

"ఎవరూ రాయలేదు!" అని జనకం సూటిగా జవాబు చెప్పింది. ఆమెకి అవ్వమీద కోపమూ వచ్చింది. ప్రతీ పండుగకీ 'ఇలా చెయ్యాలి!, 'అలా చెయ్యాలి!' అని బోధించడం పర్వతం అవ్వకి అలవాటైపోయింది. ఆ పండుగ మరుదినం వచ్చి "ఏవమ్మా, అలా చేసావా?" అని ఆవిడ అడుగుతారు కూడా. కొత్తగా కాపురం చేస్తున్న జనకం కొన్నిసార్లు "లేదండి" అని నిజం చెప్తుంది. అప్పుడు ఆవిడ "ఇది మన తోబుట్టువులకి మంచిదమ్మా" అనో, లేక "ఈ నోము మన భవిష్యత్తుకి సన్మార్గంకి దోహదం చేస్తుంది!" అని నిత్యమూ చెప్తూనేవుంటారు. జనకం కలవరపడినా, ఆమెకి రోషం కలిగినా ఆమె అవ్వ ఉపదేశం లెక్కచెయ్యదు.

ఇప్పుడూ ఆమెకి అవ్వమీదనే కోపం వచ్చింది:

'నా తల్లిదండ్రులు, బంధువులు నా ఇష్టంకని వదిలేసి ఈ నోముగురించి ఏమీ రాయలేదు. మరి ఈ అవ్వ ఎందుకు నాకు పాఠం చెప్తోంది? ఇంతకీ మా ఆయనకి ఈ నోము పిండివంటలంటే ఇష్టమా? అతనికి తీపిగా ఏదీ నచ్చదే? 'ఇదేం భక్షణం?' అని అతను నన్ను ఎగతాళి చేస్తారేమో, ఎవరికి తెలుసు?'

ఇంతకుముందు జగతం రెండు సంవత్సరాలు తన అత్తగారింటిలో చాలామంది పుణ్యస్త్రీలతో ఈ సావిత్రి నోము చేసింది. ఆ వేడుక అక్కడ చాలా బ్రహ్మాండంగా జరిపారు. అప్పుడు కృష్ణన్ ఒక చిన్న బిళ్ళ మాత్రం ప్రసాదంగా తీసుకొని నోటిలో వేసుకోడం ఆమెకి గుర్తుంది.

ఈ వివరాలన్నీ అవ్వకి చెప్పడానికి ఇష్టం లేక జనకం క్లుప్తంగా మాటాడింది.

కాని అవ్వ ఊరుకోలేదు. "నేను రెండు రోజులుగా, సాయంకాలం, మజ్జిగ చిలుకుతాను. నీకు వెన్న, కొంచెం కారామణి పంపిస్తానులే!" అని అన్నారు ఆవిడ.

"ఎందుకండీ? మనం ఒకరిదగ్గర అప్పుచేసి దేవుడికి నైవేద్యం పెట్టాలా?"

"సరే, వద్దు. నువ్వే మజ్జిగ చిలుకు. నేనివ్వనులే."

"బాగా చెప్పారు! నేను కొనే పాలులో పెరుగంటూ గొప్పగా ఏమీ రాదండీ! అందువలనే మా ఇద్దరికే చాలీ చాలని అవస్థ . . ."

"మాదీ పెద్ద సంసారం, మేం ఎక్కువగా పాలు కొంటున్నామా, లేదే? విను, నేను ఏం చేస్తున్నానో, తెలుసా? ఒక చిన్నగిన్నెలో మజ్జిగ చిలికి, దాన్ని ఇంకోక పెద్ద

పాత్రలో పోసి, రోజూ చిలుకుతాను. అదే మా ఇంటికి నెయ్యిగా అవుతోంది. నువ్వూ ఒకే ఒక రోజు చేసి అలా చేసిచూడు!" అని అవ్వ రెచ్చగొట్టారు.

"'మజ్జిగ చాలా పలచగా ఉందే!' అని మా ఆయన తిట్టారంటే నేనేం చెయ్యను?"

"కొంచెం పెరుగు తీసుకొని, దానితో రెండు గరిటెలు మజ్జిగ కలిపి అతనికి వడ్డించు. ఒక రోజుకి అతను ఏం ఫిర్యాదు చేస్తాడో చూద్దాం!"

"అంటే నాకు పలచని మజ్జిగ అన్న మాట!" అని జనకం నవ్వింది.

"నోము నోచుకోవాలని ప్రయత్నం చేస్తున్నప్పుడు మజ్జిగ ఎలాగుంటేనేం? దృఢ సంకల్పం ఉంటే అంతా సాధ్యమే! 'దేవీ, వెన్న, ప్రసాదంతో నీ నోము నేను నెరవేర్చాను. ఇక ఒక రోజైనా మేం వేరే వేరేగా ఉండకూడదు! అని తన భర్త ప్రాణం కాపాడాలని సావిత్రి నోము చేసింది కదా?"

"సావిత్రి పురాణం నాకు తెలుసులెండి. వెన్నకి బదులు మనం నెయ్యి ఎందుకు వాడకూడదు?" అని మళ్ళీ జనకం నవ్వుతూ అడిగింది.

"నీకు ఏది ఇష్టమో అలాగే చెయ్యవమ్మా!" అని అంటూ అవ్వ లేచారు. "నా దగ్గర కారామణి ఉంది. ఇక్కడ దొరకడంలేదని నేను ఊరునించి ఒక డబ్బానిండా కొని తెచ్చాను. రెండు గిన్నెల బియ్యంకి ఒక పిడికెడు కారామణి చాలు. ముందుగా కారామణిని వేయించి నీళ్ళు పొయ్యి. అది ఉడికిన తరువాత బెల్లం వెయ్, అది కరగనీ! ఆ తరువాత ఏలకుల పొడి రువ్వు. బాగా పొంగిన తరువాత, ఆఖరికి, ఒక పళ్ళెంలో ఆ పిండిని పోసి ఆఱబెట్టు. అంతే, అదే నైవేద్యం -దాన్ని బిళ్ళలు బిళ్ళలుగా తీయవచ్చు. నేను వెన్న పంపిస్తాను, సరేనా?" అని చెప్పి తృప్తితో ఆవిడ నిష్క్రమించారు.

'నోము నోచుకోవడం నా వ్యక్తిగత ప్రశ్నకదా, అవ్వ ఎందుకిలా నా మీద అధికారం చెలాయిస్తున్నారు?' అనే భావనే జనకం మనసులో ఉంది. 'భారతధేశ స్త్రీల ప్రతిష్టకి భంగం రాకూడదు, ఆధునిక యువతుల ప్రతిష్ట క్షీణించకూడదు!' అనే ఉద్యమంకి ఈ అవ్వ ఒక సాధకంగా ఉన్నారు; ఆ సంగతి జనకం గ్రహించలేదు.

'అవ్వ కారామణి గురించి నాకు చెప్పినది ఒక వ్యాసంగా రాసి ఏదైనా పత్రికకి పంపిచవచ్చు. ఆవిడ ఎంత వివరంగా అన్నీ చెప్పారు!" అని జనకం ఆవిడని శ్లాఘించుకుంది.

'అవ్వ చిన్న వయసులోనే భర్తని పోగొట్టుకుంది. ఆవిడకి ఇతర యువతుల మంగళ జీవితంలో ఎంత అపేక్ష!' అనే మెచ్చుకోలు ఎందుకో ఆమె మనసులో చోటుచేసుకోలేదు.

జనకం మళ్ళీ కొంచెం సేపు ఆలోచించింది: 'మా ఆయనికి నచ్చని పిండివంట చెయ్యకపోతే నా పతిభక్తికి ఏ హానీ రాదు. ఆ కలవరంలో నేనతనికి మామూలుగా చేసే కాఫీ కూడా  బాగా లేదని అతనికి అసంతృప్తి కలిగితే? మరేం వద్దు! ఒక దీపం వెలిగించి, కొబ్బరికాయ నైవేద్యం పెట్టి అతనికి నమస్కారం చేస్తే చాలు!' అని నిశ్చయించింది.

'దేవుడా, పొద్దున్నే లేచి మడితో వేడినీళ్ళకి ఏర్పాటు చెయ్యాలి! పనిమనిషి ఆలస్యంగా వస్తుంది! . . . ' అనే బెంగ కూడా ఆమెని వదల్లేదు.

'నేను చల్లని నీళ్ళలోనే స్నానం చేస్తాను. తలకి స్నానం వద్దు! గొంతుకలో చిక్కు వస్తే సంఘంలో నటించబోయే నాటకంలో పాడవలసిన పాట ఏంకాను?' అనే దిగులు రాగానే ఆమె మనసులో ఒక దృఢ సంకల్పం చోటుచేసుకుంది: నోము గురించి అన్ని ఆలోచనలు త్వరలో జారుకున్నాయి.

** ** **

ఆ రోజు సాయంకాలం కృష్ణన్ ఇంటికి ఆలస్యంగా తిరిగి వచ్చాడు. 'దేవుడా, అతనికి ఏమైంది - ఏదైనా ఆపదలో చిక్కుకున్నారేమో? నేను నోముగురించి అశ్రద్ధగా ఉన్నానని నాకిది శిక్ష కాదుగదా?" అని జనకం అల్లాడిపోయింది. 'అలాగేం కాదు, ఇతను ఎవరైనా స్నేహితుడు ఇంటికి వెళ్ళివుంటారు, కాఫీ, టిఫను దొరికి ఉంటుంది! కడుపు నిండితే ఇంటి జ్ఞాపకం ఉండదు! కాని నేను మాత్రం 'అతను రానీ!' అని భోజనం చెయ్యకుండా కాచుకొనివున్నాను!" అని జనకం వాపోయింది.

కృష్ణన్ రాగానే "ఎందుకింత ఆలస్యం? నాకు ఆకలేస్తోంది!" అని సణుగ్గుంది.

"నువ్వెందుకు భోంచెయ్యలేదు?" అని భర్త అడిగాడు.

"ఇక అలాగే చేస్తానులెండి."

"ఇదిగో చూడు - రేపు  పండుగకి నీకిది పనికిరావచ్చు."

జనకం తల తిప్పి చూసింది. భర్త చెయిలో ఒక డబ్బా.

"ఇదెందుకండీ?"

"రేపు నోము కదూ? రాము తన భార్య అడిగిందని ఒక డబ్బా కొన్నాడు.  చదివి చూస్తే అది డాల్డా అమ్మే డబ్బాలాగ కనిపించింది. కాని అందులో వెన్న

అమ్ముతున్నారట! 'ఇదేంటి, దేవుడికి డబ్బా వెన్న ప్రసాదమా?' అని నేనూ నీలాగే ఆశ్చర్యంతో అడిగాను. 'వెన్న అనే పేరుతో ఎదైనా సరే, నాకు కావాలి!' అని నా భార్య హఠం చేస్తోంది!' అని రాము అన్నాడు!" అని కృష్ణన్ నవ్వాడు.

జనకం నవ్వకుండానే, విసుగ్గుంటూ "నేనూ హఠం చేస్తానని భయపడుతూ దీన్ని కొనితెచ్చారా?" అని అడిగింది.

"అతని భార్య అంతగా నొక్కిచెప్పిందని తెలిసిన తరువాత నాకూ కొనాలనిపించింది. నువ్వు మాత్రం ఎందుకు వెన్న లేకుండా నోము చెయ్యాలి? 'నోము తృప్తిగా నెరవేర్చాం!' అని మన మనసు కుదుటబడాలి; అదే కదా మనకి కావాలి?" అన్నాడు కృష్ణన్.

"మంచి పని చేసారులెండి."

ఇంతలో ఎవరో తలుపు తట్టడం విని జనకం తిరిగిచూసింది.

"మామీ, పర్వతం అవ్వ మీకు ఇవ్వమన్నారు!" అని అంటూ ఒక బాలకుడు ఒక చిన్న పాత్రతో లోపలికి వచ్చాడు. అందులో, ఒక తమలపాకులో వెన్న, ఒక పిడికెడు కారామణి ధాన్యాలు, సరణి - అవ్వ దీవెనతో జనకంకి వచ్చాయి.

కృష్ణన్ వింతగా చూసాడు. "భలే, నువ్వన్నీ ఏర్పాటు చేసేసావన్న మాట! మంచిది! నేను కొని తెచ్చిన వెన్న మనం రోటీకి, అరిసెలకీ వాడుదాం!" అన్నాడు.

"అవ్వ వెన్న తనే పంపిస్తానన్నారు. నేనడగలేదు."

కారామణి గురించి జనకం ఏమీ అనలేదు; బాలకుడు తెచ్చినవి అందుకుంది.

'వైధవ్యంకి 'కొఱతబోవడం' అనే అర్థమూ ఉంది. ఆ కొఱత రాకూడదనే ఈ నోము. అందుకే ఈ నోముని, మగువలు అన్ని విధాలా, ఏ లోపమూ లేకుండా నెరవేర్చాలని ఆతురతగా ఉన్నారు కాబోలు!' అని ఆలోచిస్తూ కృష్ణన్ ఆ రాత్రి నిద్రపోయాడు; భార్యని ఎగతాళి చేద్దామా అని కూడా ఆలోచించాడు. కాని ఇంతలో జనకం తన పడకని పరచి "నేను రేపు నోముకి ఒక కొబ్బరికాయ మాత్రం నైవేద్యంగా ఇస్తాను!" అని అంది. కాని వెంటనే తడబడుతూ "ఇంటిలో కొబ్బరికాయ లేదే? ఇప్పుడు కొట్టులో దొరుకుతుందా?" అని భర్తని అడిగింది.

అప్పుడు బజారుకి వెళ్ళడానికి అతనికి అలసటగా ఉందో, లేక నోములో భార్యకి అసక్తి లేదని అతని మనసులో ఉందో - కృష్ణన్ వెంటనే ఆమెకి జవాబు చెప్పాడు: "దీపం వెలిగించి ఒక నమస్కారం చేసేయ్, అది చాలు!"

"అవును, అలాగే చెయ్యవచ్చు. రెండు రోజులుగా ఇంటిలో ఎక్కడ చూసినా కొబ్బరికాయ పచ్చడి, కొబ్బరికాయ కలిపి చేసిన కూరలే చూస్తున్నాం! అదీ చాలదా అని ఎదురింటివారు నిన్న కొబ్బరి బర్ఫీ పంపించారు! కొబ్బరికాయని తలుచుకుంటేనే కడుపు తిప్పుతోంది!"

కొబ్బరికాయ కొనితెమ్మని జనకం భర్తకి నొక్కిచెప్పలేదు.

మరుదినం జనకం పొద్దున్నే లేచింది. నోము జ్ఞాపకం వచ్చింది; 'కొబ్బరికాయకూడా నైవేద్యంకి లేదు; చల్లనీళ్ళలో స్నానం తప్పకుండా చేసి తీరాలా? రోజూలాగ దీపం వెలిగించి, నమస్కరించి, సరణి కట్టుకుంటే చాలదా?' అని ఆలోచించింది.

కాని గభీమని ఏదో అడ్డు వచ్చింది. ఆ సాంప్రదాయికమైన మంత్రం - నోముకి మూలాధారమైన మంత్రం -వల్లించాలని ఆమె మనసులో ఒక ఆకాంక్ష లేచింది:

'నా భర్త ఆయురారోగ్యాలతో జీవించాలి, పూర్ణాయుష్కుడు కావాలి, జన్మజన్మలా అతనే నా భర్త కావాలి! ఇక ఒక రోజైనా మేం వేరేవేరేగా ఉండకూడదు!'

ఇదే ఆ మంత్రానికి అర్థం. దాన్ని మనసార, సార్థకంగా తను చెప్పాలి.

'కాని ఇప్పుడు తలచుకుంటే నా అవస్థ ఎలాగుంది?' అని జనకంకి తడబాటు కలిగింది.

'నేను దేవుడ్ని నిత్యమూ ఇదే వేడుకుంటున్నాను. ఇదే నా ఆకాంక్ష. దాన్ని ఇవాళ చెప్తేనేం, మరెప్పుడు చెప్తేనేం? కారామణి, వెన్న లేకపోతేనేం?'

ఇలాగ ఏమేమో ఆలోచనలు తలపోసుకుంటూ జనకం తన తడబాటు నివారించడానికి ప్రయత్నించింది. కాని బుద్ధికీ, అవగాహనస్థాయికీ మించిన ఏదో ఒక శక్తి ఆమె భ్రమని పీడించింది.

'ఒకే ఒక రోజు, కొంత సేపు, నీ చిన్నతనం, స్వార్థం పక్కకిపెట్టి ఆలోచించవేం? నీ భర్త నిత్యమూ నీతో 'ఉండాలంటే అది నిరాశ కాదా? సావిత్రి యముడ్ని గెలవాలని గ్రహించి నోము చెయ్యలేదు. 'గెలవాలి!' అనే దృఢ సంకల్పంతో నోము చేసి విజయం సాధించింది. "ఏడాదికొకసారి నువ్వు సావిత్రి చూపిన మార్గం పాటించి ఈ నోము చేస్తే నీ మాంగల్యం శోభిస్తుంది, నీ స్త్రీత్వం మెఱుగుపడుతుంది!" అని మన పురాణాలూ, పెద్దలూ చెప్పే బోధనలు నువ్వు వినలేదా? నీ ఇంటిలోనే ఉన్న నీ భర్తకి ఈ చిన్న సేవ చెయ్యడానికి నీకు మనసు లేదంటే నీకు మరేం సాధ్యం? భార్య స్థానంలో నీ బాధ్యతగురించి నువ్వు ఆలోచించావా?' అనే సందేశం మనసుని తారుమారు చేసింది.

పర్వతం అవ్వ జనకం జ్ఞాపకంలో వచ్చారు. 'నా వైధవ్యంకి ఈ నోములో నాకున్న నిర్లక్ష్యతే కారణం. దానికి యీడుగా ఇతరులకి నేనిప్పుడు బుద్ధి చెప్తున్నాను!' అని ఆవిడ ఉపదేశం వింటున్నట్టు జనకంకి భ్రమ కలిగింది.

పెరడు బావిలో నీళ్ళు తోడి జనకం స్నానం చేసింది. తరువాత ఇంటి పనులు చేసింది.

"ఏం చేస్తున్నావ్?" అని భర్త అడిగాడు; జనకం చెప్పింది.

"కొబ్బరికాయ కొందామా అని ఆలోచించాను. ఎందుకూ? కారామణికదా ముఖ్యం?" అన్నాడు అతను.

"ఎందుకు వద్దంటున్నారు? కొని తీసుకురండి! పనిమనిషికి ఇస్తాను . . . పిల్లలకీ ఇస్తాను . . . మనకి వద్దంటే సరే . . . "

ఎప్పుడైనా సరే తోసిపారేయడం సులభం. ఆమోదించడం కష్టం. కాని పట్టుదలతోబాటు ఒక పని సాధించితీరాలని ఆకాంక్ష కలిగితే అంగీకారంకూడా సులభం. జనకంలోని స్వార్థం త్వరలో మాయమైంది.

తొందరతొందరగా జనకం కారామణి అరిసెలు చేసి, అవ్వ పంపిన వెన్నతోబాటు దాన్ని నైవేద్యంగా సమర్పించింది. 'ఫాల్గుణమాసం వచ్చేసింది!' అని తొందరగా అన్నీ చేసింది.

"నమస్కారం చేస్తాను!" అని అంటూ జనకం భర్తని చేరుకుంది; అప్పుడే అతను ఆఫీసుకి వెళ్ళాలేమో అని గుర్తుచేసుకొని అడిగింది.

"ఇవాళ సెలవు తీసుకున్నాను . . . సాయంకాలం కొట్లు మూసివుంటాయి. లంఛ్ తరువాత షాపింగ్ వెల్దాం . . . సోమవారం నీ పుట్టినరోజు . . . ఒక ఇస్త్రీ పెట్టె కొందాం!" అన్నాడు కృష్ణన్.

జనకం లజ్జతో తలవంచుకుంది. పురాణకాల సావిత్రి పుట్టుక, చావు గురించి ఎవరూ మాటాడరు; ఆమె మనోధైర్యం, దృఢ సంకల్పం గురించి దేశమంతా పొగడుతున్నారు! 'నేనొక సోమరిపోతు, నా పుట్టినరోజు ఏం గొప్ప!' అని జనకం కుంగిపోయింది.

'పేద అయినా, పెద్ద అంతస్తులో ఉన్నా, భర్త తన సఖుడు, సహచరుడు, నాధుడు!" అనే భక్తి సావిత్రిని పూర్తిగా ఆవరించుకుంది. ఇప్పుడు కృష్ణన్ మనసు జనకంలోనున్న లోపాలేవీ లెక్క చెయ్యక, భార్య అనే అభిమానంతో ఆమెను

ఏలుకుంది. 'ఈ సావిత్రి నోములో ఒక సుమంగళికి - భార్యకి - కలిగే భాగ్యం ఈ పునరుద్ధరణ!' అనే జ్ఞానంతో జనకంకి పరవశం కలిగింది.

** ** **

ఇలాగ ఎన్నో ఆలోచనలు. జనకం నిద్ర రాకుండా పరుపుమీద దొర్లుతూవుంది. అది కృష్ణన్కి తెలియదే? ఇటీవల జనకం అనుభవించిన మానసిక వ్యధ ఎలా వర్ణించడం? కాని లోకజ్ఞానం అమెని రక్షించింది.

"నన్నూ ఉత్తికే లేపేసావ్! నీకూ నిద్ర లేదు! ఆ నోమేదో పొద్దునే చెయ్యకూడదా?" అని కృష్ణన్ నవ్వుతూనే భార్యని అడిగాడు.

"చాల్లేండి! మాఘం మాసంలో ఈ నోము చెయ్యాలి. రాత్రివేళే చెయ్యాలి. పగటిపూట ఫలం లేదు! ఇప్పుడు ఎవరికి ఏం కష్టం? ఒక రాత్రి నిద్ర పాడవుతే, పాడవనీ!" అని సావిత్రి అతనికి చెప్పింది.

"సత్యవాన్ని మన పురాణ సావిత్రి శాశ్వతమైన నిద్రనుంచి లేపింది. నువ్వు నన్ను తాత్కాలికమైన నిద్రనుంచి లేపాలని నోము చేసావన్న మాట!" అని కృష్ణన్ నవ్వాడు.

"చాల్లేండి, పిచ్చి మాటలు! నాకు నిద్రపోవాలని ఉంది; నేను ఒక గంటకే లేచాను!" అని చెప్పి జనకం సంభాషణ ఆపేసింది.

ఇంతకు ముందు 'నిద్రపోతున్న మనిషిని లేపాలా? నమస్కారం చెయ్యడానికని లేపాలా?' అనే ప్రశ్న లేచినప్పుడు, 'అవును, లేపాలి!' అని తను నిశ్చయం చెయ్యలేదూ? అప్పుడు తన మనసులో ఏముందో అదే ఇప్పుడూ అతనికి చెప్పేసిందికూడా!

మంగళసూత్రాన్ని జగతం చేతులు ఆతురతతో తడువుకున్నాయి; యీడేరిన ఒక భావన ఆమె మనసుని ఆవరించుకుంది.

********

**(మూలం ప్రచురణ: కలైమగళ్, ఏప్రల్, 1953)**



# మరపురాని బాధ

మా పొరుగింటి అమ్మాయి తన చంటిపిల్లతో మా ఇంటికి వచ్చింది. నేను శిశువుని చూసాను: పుష్టిగా పెరిగిన దేహం; సున్నితమైన చర్మం; టొమాటో లాగ ఎర్రని బుగ్గలు. ఆ తరువాత ఆ పాప చూపు - దేవుడు చూపు అలాగే ఉంటుంది కాబోలు! - చూసీ చూడనట్టు, తెలిసీ తెలియనట్టు, ఎంత ముచ్చటగా ఆ ముఖ విలాసం కనిపిస్తోంది! వెంటనే పాపని  నా భుజంమీద వాల్చుకొని దాని తల్లితో సంభాషణ ఆరంభించాను. మురళీ - పాప మురళీధరన్ - నా ఒడిలో నెమ్మదిగా ఉన్నాడు.  గభీమని నాకు జ్ఞాపకం వచ్చింది. 'అతనిదగ్గర చూపించాలి! అని అంటూ పాపని ఎత్తుకొని లేచాను. అమ్మాయి నవ్వింది. గర్వంతో "ఈ  కంబళిని పాప అడుగులో వేసుకొని వెళ్ళండి!" అని నాకు అందించింది. నేనూ ఇంకొక గదికి నడిచాను.

నేను పాపతో రావడం మావారు చూసారు, కాని లేతగా నవ్వుతూ, కదలకుండా, అలాగే కూర్చున్నారు. "రా, ఇలా ఇయ్యి!" అని చేతులు చాటి పాపని అందుకోరేం? అతనికి పాపని చూపించాలనేకదా నేను వస్తున్నాను?

"ఇదిగో, చూడండి, మొహం ఎంత అందంగా ఉంది!" అని అంటూ అతన్ని చూసాను. ముందులాగే అతని మొహంలో చిరునవ్వు కనిపించింది, కాని అతను నా మాటలు విన్నట్టు, పాప మొహం చూసి ఆనందించినట్టు ఏ సూచనా కనిపించలేదు.

"ఇలా చూడండి! . . . ముట్టుకొని చూడండి!" అని మళ్ళీ అన్నాను.

"చూసానులే . . . అప్పడాల పిండిలాగుంది . . . "

"అవునులెండి, మీకు అప్పడాల పిండి అంటే చాలా ఇష్టం! చంటిపాపలని చూస్తే  వెంటనే తీసుకోవాలని అనిపించదేం? ఇందులో  అప్పడాల పిండిలాగ ఆముదం లేదు, అంతా పటిక పంచదార లాగ తియ్యగా ఉంది! అవునా?" అని నా దృష్టి  పిల్లవాడిమీద మళ్ళించి ముద్దులాడాను.

అతనికి నా చేష్టలు చూసి  నవ్వాలని ఉందేమో? సరే, నవ్వనీ, నాకేం పోయింది?చంటిపాపలని లాలించినప్పుడు ఎవరైనా మందంగా ఉంటారా ఏమిటి?

పాపని ఎత్తుకుంటేనే ఎటువంటి ఉన్నత భావనలు కలుగుతాయని అతనికి తెలియాలి!

అతని నవ్వుచూసి నాకేం తలవంపు లేదని అతనికి చెప్పవద్దూ? నేను పాపతో అతనికి దగ్గరికి వెళ్ళి అధికారంతో అతని భుజంమీద పాపని కూర్చోబెట్టాను.

"నీకేం భయం వద్దులే, నేను పట్టుకొనివున్నాను!" అని పాపకి ధైర్యం చెప్పి అక్కడే నిల్చున్నాను.

"అయ్యో, వద్దు . . . నాకీ కితకితలు వద్దు!" అని అతను అరిచారు.

"బాగుంది, 'ఒడలు మైమరచినట్టుంది' అని అనరేం?" అని అంటూ పాప రెండు కాళ్ళు అతని మెడని చుట్టుకున్నట్టు అమర్చి, అతని మూపులో పెట్టాను; ఆ చిట్టి చేతులు అతని తల జుట్టుమీద పెట్టి చిన్నారి పాప వెనుక నిల్చొని ఆదుకున్నాను.

"అబ్బా, నా కొప్పు చింపిరైపోతోందే!" అని అతను సణుగ్గున్నారు; భుజాలు ఊపారు.

పాప మొహం ముడుచుకొని ఏడవడం ఆరంభించింది. అవును, మరి. ఇతని వాలకం చూస్తే ఎందుకు ఏడ్పు రాదు? నాకు మావారిమీద పట్టరాని కోపం వచ్చింది.

"పాప ఏడుస్తోంది! పొరబాటు నాదే! అసలు ఎందుకు దీన్ని మీ దగ్గర తీసుకొని వచ్చాను?" అని నొచ్చుకుంటూ నేను వెంటనే బయలుదేరాను. కాని గదినుంచి నిష్క్రమించినప్పుడు నాకు మావారిని తిరిగి చూడాలనిపించింది; పిల్లలమీద కోపం వస్తే మన మనసు మెత్తబడడం సహజం కదా? ఇప్పుడు నా కోపమూ తగ్గింది.

కొంచెం నిదానించి "పాప పేరు తెలుసా?" అని అడిగాను. అప్పుడుకూడా "పేరు ఏమిటి?" అని అతను అడగలేదు; నేనే చెప్పాను.

"మురళీధరన్! మురళీ! మీరు పేరుకూడా అడగరేం? 'మంచి అంకుల్!' అంటే ఇతనే!" అని పాపకి వల్లించినట్టు అతనికి చెప్పాను. ఇప్పుడు అతను లేతగా నవ్వారు. నవ్వనీ! నేను పడుచు భార్య కదా, నన్ను చూసి అతను నవ్వుతున్నారు! పాపని చూసి నవ్వాలనిపించదేం?

పాపతో దాని తల్లిని కలుసుకున్నాను. “అదేంటో, మగవాళ్ళకి పిల్లలని ఎత్తుకోవడం, ముద్దాడడం తెలీదమ్మా!” అని అంటూ పాపతో కుర్చీలో వాలాను.

“అవును . . . కాని కొందరు - అలాంటి మగవాళ్ళు అరుదనే చెప్పాలి - స్త్రీల కంటే ఎక్కువగా పిల్లల్ని ముద్దాడుతారు” అని ఆమె అంది.

“అది వాళ్ళ పరసరాలమీద ఆధారపడివుంటుంది. క్రమేణ అదే వాళ్ళకి అలవాటుగా ఐపోతుంది. మావారేమో పిల్లలతో ఎక్కువగా మెలగరు . . . ఇటీవల నేను ఏం చేస్తున్నానో తెలుసా? ఒ పాపని చూసినా నేను వెంటనే ఎత్తుకుంటాను, ఆటలాడుతాను, మా ఆయనికి చూపించి వస్తాను. ఇది నాకూ అలవాటైపోయింది- పిల్లలకి ఏదైనా వస్తువు చూపి పాఠం చెప్తున్నట్టు . . . ”

ఆమె నవ్వుతూనే నా మాటలు వింటోంది. నేనూ నవ్వుతూనే మనసు విప్పి నా కొరత ఆమెకి చెప్పాను.

“మావారి పెద్ద అక్కయ్య తన తమ్ముడుగురించి చిన్నబుచ్చుకుంది. అతని గురించి ఆవిడ చెప్పడంవలన అతని భార్య నా మనసులోనూ రోషం చోటుచేసుకుంది. ఆవిడ మాటల్లో న్యాయం లేకపోలేదు. ముగ్గురు పిల్లలతో అవిడ వచ్చారు, ఒక నెల పుట్టినిల్లులో బస చేసారు. మావారు ఆ పిల్లలని, ఒక రోజైనా, ఒక సారైనా మద్దాడితేనేకదా ఆ తల్లికి తృప్తి కలుగుతుంది? అతని వాటాని స్వీకరించి ఆ పిల్లలకి నేను ఎంత సేవ చేసినా మా ఆడపడుచుకి రవంతైనా తృప్తి లేదు. తమ్ముడిగరించి ఆవిడకి అసంతృప్తి నిలకడగా ఉందని నేను గ్రహించాను. అందువలనే ఇటీవల నాకీ అలవాటు . . . ”

“చిత్రా నా మేనకోడలు. జగ్గు, శ్రీను నా మేనల్లుడులు. ఈ మగ్గురు పిల్లల బాల్యంలో నేను చూసిన చురుకతనం, చాతుర్యం మావారికి చెప్తూ, ఆడపడుచు పొగడ్త పేడుతూ నేను కృషి చేసాను. ఆ పిల్లలు ఊరు వదలి వెళ్ళిన తరువాత కూడా మా ఇంటికి ఏ పాప వచ్చినా దాన్ని అతనికి చూపడం అలవాటు చేసుకున్నాను. చిన్న ఆకారంలో కనిపించే పాప అయినా సరే, మావారికి ఆ శిశువుపై గౌరవం కలగాలి అని నా ఆకాంక్ష . . . ”

నేనిదే ఆమెకి చెప్పాను. ఆమె నవ్వుతూ “తమకని సంతానం కలిగితో పిల్లల మహత్వం బోధపడుతుంది!” అని అంది.

నేనూ నవ్వేసాను. కాని వెంటనే ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"ఐనాకూడా పిల్లల మహత్వం తెలియని వాళ్లు లోకంలో చాలామంది ఉన్నారుగా? ఎందుకోగాని, మా ఆయనకి పిల్లలంటే ఆసక్తి లేదు . . . ఎలాగైనా అతనికి అపేక్ష కలగాలని నా ఆశ . . . పిల్లల్నిచూసి ఆనందించని మనసు ఏం మనసు? అది నాస్తికుల మనసులాగ . . . 'పిల్లలు దేవుడుతో సమానం!' అనే వచనం . . ." అని నేను లాగాను.

"నాకు బోధపడిందిలెండి . . . మీకు పిల్లలంటే చాలా ఇష్టం . . . "

నేను వెనకాడలేదు. ఎందుకంటే నాకు పిల్లలంటే ద్వేషం లేదు. 'నాకు పిల్లలు వద్దు!' అనే భావన ఉన్నా పిల్లలని విసుగ్గోకుండా నేను ముద్దాడుతాను. ఇది మా ఆయనకి చెప్పాలనుకున్నా అందుకు నాకు ధైర్యం లేదు. ఆ రోజుల్లో నేను అతనికి కొత్తగా, పడుచు భార్యగా ఉన్నాను.

ఇప్పుడు రోజులు మారాయి. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. నా మనసులో మార్పు. నా గురించి ఇతరుల దృక్పథంలో మార్పు వచ్చేసాయి. కాని మా ఇద్దరి కుటుంబంలో ఎటువంటి మార్పూ లేదు.

మనసులో భావన తీవ్రంగా పెరుగుతే పట్టుదలకూడా పెరుగుతుంది, లేకపోతే ఆకాంక్ష ఎదుగుతుంది. దేవుడా, నేనిప్పుడు అనుభవించేది ఆకాంక్ష!

** ** **

ఆ ఆమ్మాయే మళ్ళీ వచ్చింది; చెయిలో ఒక బిడ్డ. పక్కనే ఒక నాలుగేళ్ల పిల్లవాడు - ఆ రోజుల్లో శిశువుగా కనిపించినవాడు - తన చెల్లెలుతో మా ఇంటికి వచ్చాడు.

"నీ చెల్లెల్ని నాకిస్తావా?" అని అడుగుతూ నేను చనువుగా పిల్లవాడిని తాకాను. వాడు సిగ్గుతో మొహం ముడుచుకొని వెనకాడాడు. వాడి తల్లి చెయిలో శిశువుని చూసాను. కళ్ళలో తళతళలాడే కాంతి కనిపించింది - దేవుడి చూపు అలాగే ఉంటుంది. నన్ను చూడగానే పాప మొహం మళ్ళించుకుందే? అదెప్పుడూ తల్లితోనేవుంది, నా దగ్గరకి రాకూడదా? ఆ చిట్టిచేతులు నా వంక చాటితే ఎంత బాగున్ను! దేవుడి చూపులాగ ఈ పాప దృష్టికూడా నామీద పడలేదు!

నాకు పాపని తీసుకోవాలని ఆతురుత, కాని జంకాను. కొంత సమయం తరువాత  ఆమె ఆక్షేపించదనే ధైర్యంతో పని తీసుకొని గుండెలో ఒత్తుకున్నాను. అదే సమయం మావారు తలుపు పక్కన నిల్చొని నన్ను చూసి నవ్వుతున్నారు.

పాపతో అతని దగ్గరకి వెళ్ళాను. “చూసారా, తుంటరితనం అంటే ఇదే! పాపని తీసుకుంటారా?” అని అడిగాను. అతను చేతులు చాటారు. నేను పాపని అందించాను. అతని పాప నుదుటని ముద్దులాడి, అభిమానంతో దాని మొహం చూసారు. “చూసావా, నోరు ఎంత ముద్దుగా ఉందో?” అన్నారు. ‘శిశువుల బోసినోరు గురించి అందరికీ తెలుసుగా, ఇతనేం కొత్తగా చెప్తున్నారు?’ అని నేను ఆలోచించాను. కాని అతను ఆ మాటలు ఎందుకన్నారని నాకు తెలుసుగా?

“పాపకి ఒక బిస్కట్టు ఇయ్!” అని అన్నారు అతను.

“ఇదేం బిస్కట్టు తినే నోరు కాదండీ . . . సరే, పిల్లవాడికి ఇస్తాను!” అని అంటూ పాపని తీసుకున్నాను.

నా మనసు మళ్ళీ నా ఊహాలోకంలో సంచారం చేసింది. మావారు ఇటీవల ఏవేవో కొత్త ఆలోచనల్లో పడినట్టు కనిపించారు.

అతను వెళ్ళినతరువాత, శుష్కించిన మనసుతో, పాపని తల్లికి అందించాలని వంగాను. ఆమె పాపని తీసుకుంది.

“పాపం, మీ ఆయనకి పిలల్లంటే చాలా అభిమానం . . . ” అని అంది.

“లేదు . . . అవును . . . ” అని నేను తడబడుతూ అన్నాను.

“కొందరు మగవాళ్ళకి పిల్లలంటే . . . ” అని ఆమె ఏదో చెప్పాలనుకుందేమో? ఆమె ఏమంటుందో అనే గాబరాతో నేను అడ్డగించాను.

“ఇంతకు ముందే అతనికి పిల్లలంటే ఆసక్తి లేదు. ఒకప్పుడు మీరు వచ్చినప్పుడు మీకది చెప్పాను.”

‘నాకు గుర్తులేదు!’ అనే ధోరణిలో ఆమె నన్ను చూసింది.

“అసలు ఇంతకుముందు అతనెప్పుడూ పిల్లల్ని ఎత్తుకోరు! ముద్దాడడం ఇప్పుడే . . . ” నా కంఠధ్వని క్రమేణ అణగిపోయింది.

“అవును మరి. మనసంటే ఎప్పుడూ ఒకేలాగుంటుందా ఏమిటి?” అని మామూలుగా అంది ఆమె.

“అవును” అని నేనూ ఒక మారు అన్నాను. కాని ‘అవును’, ‘అవును’, అని నా మనసులో పదే పదే వల్లించుతూనే ఉన్నాను.

ఇప్పుడెల్లా - అవును, ఆ రోజుల్లాగ - నేను లేను. అవును, ఎవరూ అలాగే లేరుగా? . . . నేనిప్పుడు నోరు విప్పి మాట్లాడడం నేర్చుకున్నాను . . . ఎక్కువగానే మాటాడుతున్నాను . . . ఇంతకుముందు నాకు ‘భార్య’ అనే అంతస్తు ఉండేది . . . లేదు, మావారికి భర్త అనే హోదా గొప్పగా కనిపించేది . . . ఇప్పుడోమో అతనికి తండ్రి స్థానంలో ఆకాంక్ష, నాకు తల్లి స్థానంలో ఆకాంక్ష. లోకం పూర్తిగా మారిపోయింది. మాగురించి ఇతరుల అవగాహనలో ఎంత మార్పు!

అవును, ఇప్పుడు నాకన్నీ తెలుసు. తీవ్రంగా ఆలోచిస్తే నాకన్నీ బోధపడతాయి. ఇంతకుముందు నేను దేనిగురించి ఆలోచించినా సహజంగా, గుడ్డిపేటుగా చేసేదాన్ని; నా మాటల్లో భావన, వక్కాణింపు లేదు. నాలో ఉండేది పాప మనసు. అందులో ఆలోన, వివేకం లేదు. ఎది చూసినా బ్రహ్మాండంగా అనిపించేది. పాపని నేను ఎత్తుకుంటే ‘ఇదెందుకు పాపని ముద్దాడుతోంది?’ అని ఎవరికైనా అసహ్యం కలుగుతుందేమో?’ అనే దిగులు. పాపని ముద్దాడకపోతే, ‘అవునులే, దీనికి పిల్లలు పుట్టాలా, ఎందుకు?’ అని ఎవరైనా ఎగతాళి చేస్తారేమో అనే బాధ.

ఇలాగ ఎన్నో ఆలోచనల్లో నేను మునిగి తేలుతున్నాను.

ఇంకోక సంగతి; మావారు నా మూలం పిల్లల మహత్వం తెలుసుకున్నారు. అందుకు దేవుడు నాకు దోహదం చేసాడు.

కాని నా మనసులో ఓదార్పు లేదే? లోకం మరిచిపోయింది!

ఇంతకుందు సంతానం కావాలని ఆశించినది నేను, అతను కాదే? ఆ సంగతి లోకం మరిచిపోయిందే?

ఇప్పుడు పిల్లలు కనలేని నిరర్ధక భార్యగా నేను ఉన్నాను. పిల్లల మహత్వం అతనికి బోధించినది నేను. కావి లోకంకి ఆ గుర్తు లేదు. అవును మరి, ఎలా గుర్తు ఉంటుంది? అతనికి దాంపత్యంలోని ఆతురత క్రమేణ పిల్లలమీద ప్రేమగా పరిణమించింది.

"రాధా సమేతా కృష్ణా!" అని నేను పాట పాడినప్పుడు అతను విని ఆనందించేవారు. మరి ఇప్పుడేమో, "అమ్మా సమేతా నాన్నా!" అని పాప లేని ఇంటిలో అతని కల్పన సాగుతోంది!

గతకాలం నేను అనుభవించిన ఉన్నత భావనలు మరిచిపోయానని నాకు బాధగా ఉంది. దేవుడా, ఇతరులకి అది గుర్తు లేకపోవడం ఎంత శోచనీయం!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, ఫిబ్రవరి 5, 1950)**



# వ్యాపారి భార్య

గలగలమని ఎవరో నవ్వడం వినగానే శారనాదన్ జంకుతూ ఇంటిలోకి వెళ్ళకుండా గుమ్మం దగ్గరే నిల్చున్నాడు.

"ఎందుకే నవ్వుతున్నావ్?" అని అడుగుతున్న ఆ యువతి ఎవరు? ఆ యువతిలాగే శారనాదన్ కూడా ఆతురతతో జవాబుకోసం కాచుకొని ఉన్నాడు.

"మరేం లేదు. ఏదో జ్ఞాపకం వచ్చింది. నవ్వాను," అని అంది పంకజం; నవ్వుకి కారణమేమిటో చెప్పలేదు.

పంకజంతో మాటాడుతున్న ఆ యువతి కళ్యాణియే అయివుండాలని శారనాదన్ ఊహించాడు. ఇంత చనువుగా ఆమెతో మాటాడే స్నేహితులెవరూ లేరని అతనికి తెలుసు.

కళ్యాణి కంచుధ్వని బాగా వినిపించింది. "సరేలే, పెద్ద రహస్యం! నాకేం తెలియనక్కరలేదు!" అని మూతి ముడుచుకుంది. అది లెక్కచెయ్యకుండా పంకజం మళ్ళీ బిగ్గరగా నవ్వింది.

శారనాదన్ తనలో నవ్వుకున్నాడు. గభీమని ఒక ఆలోచన లేచింది: క్రిందటి సంవత్సరం తను ఇలాగే నిలబడిన దృశ్యం గుర్తుకు వచ్చింది.

ఎంతసేపు ఇలా అత్తవారింటి గుమ్మంలో నిలబడడం? నవ్వుకి కారణం చెప్పకుండా పంకజం నవ్వుతోందే?

ఇంతలో అతని వెనుక మాటలు వినిపించాయి.

"అల్లుడుగారూ, ఇక్కడే నిలబడతారేం? లోపలికి వెళ్ళండి!" అని అంటూ అతని మామగారు వచ్చారు. చెయిలో వార్తాపత్రికతో పొరుగింటినుంచి వచ్చిన మామగారిని చూసి శారనాదన్ ధుమధుమలాడాడు. ఎందుకంటే, తొంగి చూసి అతన్ని చూడగానే పంకజం లోపలికి వెళ్ళిపోయింది. ఇక ఆమె నవ్వుకి మరెక్కడ వ్యాఖ్యానం?

శారనాదన్ ఇంటిలోకి ప్రవేశించి తన గదికి వెళ్ళి కూర్చున్నాడు; మామగారిమీద లేచిన కోపం కళ్యాణిపట్ల కృతజ్ఞతగా మారిపోయింది.

కళ్యాణి పట్టువదల్లేదు. "ఏమే, నాకు జవాబేం చెప్పకుండా ఇదేం నవ్వు? నువ్వు కలకత్తాలో కాపురం చేసి నేర్చుకున్నది ఇదే కాబోలు!" అని పంకజం అమర్యాదని ఎత్తిపొడిచింది.

పంకజం చెప్పింది:

“కళ్యాణి, నాకొక కథ జ్ఞాపకం వచ్చింది. ఒక మంచి కోడలు కావాలని వెతుక్కుంటూ ఒక కోమటి ఒక ఊరులో బజారంతా తిరిగాడట. కొన్ని దుకాణ్ణాల్లో స్త్రీలే వ్యాపారం చేస్తున్నారు. ఆ రోజుల్లో డబ్బుకి బదులు బియ్యం ఇచ్చి వస్తువులు కొనడం అలవాటు. కొందరు బేరం మాట్లాడుకుంటున్నారు. బియ్యం, నూనె - ఈ రెండూ సరిసమానం అని కొందరి వాదం; చాలామంది సమ్మతించని వాదం అది. ఒక దుకాణంలో ఉన్న అమ్మాయి సరే అని ఒప్పుకుందట. ఒక పళ్ళెంలో బియ్యం కుప్పగా పోసి, కొలిచి, కొన్నతరువాత, బియ్యంకి బదులు అదే పళ్ళెంలో నూనె పోసి ఇచ్చేసిందట! ఎంత చమత్కారం! కోమటి ఆమెనే తన కోడలుగా ఎంచుకున్నాడట!” అని పంకజం డొంకతిరగుడుగా జవాబు ఇచ్చింది.

కళ్యాణి మోసం పోలేదు. “అసలు, నేను నిన్ను ఏమిటి అడిగాను? ‘మీ ఆయన నీకోసం ఎన్ని చీరలు కూడబెట్టుకొని వచ్చారు?’ అని. మరి, నువ్వేమో నవ్వుతూ నాకేదో కథ చెప్తున్నావ్, అవునా?” అని మళ్ళీ అడిగింది.

పంకజం జవాబు ఏమిటి? “నా నవ్వుకి కారణం నీ ప్రశ్న కాదు, నాకా కథ జ్ఞాపకం వచ్చింది . . . నువ్వు నమ్మకపోతే నేనేం చెయ్యను? . . . ఇక చీరలమాటకొస్తే మా ఆయన ఎన్ని చీరలు జమచేయగలరు? చూడు, ఈ చీరల్లో నీకెదైనా నచ్చితే నా జ్ఞాపకంగా నీ అమ్మగారు కొనవచ్చు!” అని అంటూ బీరువాని తెరిచి చూపించింది.


ఆ తరువాత ఏం జరిగింది? అది శారనాదన్కి తెలుసు. పంకజం కొన్ని చీరలు కళ్యాణికి ఇచ్చింది. కళ్యాణి తన తల్లికి చూపించి ఏమని అడిగిందో?

“డబ్బు రేపు ఇస్తే సరేనా?” అని అడుగుతూ కళ్యాణి ఒక చీర ఎంచుకుంది. పంకజం మెల్లగా ఆమెను చేరుకుంది. ఆమె చెవులకి బాగా వినబడినట్టు భర్తకి బిగ్గరగా చెప్పింది.

“ఆమెకి నచ్చిందని నేను ఇచ్చాను . . . నాకూ అటువంటి చీర కావాలి . . . సంక్రాంతికి మీకు కొత్త సరుకుగా చీరలు వస్తాయికదూ?” అని అతన్ని అడిగి కళ్యాణితో మాట్లాడానికి వెళ్ళిపోయింది.

‘మనిషికి తగిన వేషం, సందర్భంకి తగిన మాటలు!’ అని శారనాదన్ నిర్ఘాంతబోయాడు.

ఆరు నెలలకు ముందు కలకత్తాలో తను విన్నదీ, చూసినదీ, శారనాదన్ గుర్తుచేసుకున్నాడు. ఎంత మార్పు!



“ఏమే, నీ చీర బాగుంది! ఎక్కడ కొన్నావ్?” అని ఎవరో అడిగారు.

“మరెక్కడ? మా దుకాణంలోనే?” అని పంకజం కొంచెం గర్వంతోనే చెప్పింది.

“ఓహో, నేను మరిచిపోయాను. చీరలంటే నీకు ఖర్చు లేదుకదూ?” అని మరెవరో అన్నారు.

“బాగా చెప్పావ్, ఏదీ ఊరికే రాదు! దీని ధర అరవై రూపాయంలు! మా ఆయనేమో ఊరికే వచ్చినట్టు నాకు చీరలు ఇస్తున్నారు. నేను వద్దంటే అతనికి కోపం. పెళ్ళైన కొత్తలో అతను కొనితెచ్చిన చీరలు నేను ఇప్పుడూ వాడుతున్నాను. కిందటి నెల మా ఆయన మళ్ళీ నాకు మూడు చీరలు ఇచ్చారు . . . రంగు తగ్గకుండా ఈ చీరలన్నీ ఇంకా ఏడు సంవత్సరాలకి నేను వాడగలను. ‘ఈ రంగులో ఇక ఏ చీరా నీకు దొరకదు! అని అతనే వక్కాణించి చెప్పారు” అని పంకజం అనగానే కళ్యాణి ఆతురతతో “ఆ రంగులో ఇంకా చీరలు అతని దగ్గర ఉన్నాయా?” అని అడిగింది. “అదేమో, నాకు తెలియదు. మా ఆయనకి ‘మీరు ఇలాంటి చీరలు ఆర్డరు చెయ్యండి, చాలామంది కొంటారు!” అని చెప్తూనేవున్నాను. అతను ఏం చేసారో నాకు తెలీదు! నేను వాడిన చీరలాగ మీకు దొరికితే గొప్ప అదృష్టం అనాలి!” అని అంటూ పంకజం తన స్నేహితులతో చీరల దుకాణం ప్రవేశించింది.

వీధినుంచి ద్వారం దాటగానే ఒక పెద్ద హాలు - అదే చీరల దుకాణం. అక్కడ, ఒక చోట, ఏడు సంవత్సరాలముందు వచ్చిన సరకుని చూపించి పంకజం “ఓహో, అదే చీర మళ్ళీ వచ్చేసింది!” అని ఆశ్చర్యపడుతూ, “వెల పద్దెనిమిది రూపాయలు, నిజంగానా?” అని భర్తని అడిగింది.

“అవును!” అని భర్త ఆమోదించాడు: ‘ఆమె మాటల్లో చాతుర్యం, కుయుక్తి ఎలాగ వర్ణించడం?’ అని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నాడు.

పంకజం చీరలు అమ్మిన రొక్కం అతనికి అందించింది.

ఈ ఘటనలన్నీ కొన్ని మాసాలముందు జరిగినవే. కాని ఆ కొద్దికాలంలో శారనాదన్ ఎన్ని మార్పులు గ్రహించాడు!

కలకత్తాలో కాపురం, అంతకుముందు జరిగిన ఉత్తరాల పరివర్తన అతనికి మరపురాని అనుభవాలు. అతని మనసులో భార్యపట్ల ఉన్న ప్రేమానురాగాలు చాలా లోతుగా పాదుకోనివున్నాయి. ఆ పాతజ్ఞాపకాలు పదే పదే పటిక పంచదారలాగ నమలుతూ అతను ఆనందిస్తున్నాడు.

ఒక సంవత్సరం ముందు - ఇదే ఇంటి గుమ్మం ముందు - తను జంకుతూ నిలబడిన దృశ్యం ఇతనికి గుర్తు వచ్చింది. అప్పుడు ఆరంభించినది ఈ బంధం!

గలగలమని నవ్వుని వింటూ ఆ రోజు శారనాదన్ అలాగే నిల్చున్నాడు. తను వెతుక్కుంటూ వచ్చిన ఇంటిలో స్త్రీలే అధికపక్షంగా ఉంటారని తెలిసినా, "సార్!" అనే పిలిచాడు. అతనికి కావలసినది స్త్రీల గుంపే కదా?

ఒక అమ్మాయి తొంగిచూసి, ఏమీ అనక, పారిపోయింది. "ఎవరో గెస్టు మూటాముల్లెలతో వచ్చినట్టుంది!" అనే ఆమె మాటలు అతని చెవులకి వినిపించాయి.

ఇంకొక అమ్మాయి జంకుతూ తొంగిచూసింది. 'ఇద్దరూ అక్కా చెల్లెళ్లు కాదు!' అని శారనాదన్ ఊహించుకున్నాడు. మొదట వచ్చిన అమ్మాయి తెల్లని ముఖఛాయతో, కళ్ళద్దాలతో సొగసుగా కనిపించింది. జంకుతూ చూస్తున్న ఈ యువతి దేహం రంగు అంత తెల్లగా లేదు, మొహం గుండ్రంగా ఉంది.

రాగానే ముందు ఆ యువతి రిక్షాలో ఉన్న పెట్టెని చూసింది, ఆ తరువాతే శారనాదన్ని చూసింది. బయటికి వచ్చి "లోపలికి రావొచ్చుగా, రండి!" అని ఆహ్వానించింది.

"సార్ ఉన్నారా? బాంకు మానేజరు కృష్ణస్వామి నన్ను పంపారు" అని శారనాదన్ తన్ను పరిచయం చేసుకున్నాడు.

"నాన్నగారు బయటికి వెళ్ళారు; త్వరలో వచ్చేస్తారు. మీరు లోపలికి రండి," అని చెప్పి, యువతి రిక్షావాడిని చూసి రిక్షానుంచి మూటాముల్లెలు లోపలికి తీసుకురమ్మంది.

"నేను ఇక్కడనుంచి తిన్నగా రైల్వే స్టేషన్ వెళ్తున్నాను; Hold-all దింపవద్దు," అని చెప్పి శారనాదన్ పెట్టెని చెయిలో తీసుకొని ఇంటిలోకి ప్రవేశించాడు.

"పెట్టె మాత్రం ఎందుకు?" అని కళ్ళద్దాల యువతి ప్రశ్న శారనాదన్ విన్నాడు. "నేను కలకత్తానుంచి వస్తున్నాను. నిన్న వచ్చాను. కృష్ణస్వామి ఇంటిలో బస చేసి కొందరు తమిళులని కలుసుకున్నాను. మిమ్మల్ని చూద్దాం అని వచ్చాను. దీపావళి వస్తోందిగా?" అని అంటూ సరకు బయటకి తీసాడు.

"చీరలా? అమ్మోయ్, పట్టు చీరలా?" అని యువతి బొబ్బలు పెట్టింది.

"మీ అమ్మగారిని పిలవండి" అని శారనాదన్ నిదానంగా అన్నాడు.

"అమ్మకూడా బయటికి వెళ్ళింది" అని పంకజం తహతహలాడింది.

"నేను మా అమ్మని పిలుచుకని వస్తాను" అని కళ్ళద్దాల కళ్యాణి తనింటికి పరగెత్తింది.

పంకజం తడబడుతూనే చాప విరిచింది; "మాకు పట్టు చీరలు వద్దు!" అని మోటుగా చెప్పడానికి మనసు రాలేదు. 'ఈరోజుల్లో దీపావళికి చీరలు కొనడం అంత సులభమైన పని కాదే!" అని అంటూ నిష్క్రమించింది.

"మామీ, మంచి పట్టుచీరలు వచ్చాయి . . . రండి, చూడండి!" అని ఆమె ఎవరినో పిలిచే మాటలు వినిపించాయి. వసారాకి వెళ్ళింది. హిందీలో "బాయీ, ఆయీయే . . . " అని ఎవరికో స్వాగతం చెప్తూ వచ్చింది.

ఇంతలో కళ్యాణి తన తల్లితో వచ్చేసింది. "కళ్యాణి, నువ్వు వెళ్లి Mrs. Israelని పిలుచుకోని రా. Christmas వస్తోంది కదా, ఆవిడ కొంటారేమో?" అని అడిగి, కళ్యాణిని పంపించేసి పంకజం చీరల వ్యాపారి దగ్గర వచ్చింది. చీరలు చూసి, ధరలు అడిగి, వివరాలు తెలుసుకోనే వేళకి నలుగైదుగురు స్త్రీలు అక్కడకి వచ్చేసారు. "చూడండి", "చూడండి" అని పంకజం అందరినీ రెచ్చగొట్టింది. కాని మనసులో ఆరాటం తగ్గలేదు. చీరలు కొనే ఉద్దేశంతో ఎవరూ వచ్చినట్టు కనిపించలేదు. పెట్టె తెరిచిన తరువాత ఒక చీరకూడా ఎవరూ కొనలేదంటే ఆ వ్యాపారికి ఎలా ఉంటుంది? 'దీపావళికి నూలు బట్టలు కొనేసాం, మరేం వద్దు!' అని నేను ముందే చెప్పివుంటే ఇప్పుడు ఏ బాధా ఉండదు!' అని పంకజం అల్లాడింది. తల్లిగాని ఉంటే చపలంతో ఏమైనా కొంటుంది. నాన్నగారు మొగమాటం లేకుండా ఏమైనా అనేస్తారు. అమ్మ రాత్రి ఎనిమిది గంటలకి వస్తుంది. అంతకు ముందే నాన్నగారు వచ్చేస్తారు. ఆఖరికి చీరల వ్యాపారికి నిరాశ అన్నమాట!

చీరలు పరీక్ష చేస్తున్న స్త్రీలనీ, చీరలనీ, వ్యాపారిని, చూస్తూ పంకజం నిలబడింది. "ఈ చెక్ డిసైన్ చూడడానికి చాలా బాగుంది" అని Mrs. Israel అనగానే, పంకజం "మీ అభిరుచికి తగినట్టుగా మీకీ చీర కనిపించింది!" అని ఆవిడని పొగడింది.

పొరుగింటి ఇల్లాలు ఒక పచ్చరంగు చీరని ఆతురతతో తీసుకున్నారు. "అమ్మోయ్, నూటయాభై!" అని విస్తుపోయారు.

"పచ్చరంగుకి ధర ఎక్కువకదూ?" అని పంకజం అడగ్గానే శారనాదన్ "మీకెలా తెలుసు?" అని అడిగాడు.

సిగ్గు ఆవరించుకున్నా, సర్దుకొని "నూలుచీరల్లోనే పచ్చరంగుకి ధర ఎక్కువకదా? ఇటీవల రెండు చీరలు కొన్నాం" అని చెప్పి "అమ్మ వస్తోంతోందేమో, వెళ్ళి చూస్తాను" అని పంకజం వసారాకి నడిచింది.

ఇక తను చేసేదేముంది? రిక్షావాడు కాచుకొనివున్నాడు. వ్యాపారి సకాలంలో రైలు స్టేషన్ వెళ్ళాలి, లేకపోతే అతనికి నష్టం. ఇంతమందిలో ఎవరైనా తప్పకుండా చీర కొంటారనే ఉద్దేశంతో అతనికి రైలు ప్రయాణం లెక్కలేదేమో?

ఇంతలో కళ్యాణి కంఠధ్వని వినిపించింది.

"అమ్మా, ఆ ఊకబంతిపువ్వుల డిసైన్ చీర నాకు కావాలి!" అని కళ్యాణి నొక్కిచెప్తోంది. అంటే ఒక చీర కొనడం ఖాయమన్నమాట. కళ్యాణి ఆమె తల్లికి ముద్దుకూతురు. ఆమె హఠం సఫలమౌతుందో చూడాలి . . .

కాని, ఆశ్చర్యం! ఆ తల్లి సమ్మతించలేదు, కళ్యాణి మౌనం వహించింది . . .

కళ్యాణి హఠం చెయ్యకపోతే, ఈ చీర కొనడం అసాధ్యం . . .

పంకజం తనేం చెయ్యాలో నిశ్చయించింది. బేరం చేస్తున్న స్త్రీలని లెక్కచెయ్యకుండా, చీరల గుంపుని ఆరసించి ఒక చీర ఎంచుకుంది. 'ఈ రంగులో కళ్యాణి ఒక నూలు చీరలో ఎంత బ్రహ్మాండంగా కనిపించింది!' అని తనలో చెప్పుకుంది.

"అమ్మ నాకు చీర కొనదు!" అని కళ్యాణి సణుగ్గుంది.

"పెళ్లిచూపులకి ఎవరైనా వస్తే, నీకీ చీర కట్టుకోవాలని ఉందా?" అని పంకజం ఎగతాళి చేసింది.

కళ్యాణి తల్లి పంకజం ఎంచిన చీరని అందుకుంది. "దీన్ని ఇంటిలో చూపించి వస్తాను. సరేనా?" అని వ్యాపారిని అనుమతి అడిగింది.

"తప్పకుండా చూపించండి!" అని శారనాదన్ అన్నాడు.

"డబ్బుతో రండి!" అని పంకజం అరిచింది. ఆ మాటలు పలికిన మరు క్షణం సిగ్గుతో ఆమె కళ్ళు బాగా ఎఱ్ఱబారిపోయాయి. "అమ్మ ఇంకా రాలేదే?" అని గొణుకుతూ మళ్ళీ వసారాకి వెళ్ళింది.

చీర కోనడానికి అనుమతి దొరికిందని కళ్యాణి తల్లి మాటలు శారనాదన్ సహజంగా గ్రహించాడు. పంకజం సంతోషించింది. ఒక స్నేహితురాలు చీర కొన్న సంగతి తెలియగానే ఇతరులకీ ఆతురత కలిగింది. కాని డబ్బు వద్దా? ఆఖరికి Mrs. Rosa ఒక చీర కొన్నారు.

వ్యాపారి త్వరగా మూటగట్టాలని పంకజంకి ఆతురత. నాన్నగారు వస్తే, వ్యాపారి "మిమ్మల్ని కలుసుకోవాలనే వచ్చాను" అని చెప్తే అతను మొరటుగా ఏమైనా అంటారేమో అని దిగులు. ఆఖరికి అలాగే జరిగింది.

ఆమె నాన్నగారు వచ్చారు.

“మంచి వేళ, మా ఆవిడ లేనప్పుడు మీరు వచ్చారు! నాకూ, మా అమ్మాయికీ చీరలంటే మోజు లేదు. కాని మా ఆవిడ అమ్మాయి పెళ్ళికని చీరలు కొంటుంది. చెయిలో డబ్బు ఉండాలిగదా?” అన్నారు అతను.

“మీరేం బాధ పడవద్దు, సార్! మీకెప్పుడు చీరలు కావాలని మాకు రాయండి, పంపిస్తాం! కృష్ణస్వామికి ఒక మాట చెప్తే చాలు. నేను వస్తాను” అని శారనాదన్ శెలవు పుచ్చుకున్నాడు.

ఆ తరువాత, రెండు రోజులూ, ఆ పరసరాల్లో అందరూ చీరలగురించే మాటాడారు; మూడవరోజు వ్యాపారిగా వచ్చిన శారనాదన్ గురించే మాటాడారు. ఆ రెండు చీరలూ అమ్మేసిన తరువాత రసీదు ఇచ్చిన శారనాదన్ ఎవరని తెలిసిపోయింది.

కలకత్తాలో ఒక సంస్థలో గుమాస్తాగా పనిచేస్తూనే శారనాదన్ చీరల వ్యాపారం చేస్తున్నాడనే సంగతి మాత్రం కాదు. “పెళ్ళిచూపులకని ఎటువంటి ఆడంబరాలు నాకు వద్దు. నేను నా ఆపీసు పనిమీద వచ్చాను. ఇల్లు మారిపోయింది. కళ్యాణి తల్లిదండ్రులని చూడడానికి బదులు మీ ఇంటిలోకి దూరాను. అదీ మంచిదైంది!” అని పంకజంపై తనకున్న ప్రేమని ఆమె తండ్రికి శారనాదన్ ఒక ఉత్తరంలో తెలియజేసాడు.

ఆ ఉత్తరం చదివిన తరువాతే పంకజంకి వ్యాపారి మనసు బోధపడింది: చీర కొనాలని హఠం చేసిన యువతికి బదులు చీరలు అమ్మడానికి దోహదం చేసిన పంకజంని శారనాదన్ ఎన్నుకున్నాడు.

కళ్యాణిని పంపించేసి పంకజం వచ్చింది.

“నువ్వు చెప్పిన ఆ కోమటి కధ విన్నాను. అది నీ సొంత కల్పనా, లేక నీకెవరైనా చెప్పారా?” అని శారనాదన్ అడిగాడు.

“లేకపోతే మీ చీరల దుకాణం శోభించడం ఎలాగ? ఎవరు చీరలు కొంటారు?

“అవును, నీ తాళి కూడా శోభించాలి, అవునా? అని నవ్వుతూ అభిమానంతో శారనాదన్ భార్యని చూసాడు. ఆహ్లాదపడి పంకజం తల వంచుకుంది: ‘ఆరు మాసాలు నాతో కాపురం చేసిన నా భార్యకా ఈ లజ్జ?” అని అతనికి తన్మయం కలిగింది.

********

**(మూలం ప్రచురణ: కలైమగళ్, నవంబర్, 1952)**

# కాలక్షేపం[1]

"కాంతం, అవునుకాని, నేను రోజు పొద్దుట 10 గంటలకి ఆఫీసు వెళ్లి, రాత్రి 7 గంటలకి ఇంటికి వస్తున్నాను. నేనింట్లో లేనప్పుడు నీకెలాగ ఉబుసు పోతోంది? నీవింట్లో ఏం చేస్తుంటావు?" అని ఒకరోజు మా ఆవిడని అడిగాను.

"దానికేంలెండి, మీరు ఆఫీసుకి వెళ్ళగానే, యింటిపన్లు సవరించుకొని, ఏవో రెండు పత్రికలు చదివేసి, కొంతసేపు నిద్రపోయి లేచానంటే, యింతల్లోకి సాయంత్రం 4 గంటలకు పైగా ఐపోతుంది. కాఫీ చేసివుంచేసి వంట వండేసరికి రాత్రి 7 గంటలైపోతుంది. అప్పటికి మీరు వచ్చేస్తారు," అని సావధానంగా పలికింది.

కాని నాకు కాంతం మాటల్లో ఏమాత్రం నమ్మకం కలుగలేదు. అబ్బో, మాకాంతం ఏమిటి, పదిగంటలసేపు యెక్కడికి వెళ్ళక, యెవరితోనూ మాట్లాడకుండా ఉండడమేమిటి? అది అసలు నాతో ఎప్పుడూ ఏదో వాగుతూనే ఉంటుందికదా? 'సరే, దీనిమాటల్లో ఎంతవరకు కల్లనిజములు కలిసియున్నాయో తెలుసుకోవాలి,' అని నా మనసులో నిశ్చయించుకున్నాను.

ఆ రోజు ఆఫీసునుంచి యింటికి వేగంగానే వచ్చేసాను. రోజూ నేను 5 గంటలకి ఆఫీసు వదలగానే ఏ బీచికో, పార్కుకో, స్నేహితుల ఇళ్ళకో వెళ్ళి రాత్రి 7 గంటలకి ఇంటికి వస్తూవుంటాను. కాని ఆవేళ మాత్రం కాంతం సంగతి తెలుసుకోవాలని, మరెక్కడకీ వెళ్ళకుండా, ఆఫీసునుంచి తిన్నగా యింటికే వచ్చేసాను. నేననుకున్నట్లే కాంతం ఎక్కడికో బయలుదేడానికి డ్రెస్సయి, తయారుగా ఉంది.

నన్నుచూడగానే "ఏమండోయ్, మీరివాళ ఇంటికి వేగంగా దయచేసారే?" అని నవ్వుతూ వెటకారంగా అంది. "లేదు, కాంతం, ఇవాళ జోరుగా తలనొప్పి వేసింది; ఆఫీసులో సెలవు తీసుకొని వచ్చేసాను," అని అన్నాను.

---

[1] ఇది వింధియా తెలుగులో రాసిన ఒంటి కధ. ఇటీవల నేను తిరుచ్చి గ్రామంలో మా నాన్నగారు కాపురమున్న నివాసంకి వెళ్ళినప్పుడు ఇది నాకు అకస్మాత్తుగా దొరికింది. ఇది అక్కయ్య రాసిన మొట్టమొదటి రచన ఐవుండవచ్చును అని నా భావన. ఆమె రాసిన మొదటి తమిళ కధ **పార్వతి** ఆగస్ట్ 15, 1947 సంవత్సరం **కలైమగళ్** పత్రికలో వెలుబడింది.

“సరేలెండి . . వంటింట్లో ఫ్లాస్కులో కాఫీ పోసిపెట్టాను. నేను కమలా వాళ్ళింటికి వెళ్ళివస్తాను,” అని అంటూ కాంతం గబ గబా తన గదిలోకి వెళ్ళింది.

నేను కాఫీ తాగేసి, హాలులోకివచ్చి, మేజావద్ద నిల్చుని ఉన్నాను. కాంతం తన గదిలో, అద్దానికెదురుగా నిలబడి మొహంకి పవుడరు అద్దుకుంటోంది. కొంతసేపటికి “ఏమండీ, మీరుగాని ఎక్కడైనా నా సిల్కు hand kerchief చూసారా?” అని అడుగుతూ గదిలోనించి హాలుకి వచ్చింది.

“అబ్బే, నాకేంతెలుసునే నీ రుమాలు గురించి? నేనెక్కడా చూడలేదు . . . ఇప్పుడేగా ఇంటికి వచ్చాను?” అని అన్నాను.

“అయ్యో, సరికొత్త రుమాలండీ! నిన్ననే కొన్నాను. ఎంతో అందంగానూ, ఫేషణబుల్ గా కనిపించింది. ఇవాళే పైకితీసాను. నిస్కారణం, ఎక్కడో మంచి రుమాలు పోయింది,” అని గొణుక్కుంటూ గదిలో వెదకడం మొదలుబెట్టింది.

“ఛీ, ఛీ, ఎందుకలా గాబరా పడతావ్? ఎక్కడ పోతుంది నీ రుమాలు? ఇక్కడే ఎక్కడైనా ఉంటుందిలే . . . నెమ్మదిగా వెతకితేనే దొరుకుతుంది.”

కాంతం మళ్ళీ హాలు, వంటిల్లు, తన గది, ఏ ఒక్కచోటా మిగలకుండా, జల్లెడ వేసినట్లు వెదికింది. కాని, ఊహూం, ఆ రుమాలెక్కడైనా దొరుకుతేగా?

“అయితే, కాంతం, యివాళ మధ్యాహ్నం యెక్కడికైనా, యెవరింటికైనా వెళ్ళావేమో? అప్పుడు నీ దగ్గర రుమాలు ఉందో లేదో బాగా జ్ఞాపకం తెచ్చుకో!” అన్నాను.

వెంటనే కాంతం ఇలా గొణగడం ప్రారంభించింది: “అబ్బే, అప్పుడంతా నా దగ్గరనే అది జాగ్రత్తగావున్న జ్ఞాపకముంది. మొదట లక్ష్మీకాంతం ఇంటికి వెళ్ళినప్పుడు నా మొల్లో దోపుకొని ఉన్నాను. తోవలో, ఆ రుమాలుతో మొహం తుడుచుకున్నానుకూడాను. ఆ తరువాత వాళ్ళింటినుంచి మిస్సస్ శంకరంగారింటికి వెళ్ళాను. ఆవిడకూడా నా రుమాలు చూసి, ‘ఎక్కడ కొన్నావమ్మా యిది, చాలా బాగుందే?” అని అడిగారు. అక్కడనుంచి white shop కి వెళ్ళి రెండు జాకెట్టు గుడ్డలు ఐదు రూపాయలకి కొన్నాను. షాప్ వాడుకూడా రుమాలుచూసి, ‘అమ్మగారూ, నిన్నయిక్కడ కొన్న రుమాలు బాగుందా?’ అని అడిగాడు. అక్కడనుంచి నిన్న బేసరీకి ఆర్డరిచ్చినవాడి దగ్గరకి వెళ్ళి ‘బేసరి తయారయిందా?’ అని అడిగాను. వాడు ఇంకా రెండు రోజులతరువాత రమ్మన్నాడు. సరే అని మిస్ కలావతి ఇంటికి వెళ్తే,

ఆమెకూడా నా రుమాలుచూసి చాలా ఫేషణబుల్ గా వుందని చెప్పింది. ఇంటికి వస్తూండగా నా కళ్ళో ధూళి పడ్డాది. అదికూడా రుమాలుతో తుడుచుకున్నాను. ఇంటికి వచ్చినదాకా వుందికదా, మరి ఎక్కడకి పోయుంటుంది చెప్మా? . . . అయ్యో, కర్మం . . . సరికొత్త రుమాలు నిష్కారణంగా పోయింది! . . . నాకు తల్చుకుంటే ఇంతా అంత దుఃఖంకాదు . . . అలాగుంది నా సంగతి . . ." అని నొచ్చుకుంది.

నేను నవ్వుకున్నాను. "ఐతే అది ఎక్కడికో రెక్కలు కట్టుకొని ఎగిరిపోయుంటుందా ఏమిటి? సరే, నువ్వుకూడా రెక్కలంటించుకొని, దాన్ని వెంటబెట్టు," అని నవ్వుతూ అన్నాను.

"అబ్బ, పోనిద్దురూ, మీకు హాస్యంగా, నవ్వుగా వుంది - నేనిలా ఏడుస్తూవుంటే . . . " అని అంది కాంతం సగం నవ్వుతూనూ, సగం ఏడుస్తూనూ.

"ఐతే, కాంతం, ఇక్కడేవుండు, నేను వెళ్ళి వెతుకుతాను," అని వంటింట్లోకి పోయి, ఆ రుమాలుని చేత్తో పట్టుకొని హాలుకి వచ్చాను. కాంతం, సంతోషంతో నా చేతుల్లోనుంచి దాన్ని లాగ్గుంది.

"చూసావా కాంతం, నేనెంత వేగం వెతకితెచ్చానో? నీకు వెతకడం చేతకాదు. కాని పోగొట్టుకొని ఏడవడంమాత్రం బాగా తెలుసు."

"ఐతే అది ఎక్కడ వున్నండీ?"

"అదుగో, వంటగదిలో ఆ స్టాండుపక్కనే వుంది. వెళ్ళగానే అగుపడ్డాది. తీసుకువచ్చాను."

"నేను వెతికినప్పుడు అక్కడ లేనేలేదే . . .?"

"వహ్వా! అంత చక్కగా కళ్ళుపెట్టుకొని చూసావన్నమాట!"

కాంతం నవ్వి ఊరుకుంది.

"కాంతం, నేనాఫీసుకి పోయినప్పుడు నీకెలా ఉబుసు పోతుందని నాకు ఇప్పుడు బాగా తెలిసింది. నేనడిగినప్పుడు వంటన్నావ్ . . . జ్ఞాపకం తెచ్చుకో . . . అమ్మోయ్, నువ్వెంత చలాకీదానివి! . . . నేను నీ మాటల్లో నిజమెంతవరకున్నదో తెలుసుకోవాలనే ఈ రుమాలు దాచాను . . . " అని అన్నాను.

ఏమీ అనకుండా కాంతం గిర్రున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయింది.

పాఠకులారా! చూసారా, మా కాంతం నేనాఫీసుకి వెళ్ళినప్పుడు ఎలా కాలక్షేపం చేస్తుందో?

********

# వింధియా కథలు

సంపుటం 1 ప్రేమ హృదయం (2018)

సంపుటం 2 పార్వతి (2010)

సంపుటం 3 మొలకెత్తిన ముత్యం (2019)

సంపుటం 4 తీయని చుట్టరికం (2019)

సంపుటం 5 ఇదొక శుభవేళ! (2020)

సంపుటం 6 అతను ఎవరు? (2020)

సంపుటం 7 ఒక పురాతన చిహ్నాం (2021)

సంపుటం 8 ప్రేమ ఆధిపత్యంలో (2021)

********